www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



2

వర్క్ ఫ్రం కారు

ట్రాఫిక్ జాంలో కారు నుంచే ఆఫీసు పని

బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నిర్వాకం

గుర్తించి జరిమానా విధించిన పోలీసులు

శుక్రవారం | 14-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 300 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 9.53 తదుపరి తదియ; నక్షత్రం: పుబ్బ రా. 11.09 తదుపరి ఉత్తర; వర్జ్యం: తే. ఉ. 7.31; దుర్ముహూర్తం: ఉ. 9.03-9.49, మ. 12.52-1.38; అమృతఘడియలు: సా. 4.12-5.56; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.12 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వంశీ అరెస్ట్



బెదిరింపులు, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

హైదరాబాద్‌లో అరెస్టు.. విజయవాడకు తరలింపు

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరో మలుపు

కేసు వాపసు కోసం ఫిర్యాదుదారుకు బెదిరింపులు

రాజీకి రాకపోతే నా తమ్ముడిని చంపేస్తామన్నారు

కోర్టులో నా తమ్ముడితో బలవంతపు వాంగ్మూలం

కిడ్నాప్ చేశారని సత్యవర్ధన్ సోదరుడి ఫిర్యాదు

వంశీ ఏ1గా రెండు కేసులు నమోదు

విచారణలో 'తెలియదు' అనే సమాధానం

వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు

రిమాండ్‌పై అర్ధరాత్రి దాటాకా సుదీర్ఘ వాదనలు

చివరికి.. వంశీకి జ్యుడీషియల్ రిమాండ్



వైద్య పరీక్షల కోసం వంశీని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చిన పోలీసులు

విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కథ అడ్డం తిరిగింది! ఒక కేసు నుంచి తప్పించుకునేందుకు అతి తెలివితో వేసిన ఎత్తుగడ వికటించింది. మరో తీవ్రమైన కేసులో ఇరుక్కునేలా చేసింది. అరెస్టు... జ్యుడీషియల్ రిమాండ్ దాకా వెళ్లింది. 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసును నీరు గార్చేందుకు మాజీ ఎమ్మెల్యే, వివాదాస్పద వైసీపీ నేత వల్లభనేని వంశీ పన్నిన పథకం తిరిగి ఆయన మెడకే చుట్టుకుంది. కిడ్నాప్, బెదిరింపులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో వంశీని గురువారం ఉదయం విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదు వాపస్ తీసుకునేలా తన సోదరుడు ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి, భయపెట్టారని... కిడ్నాప్ కూడా చేశారని కిరణ్ అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీకి చెందిన బీసీ, మైనారిటీ, దళిత నాయకులు ముగ్గురు చేసిన ఫిర్యాదుపై ఇంకో కేసు పెట్టారు. ఈ రెండు కేసుల్లో పోలీసులు వల్లభనేని వంశీని ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. ఆయన ప్రధాన అనుచరులు

మిగతా 13వ పేజీలో...

నొటోరియస్ క్రిమినల్!

చట్టం, న్యాయం అంటే వంశీకి లెక్కేలేదు

ఆయనపై 16 క్రిమినల్ కేసులు

ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్‌కు బెదిరింపులు

బలవంతంగా కేసు వాపసు వాంగ్మూలం

హైదరాబాద్‌లో రాత్రంతా చిత్ర హింసలు

విశాఖలో హోటల్, గెస్ట్‌హౌస్‌లో నిర్బంధం

రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి

పథకం ప్రకారమే నాటి దాడి

బూతుల వర్షంతో రెచ్చగొట్టిన వంశీ

టీడీపీ నేతలను గన్నవరం రప్పించి రాళ్లవాన

టీడీపీ కార్యాలయం ధ్వంసం.. కార్ల దహనం

అడ్డుకున్న టీడీపీ శ్రేణులపై రౌడీలతో దాడి

పట్టాభి లక్ష్యంగా రోజంతా బీభత్సకాండ 13

'గన్నవరం' కేసులో నిందితులకు షాక్

36 మందికి ముందస్తు బెయిల్ నిరాకరణ

పది మందికి రెగ్యులర్ బెయిల్ మంజూరు



జలవనరుల శాఖపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పొల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు

నీటి ప్రాజెక్టులు గడువులోగా పూర్తవ్వాలి

లేదంటే కాంట్రాక్టు సంస్థలు, అధికారులే బాధ్యులు: సీఎం

2027 చివరికి పోలవరం పూర్తికావాలి

పనులపై నిరంతరం సమీక్షించుకోవాలి

ప్రాజెక్టు ఫలితాలు వచ్చేలోగా ఉత్తరాంధ్రకు సుజల స్రవంతి ఫలాలు!

వెలిగొండ 30 ఏళ్లుగా పూర్తికాకపోవడం బాధాకరం

భూగర్భజలాలపై మంత్రులతో కమిటీ

'బనకచర్ల'కు ప్రత్యేక కార్పొరేషన్: బాబు

మూడు దశల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం

2026 నాటికి హంద్రీ-నీవా తొలిదశ

మే నెలకల్లా పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్ పూర్తి

జలవనరుల శాఖ కార్యాచరణ

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గడువులోగా ప్రాజెక్టుల పనులు పూర్తికావలసిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అలా పూర్తి చేయకపోతే కాంట్రాక్టు సంస్థలు, అధికారులనే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. 2027 డిసెంబరునాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని.. దాని ఫలితాలు వచ్చేలోగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఫలాలు ఆ ప్రాంత ప్రజలకు దక్కాలని చెప్పారు. గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖపై ఆయన సమీక్షించారు. పోలవరం పనులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 1,379 మీటర్ల డయాఫ్రం వాల్.. ఇప్పటికి 51 మీటర్ల

మిగతా 14వ పేజీలో...

టాప్ 4లో చంద్రబాబు

ఇండియా టుడే సర్వేలో నాల్గవ స్థానం

'మూడ్ ఆఫ్ ది నేషన్'లో తాజాగా వెల్లడి 14



ఇంఫాల్‌లో భద్రతా దళాల పహారా

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన 2

హోంశాఖ ప్రకటన.. రాష్ట్రంలో తొలగని రాజకీయ అనిశ్చితి

సరిహద్దుల్లో పాక్ కాల్పులు 2

దీటుగా బదులిచ్చిన భారత సైన్యం

పాక్‌వైపు భారీగా ప్రాణ నష్టం!

సైనికుల మృతదేహాలకు పాకిస్థాన్ అధికారి నివాళి వీడియో వైరల్



13

సిట్ కస్టడీకి 'కల్తీ నెయ్యి' నిందితులు

తిరుమల నడక మార్గంలో చిరుత! 3

మంత్రి మెహర్బానీ ఖరీదు రూ.343 కోట్లు!

అవసరం లేకున్నా 33/11 కేవీ లైన్ పనులు

కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో చేపట్టేందుకు టెండర్ నోటిఫికేషన్

తెరవెనుక ఏం జరిగిందా అని సిబ్బంది ఆరా

లోవోల్టేజీతో బల్బులు పోతున్నాయంటూ డిస్కంకు ముగ్గురు ఎమ్మెల్యేల లేఖలు

విద్యుత్ కెపాసిటీ పెంచాలని సూచన

లేఖ రాసినందుకు తలో రూ.కోటి?

ఈ తతంగం వెనుక సీమ మంత్రి

సీఎంవోకు చేరిన సమాచారం!

చర్యలకు అధికారులు సన్నద్ధం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అవసరం లేనప్పటికీ కొత్తగా 33/11 కేవీ లైన్ వేసేందుకు.. రూ.343 కోట్లను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి అప్పు తెచ్చి మరీ ఖర్చు చేసేందుకు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) సిద్ధమైంది. రాయలసీమలో అత్యంత కీలకమైన జిల్లాకు చెందిన ఒక మంత్రి కోసం ఇలా చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులను తమ సన్నిహితులైన కాంట్రాక్టర్లకు అప్పగించి.. వారి నుంచి కమీషన్లు వసూలు చేసుకోవడానికి ఆయన పూనుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ డిస్కం పరిధిలోనే గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, ట్రాన్స్‌మిషన్ వైర్లు వంటివాటి కొనుగోలులో రూ.వేల కోట్ల అవినీతి చోటు చేసుకుంది. ఈ మంత్రి కూడా ఇప్పుడదే తరహాలో ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టేందుకు సమాయత్తమయ్యారని జోరుగా ప్రచారం సాగుతోంది.

- ఎవరున్నారని కూపీ లాగితే..

అవసరం లేకున్నా డిమాండ్‌ను చూపిస్తూ.. కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో 33 కేవీ లైన్ పనులు సృష్టించారని విద్యుత్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇందుకోసం రూ.343 కోట్ల వ్యయంతో పరికరాల కొనుగోలుకు ఎస్పీడీసీఎల్ టెండర్లు పిలిచింది. టెండర్ నోటిఫికేషన్ చూశాక.. కొందరు డిస్కం ఉద్యోగులు దీని వెనుక ఉన్న పెద్దలెవరా అని ఆరా తీశారు. పెద్ద గూడుపుఠాణీయే ఉందని వారికి తెలిసింది. ఈ మూడు జిల్లాల్లో విద్యుత్ ప్రవాహం తగ్గిపోతోందని.. లోవోల్టేజీ సమస్య

మిగతా 14వ పేజీలో...



మే 19 నుంచి ఈఏపీసెట్

6న ఈసెట్, 7న ఐసెట్ 14

ప్రవేశ పరీక్షల తేదీలు విడుదల

భూములు, ఆస్తులు, వివాహ రిజిస్ట్రేషన్లకూ ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్

కొత్తగా అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం

వినియోగదారులకు తప్పనున్న తిప్పలు 12

స్లాట్ బుకింగ్‌కు నో ఫీజు.. మార్గదర్శకాలు జారీ

తండ్రికి చెప్పకుండా బ్యాంకాక్‌కు..

కొడుకు కిడ్నాప్ అయ్యాడన్న ఆందోళనతో విమానాన్ని వెనక్కి రప్పించిన తండ్రి 2

మహారాష్ట్రలోని పుణెలో ఘటన.. తండ్రి రాష్ట్ర మాజీ మంత్రి, శిందే వర్గం ఎమ్మెల్యే

ఇంటర్‌లో ఎంబైపీసీ

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుకు నిర్ణయం

అన్ని ప్రభుత్వ కాలేజీల్లో అందుబాటులోకి కోర్సు

ఇంటర్‌లో ఇకపై 5 సబ్జెక్టుల విధానం

ఒకటే సబ్జెక్టుగా గణితం.. బోటనీ, జువాలజీ కలిపి బయాలజీ

సైన్సు గ్రూపుల్లో ఆప్షనల్‌గా ఆరోది

వచ్చే ఏడాది నుంచి కొత్త సిలబస్‌తో పాఠ్యపుస్తకాలు

ఫస్టియర్ పరీక్షల రద్దు నిర్ణయం వాయిదా

ఇంటర్ విద్యపై బోర్డు కీలక నిర్ణయాలు



అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ విద్యలో పలు కీలక మార్పులు రానున్నాయి. ఇటీవల నాలుగు కీలక ప్రతిపాదనలు తీసుకొచ్చిన ఇంటర్ విద్యా మండలి వాటిలో రెండింటిని వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. సబ్జెక్టుల కాంబినేషన్లు, సిలబస్-పాఠ్యపుస్తకాల సవరణ సంస్కరణలు 2025-26 విద్యా సంవత్సరం నుంచి

మిగతా 2వ పేజీలో...



అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ తులసీ గబార్డ్‌తో మోదీ

ఈ రోజు చాలా ముఖ్యమైనది!

ప్రతీకార సుంకాలు ఉంటాయి

మోదీతో భేటీకి ముందు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్య

ఎలాన్ మస్క్, తులసీ గబార్డ్‌తో మోదీ భేటీ

చదువుకోండి.. పని చేసుకోండి!

భారతీయ విద్యార్థులకు యూకే ఆహ్వానం

వాషింగ్టన్, ఫిబ్రవరి 13: ప్రధాని మోదీతో భేటీకి కొద్ది గంటల ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియాలో పెద్ద బాంబ్ పేల్చారు! ప్రతీకార రుసుములపై తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో కీలక పోస్ట్ చేశారు. "మూడు వారాలు గొప్పగా నడిచాయి. కానీ, ఈ రోజు మరింత ముఖ్యమైనది. ప్రతీకార

మిగతా 2వ పేజీలో...

కోళ్లకు మరణశాసనం!

వ్యాక్సిన్ లేని వైరస్ బర్డ్ ఫ్లూ

వలస పక్షులతోనే వ్యాధి వ్యాప్తి

ఇది మనుషులకు సోకదు

జీవ భద్రతా చర్యలతో నివారణ

పశువైద్య నిపుణుల సూచన

గోదావరి జిల్లాల్లో వ్యాప్తిపై ఆందోళన

అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం



3

గుంటూరులో జీబీఎస్ కలకలం 12

ఉమ్మడి జిల్లాలో ఏడు కేసులు

ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం

ఒకరు వెంటిలేటర్‌పై..

తమిళనాడుకు చేరిన పవన్ ఆధ్యాత్మిక యాత్ర

తంజావూరు, కుంభకోణం ఆలయాల్లో పూజలు

కందషష్టి కవచ పారాయణంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం

ఆలయాల్లో రాజకీయాలు వద్దు ప్లీజ్

మీడియాకు వినతి



కుంభకోణంలోని ఆది కుంభేశ్వరర్ ఆలయంలోకి వెళ్తున్న పవన్, అకిరా నందన్ 14

బుల్లెట్ నడిపాడని చేతులు నరికారు

తమిళనాడులో దళిత యువకుడిపై అగ్రవర్ణాల దాష్టీకం.. బాధితుడు కాలేజీకి వెళ్తుండగా ఘటన

రెండు చేతులు అతికించే ప్రయత్నం చేస్తున్న వైద్యులు



చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ దళిత యువకుడు తనకు ఇష్టమైన బుల్లెట్ బండి నడపడమే తప్పిదమైపోయింది! 'జాతి తక్కువవాడివి!! మా ముందు బండి నడపడమేంట'ంటూ కొంతమంది అగ్రవర్ణాల వారు ఆ యువకుడి రెండు

మిగతా 2వ పేజీలో...

పార్లమెంట్ ముందుకు వక్ఫ్ బిల్లుపై జేపీసీ నివేదిక!

అసమ్మతి నోట్‌ను నివేదికలోంచి తొలగించారంటూ విపక్షాల అభ్యంతరం 2

సభ్యుల నిరసనలు, నినాదాలు, వాకౌట్లు

ముగిసిన తొలి విడత బడ్జెట్ సమావేశాలు

వక్ఫ్ సమస్యలపై దుష్ప్రచారం.. ఆమోదిస్తే దేశవ్యాప్త ఉద్యమం: ముస్లిం పర్సనల్ లా బోర్డు

లోక్‌సభలో కొత్త ఆదాయ పన్ను బిల్లు

ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

వర్క్ ఫ్రం కారు



- ట్రాఫిక్ జాంలో కారు నుంచే ఆఫీసు పని
- ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు పోలీసుల జరిమానా

బెంగళూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'వర్క్ ఫ్రం హోం అనేది మీ ఇష్టం..కానీ, వర్క్ ఫ్రం కార్ కుదరదంటే కుదరదు' అంటూ బెంగళూరు పోలీసులు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు జరిమానా విధించారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని ఓ కంపెనీ కార్యాలయం నుంచి ఆర్‌టీ నగర్‌లోని తన ఇంటికి ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కారులో బయల్దేరారు. ఈ మార్గమంతా సాయంత్రం ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. ఆమె డ్రైవింగ్ చేస్తూనే లాప్‌టాప్ ఆపరేట్ చేశారు. సోమవారంనాటి ఈ ఘటనపై వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఆ కారును ట్రాక్ చేసి గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆమెకు బుధవారం రూ.1,000 జరిమానా విధించారు. మరోసారి ఇలా ప్రవర్తిస్తే జరిమానాతో పాటు ఇతర చర్యలుంటాయని హెచ్చరించారు. డ్రైవింగ్ చేస్తూ లాప్‌టాప్ వినియోగించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. యాజమాన్యాల ఒత్తిడి కారణంగానే ఉద్యోగులు ఇలా వ్యవహరిస్తున్నారని కొందరు సమర్థించగా.. మరి కొందరు వ్యతిరేకించారు.

స్కూల్ ఫేర్‌వెల్‌కు.. 35 లగ్జరీ కార్లతో కాన్వాయ్.. స్టంట్లు





- సూరత్‌లోని ఓల్పాడ్ ప్రాంతంలో ఘటన

సూరత్, ఫిబ్రవరి 13: వారంతా 12వ తరగతి విద్యార్థులు..! వార్షిక పరీక్షల వేళ.. స్కూలులో నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీకి 35 లగ్జరీ కార్లతో కాన్వాయ్ నిర్వహించి, స్టంట్లు చేశారు. తల్లిదండ్రులను పోలీసు కేసుల్లో ఇరికించారు. ఈ ఘటన గుజరాత్‌లోని సూరత్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సూరత్‌లోని ఓల్పాడ్ ప్రాంతంలోని ఓ స్కూల్‌లో ఇటీవల ఫేర్‌వెల్ పార్టీని నిర్వహించారు. పలువురు 12వ తరగతి విద్యార్థులు బెంజ్, పోర్షే, బీఎండబ్ల్యూ వంటి 35 లగ్జరీ కార్లలో పార్టీకి చేరుకున్నారు. అంతకు ముందు నగరంలో ప్రమాదకరంగా కార్లను నడుపుతూ.. స్టంట్లు చేశారు. కొందరు విద్యార్థులు డోర్లపై ప్రమాదకరంగా కూర్చోగా.. మరికొందరు సన్‌రూఫ్‌పై స్మోక్‌గన్‌లను పట్టుకుని హంగామా చేశారు. దారంతా అరుపులు, కేరింతలతో కార్లను నడిపారు. ఈ కాన్వాయ్, స్టంట్లకు సంబంధించిన డ్రోన్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నగరవాసులు ఈ స్టంట్లపై తీవ్ర విమర్శలు చేశారు. దాంతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. మొత్తం ఆరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. 35 కార్లలో 26 వాహనాలను గుర్తించారు. 22 కార్లను సీజ్ చేశారు. మిగతా 13 కార్ల కోసం గాలిస్తున్నారు. కార్లను నడిపిన డ్రైవర్లు, రాష్ డ్రైవింగ్ చేసిన మైనర్ విద్యార్థుల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేశారు.

లోకం తీరు



తండ్రికి చెప్పకుండా బ్యాంకాక్‌కు..

- కొడుకు కిడ్నాపయ్యాడంటూ విమానాన్ని వెనక్కి రప్పించిన తండ్రి

పుణె, ఫిబ్రవరి 13: తండ్రికి చెప్పకుండా స్నేహితులతో బ్యాంకాక్ ట్రిప్ వేసిన ఓ మాజీ మంత్రి పుత్రరత్నం పథకం బెడిసికొట్టింది. మహారాష్ట్ర మాజీ మంత్రి, శివసేన(శిందేవర్గం) ఎమ్మెల్యే తానాజీ సావంత్ కుమారుడు రిషిరాజ్ సోమవారం రాత్రి తన ఇద్దరు మిత్రులతో కలిసి చార్టెడ్ విమానంలో బ్యాంకాక్ బయలుదేరాడు. ఆ విమానం అండమాన్ సమీపంలో ఉండగా.. తానాజీ తన కుమారుడు అపహరణకు గురయ్యాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు డీజీసీఏ సాయంతో విమానాన్ని వెనక్కి రప్పించారు. ఈ హైడ్రామాను చార్టెడ్ విమాన సేవలను అందిస్తున్న సంస్థ వివరించింది.

మా దేశంలో చదువుకోండి.. పని చేసుకోండి!

- యువ భారతీయ విద్యార్థులకు యూకే ఆహ్వానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివాసం ఉంటూ చదువుకోవడంతోపాటు ఉద్యోగం చేయాలనుకొనేవారికి సువర్ణావకాశం. యూకే-ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ కోసం దరఖాస్తు ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో అర్హులైన 3వేల మందిని ర్యాండమ్ విధానంలో ఎంపిక చేస్తారు. దీనికోసం 18-30 ఏళ్ల వయస్సు కలిగిన భారతీయ పౌరులు జీవోవీ.యూకే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనికోసం రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. వైపీఎస్ బ్యాలెట్ ఈ నెల 18న ప్రారంభమై 20న ముగియనుంది.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన.. నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: జాతి వైషమ్యాలతో అల్లకల్లోలంగా మారిన మణిపూర్‌లో కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. ఈ విషయాన్ని గురువారం కేంద్ర హోంశాఖ ప్రకటించింది. ముఖ్యమంత్రిగా బీరేన్‌సింగ్ రాజీనామా చేసిన కొద్ది రోజులకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొంది.

రూ.6,500 కోట్ల బిట్‌కాయిన్ల హార్డ్ డిస్క్ గుట్టు

లండన్, ఫిబ్రవరి 13: బ్రిటన్‌కు చెందిన జేమ్స్ హోవెల్స్ అనే టెక్ నిపుణుడు 2013లో 8 వేల బిట్‌కాయిన్లను కొనుగోలు చేసి, ఆ సమాచారాన్ని ఓ హార్డ్‌డిస్క్‌లో భద్రపరిచారు. ఇప్పుడు ఆ బిట్‌కాయిన్స్ విలువ రూ.6,500 కోట్లకు పైనే ఉంటుంది. ఇటీవల ఆయన భార్య ఆ హార్డ్ డిస్క్‌ను పొరపాటున చెత్తలో పారేశారు. దాంతో అతను హార్డ్‌డిస్క్ కోసం శోధన ప్రారంభించారు. తాము ఉండే ప్రాంతంలోని చెత్తను సౌత్ వేల్స్‌లో కుప్పగా పోసినట్లు గుర్తించి కోర్టును ఆశ్రయించారు. చెత్తలో వెతకడం వల్ల ప్రజలపై దుష్ప్రభావం పడుతుందనే కారణంతో కోర్టు ఆ అభ్యర్థనను నిరాకరించింది. దాంతో జేమ్స్ ఇప్పుడు ఆ సైట్ మొత్తాన్ని కొంటానని అధికారులను సంప్రదించారు.

ఈ రోజు చాలా ముఖ్యమైనది!

(మొదటి పేజీ తరువాయి)

రుసుములపై నిర్ణయం ఉంటుంది. మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అంటూ ట్రంప్ గురువారం 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. అంటే మోదీతో జరిగే సమావేశంలో సుంకాల విషయంపై తప్పనిసరిగా చర్చ జరుగుతుందని భావిస్తున్నారు. అమెరికా ఉత్పత్తులపై వివిధ దేశాలు విధిస్తున్న దిగుమతి సుంకాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయని ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడమే కాదు.. వాటికి తాము కూడా అదే రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కెనడా, మెక్సికో, చైనా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను పెంచారు. మరోవైపు ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ట్రంప్ 25 శాతం సుంకం విధించారు. ఈ చర్యతో అమెరికా కంపెనీలు తయారీ చేసే ఉత్పత్తుల వినియోగం పెరుగుతుందని భావించారు. ఈ సుంకం భారత్‌కు కూడా వర్తిస్తుంది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంతో భారత్ స్టాక్ మార్కెట్ 1000కి పైగా పాయింట్లు నష్టపోయింది కూడా. ఈ సుంకం పెంపు అంశాన్ని కూడా ట్రంప్‌తో భేటీలో మోదీ లేవనెత్తుతారని భావిస్తున్నారు. భారత్ నుంచి అమెరికాకు పెద్దగా ఉక్కు ఎగుమతి కావడం లేదు. కానీ, ప్రపంచంలోనే అతి పెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారుల్లో భారత్ ఒకటి. అలాగే అల్యూమినియం ఎగుమతుల్లో భారత్‌కు అతిపెద్ద మార్కెట్ అమెరికా. ట్రంప్ సుంకాలను పెంచిన నేపథ్యంలో భారత్‌కు చెందిన వేదాంత, హిందాల్కో వంటి అల్యూమినియం ఉత్పత్తి సంస్థలు క్రమంగా ప్రత్యామ్నాయ మార్కెట్లను చూసుకోవాల్సి ఉంటుంది. అయితే మోదీ మాత్రం ట్రంప్‌తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని.. అవి టెక్నాలజీ, వాణిజ్యం, రక్షణ వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య బంధాలు మరింత బలోపేతం కావడానికి దోహదపడతాయని ధీమా వ్యక్తం చేశారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకముందే భారత్ లక్ష్యంగా పలు వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఉత్పత్తులపె భారీ దిగుమతి సుంకాలను విధిస్తోందని ఆరోపించారు. గత నెలలో భారత్, బ్రెజిల్, చైనా దేశాలతో అమెరికాకు ముప్పు పొంచి ఉందని కూడా వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గిస్తున్నట్లు భారత్ ఇటీవల ప్రకటించింది. విలాసవంతమైన మోటార్ సైకిళ్లు, కార్లు, స్మార్ట్‌ఫోన్ కాంపొనెంట్లపై దిగుమతి సుంకం తగ్గించింది. ఈ నిర్ణయంతో హార్లే డేవిడ్‌సన్, టెస్లా, యాపిల్ వంటి అమెరికా దిగ్గజ కంపెనీలకు లబ్ధి చేకూరనుంది. అయితే ట్రంప్ సుంకాలను పెంచడం వల్లే భారత్ కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరించలేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



ప్రధాని మోదీతో భేటీ అయిన ఎలాన్ మస్క్

తులసీ గబార్డ్, మస్క్‌తో మోదీ భేటీ

అమెరికా ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబార్డ్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఇంటెలిజెన్స్, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, పెరుగుతున్న ముప్పుల విషయంలో ఇరుదేశాలు మరింతగా సహకరించుకోవడంతో పాటు పలు అంశాలపై చర్చించారు. అమెరికా అత్యున్నత ఇంటెలిజెన్స్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన హిందూ అమెరికన్ తులసిని మోదీ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైకేల్ వాల్ట్జ్‌తో మోదీ సమావేశమయ్యారు. స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్‌తోనూ భేటీ అయ్యారు. మస్క్ తన ముగ్గురు పిల్లలతో వచ్చి బ్లెయిర్ హౌస్‌లో ఉన్న మోదీని కలిశారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు నిజమే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి13: బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం పతనమయ్యాక మహ్మద్ యూనుస్ మధ్యంతర ప్రభుత్వ హయాంలో హిందువులే లక్ష్యంగా పెద్ద ఎత్తున దాడులు జరిగినట్లు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంస్థ నివేదిక తెలిపింది. గత ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో 200కుపైగా దాడులు జరిగాయని తెలిపింది. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ కార్యకర్తలతో పాటు జమాత్ ఎ ఇస్లామీ మద్దతుదారులు ఠాకూర్ గావ్, దినాజ్‌పూర్ తదితర ప్రాంతాల్లో హిందువుల ఇళ్లు, దేవాలయాలు, కార్యాలయాలపై దాడులు నిర్వహించారని నివేదిక వెల్లడించింది.

ట్రంప్ మంత్రి వర్గంలో మరో భారత సంతతి వ్యక్తి

- దక్షిణాసియా వ్యవహారాల సహాయ మంత్రిగా పాల్ కపూర్

ట్రంప్ మంత్రివర్గంలో మరో భారతీయ సంతతి వ్యక్తికి చోటు లభించనుంది. దక్షిణాసియా భద్రతపై నిపుణుడైన పాల్‌కపూర్‌ను దక్షిణాసియా వ్యవహారాల అమెరికా విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా ట్రంప్ నియమించారు. ఈ నియామకానికి సెనెట్ ఆమోదం లభిస్తే డొనాల్డ్ లూ స్థానంలో కపూర్ పదవీ బాధ్యతలు చేపడతారు. కపూర్ నియామకం దక్షిణాసియా ముఖ్యంగా భారత్, పాకిస్థాన్‌పై అమెరికా విధానంలో మార్పును సూచిస్తోందన్న వాదన వినిపిస్తోంది.

సరిహద్దుల్లో పాక్ కాల్పులు

- దీటుగా బదులిచ్చిన భారత సైన్యం
- పాక్‌వైపు భారీగా ప్రాణ నష్టం..!
- ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందన్న భారత అధికారులు

జమ్మూ, ఫిబ్రవరి 13: జమ్మూకశ్మీర్ పూంఛ్ జిల్లా కృష్ణ ఘాటీ సెక్టర్‌లో బుధవారం అర్ధరాత్రి తీవ్ర అలజడి నెలకొంది. పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత సైన్యంపైకి ఒక్కసారిగా కాల్పులు జరిపింది. వెంటనే తేరుకున్న భారత సైన్యం ప్రతిగా ఎదురు కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో పాకిస్థాన్ వైపు భారీగా ప్రాణ నష్టం జరిగిందని భారత సైనికాధికారులు వెల్లడించారు. అయితే మృతుల సంఖ్యను మాత్రం స్పష్టంగా చెప్పలేదు. వారి వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ మృతి చెందిన కొంతమంది సైనికులకు ఓ పాక్ అధికారి నివాళులర్పిస్తున్న తేదీలేని వీడియో ఫేస్ బుక్‌లో దర్శనమిచ్చింది. మరోవైపు గురువారం కృష్ణ ఘాటీ సెక్టర్‌లో ఓ భారత జవాను ప్రమాదవశాత్తు ల్యాండ్‌మైన్‌పై కాలు పెట్టి గాయపడగా అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సరిహద్దుల వద్ద పరిస్థితి నిలకడగా ఉందని, కాల్పుల విరమణ స్థిరంగా కొనసాగుతోందని చెప్పారు. సరిహద్దుల వద్ద కాల్పుల ఘటన కొంత కలకలం రేపిన మాట వాస్తవమేనని, అయితే ప్రస్తుతం అన్ని అదుపులోకి వచ్చాయని తెలిపారు. నియంత్రణ రేఖ వద్ద భారత సైన్యం పూర్తి అప్రమత్తతో ఉందని అధికారులు స్పష్టం చేశారు. కాగా, కాల్పుల విరమణకు సంబంధించి ఈ ఏడాదిలో తొలి ఘటన ఇదే కాగా సరిహద్దుల వద్ద కొన్ని రోజులుగా వివిధ సందర్భాలలో పాక్ కవ్వింపులకు పాల్పడుతూనే ఉంది.

ఇంటర్‌లో ఎంబైపీసీ

(మొదటి పేజీ తరువాయి)

అమల్లోకి రానున్నాయి. ఇక మొదటి ఏడాది పరీక్షల రద్దు, అంతర్గత మార్కుల ప్రతిపాదనలను ప్రస్తుతానికి వాయిదా వేసింది. వచ్చే విద్యా సంవత్సరం తర్వాత దశలవారీగా వాటిని కూడా అమల్లోకి తీసుకురానుంది. సబ్జెక్టుల కాంబినేషన్‌లో భాగంగా ఇకపై ఇంటర్‌లో కొత్తగా రాష్ట్రంలో ఎంబైపీసీ అందుబాటులోకి వస్తుంది. ఎంపీసీ, బైపీసీల సబ్జెక్టులను కలిపి ఎంబైపీసీని తీసుకొస్తున్నారు. ఎంబైపీసీ చదివిన విద్యార్థులు ఉన్నత విద్యలో ఇంజనీరింగ్, మెడిసిన్‌లలో ఏదైనా కోర్సులో జాయిన్ అయ్యే అవకాశం ఉంటుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ కాలేజీల్లో దీన్ని ప్రవేశపెట్టనున్నారు.

సైన్స్ విద్యార్థులకు అదనపు సబ్జెక్టు ఆప్షనల్: ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో ఆరు సబ్జెక్టుల విధానం ఉండగా, ఇకపై ఐదు సబ్జెక్టుల విధానం అమల్లోకి వస్తుంది. మొదటి సబ్జెక్టుగా ఇంగ్లీష్ ఉంటుంది. ఇక తెలుగు లేదా సంస్కృతం సబ్జెక్టు ఆప్షనల్ అవుతాయి. వాటి స్థానంలో విద్యార్థులు కోర్ సబ్జెక్టును కూడా ఎంచుకోవచ్చు. మిగిలిన మూడు కోర్ సబ్జెక్టులు యథావిధిగా ఉంటాయి. ప్రస్తుతం ఇంటర్ ఎంపీసీలో గణితం ఎ, బి పేరుతో రెండు సబ్జెక్టులుగా ఉంది. అది ఇకపై ఒకటే అవుతుంది. అలాగే బైపీసీలో ఉన్న బోటనీ, జువాలజీ కలిపి బయాలజీగా మారుతుంది. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు అదనపు సబ్జెక్టు ఆప్షన్‌లో ఉంటుంది. ఆరో సబ్జెక్టుగా నచ్చిన సబ్జెక్టును కావాలంటే ఎంపిక చేసుకోవచ్చు. ఆరులో ఐదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులైతే ఇంటర్ ఉత్తీర్ణత సాధిస్తారు. ఇక ఆర్ట్స్ గ్రూపుల విద్యార్థులు కూడా గణితం, బయాలజీలను ఆప్షనల్ సబ్జెక్టు కింద తీసుకోవచ్చు. అయితే ఆర్ట్స్ గ్రూపుల్లో ఐదు సబ్జెక్టులు దాటవు. ఆరో సబ్జెక్టు ఆప్షన్ ఉండదు. రెండో సబ్జెక్టు స్థానంలో ఆప్షనల్‌ను ఎంచుకోవచ్చు.

మార్కుల కేటాయింపు ఇలా: గణితం, బోటనీ, జువాలజీ కలిపిన నేపథ్యంలో మార్కుల వెయిటేజీని కూడా మార్చారు. ప్రస్తుత విధానంలో గణితం 1ఎ 75 మార్కులకు, 1బి 75 మార్కులకు ఉంటాయి. రెండో ఏడాదిలో 2ఎ, 2బిలు కూడా అలాగే ఉంటాయి. అంటే ఏడాది 150 మార్కుల చొప్పున ఉండగా ఇకపై ఏడాదికి 100 మార్కులకే గణితం పరీక్ష జరుగుతుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఏడాదికి 60 మార్కుల చొప్పున ఉండగా ఇకపై 85 మార్కులు అవుతాయి. గణితంలో తగ్గించిన మార్కులను ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో పెంచి సర్దుబాటు చేశారు. అలాగే బైపీసీలోనూ బోటనీ, జువాలజీ కలిపిన బయాలజీ మార్కులు తగ్గించి, ఫిజిక్స్, కెమిస్ట్రీకి పెంచుతారు. ప్రాక్టికల్స్ 60 మార్కులకు జరుగుతాయి. మొత్తంగా వెయ్యి మార్కుల విధానంలోనే ఇంటర్ పరీక్షలు ఉంటాయి.

మొత్తం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్: ఇంటర్ సుదీర్ఘకాలంగా పాత సిలబస్‌తోనే కొనసాగుతోంది. ఇది విద్యార్థులపై భారంగా మారిందన్న విమర్శలున్నాయి. దీంతో వచ్చే ఏడాది నుంచి మొత్తం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను అమలుచేయాలని ఇంటర్ బోర్డు మరో నిర్ణయం తీసుకుంది. కోర్ గ్రూపు సబ్జెక్టుల్లో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను యథావిధిగా అమలుచేసి, మిగిలిన భాషా, ఆర్ట్స్ గ్రూపుల్లో కీలక మార్పులు తీసుకొస్తోంది. విద్యార్థులపై భారం తగ్గించనుంది. ఆ సమయాన్ని జేఈఈ, నీట్ కోసం అదనపు తరగతులు ప్రవేశపెడుతోంది.

ఫెయిలైనా చదవొచ్చా..?: ఎంబైపీసీ చదివే విద్యార్థి గణితంలో ఫెయిల్ అయ్యి, ఆప్షనల్‌గా తీసుకున్న ఆరో సబ్జెక్టులో పాస్ అయితే ఇంటర్ సర్టిఫికెట్ చేతికి వస్తుంది. అయితే ఇక్కడే ఓ సందేహం తలెత్తుతోంది. గణితంలో ఫెయిల్ అయిన ఆ విద్యార్థి ఇంజనీరింగ్ చేయొచ్చా? అలాగే ఎంబైపీసీ చదివిన విద్యార్థి బయాలజీలో ఫెయిల్ అయి, ఆప్షనల్ సబ్జెక్టులో పాస్ అయితే మెడిసిన్ చదవొచ్చా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇలా ఉన్నత విద్యకు అవసరమైన కోర్ సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులు ఆయా ఉన్నత విద్య కోర్సుల్లో చేరవచ్చా? లేదా? అనేది యూనివర్సిటీల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. దేశంలోని ఆయా యూనివర్సిటీల అడ్మిషన్ నిబంధనల ప్రకారం వారిపై నిర్ణయం ఉంటుందని అంటున్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో ఎంబైపీసీ: కొత్తగా తీసుకొస్తున్న ఎంబైపీసీ సబ్జెక్టును వచ్చే ఏడాది నుంచే అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అందుబాటులోకి తెస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ కామన్‌గా ఉంటాయి. ఎంబైపీసీ విద్యార్థులకు అదనంగా గణితం, బయాలజీ ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో కలిపి బోధిస్తారు. అదనపు సబ్జెక్టులపై విడిగా బోధిస్తారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్లు సరిపడ స్థాయిలో ఉన్నందున అన్నిచోట్లా ఎంబైపీసీ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. అయితే ఎంబైపీసీ ప్రవేశపెట్టడంపై ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలే నిర్ణయం తీసుకుంటాయి.

ఆ రూ.48 లక్షలు ఎందుకిచ్చారు?

- సీఐడీ కేసులు ఏమైనా వాదించావా..
- తులసిబాబును మరోసారి విచారించిన ఎస్పీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ విచారణలో చిత్రహింసలు పెట్టిన కేసులో నిందితుడు కామేపల్లి తులసిబాబును మరోసారి పోలీసు కస్టడీకి తీసుకొని విచారించారు. గురువారం ఆయన్ను గుంటూరు జైలు నుంచి ఒంగోలుకు తీసుకొచ్చారు. తులసిబాబును కేసు విచారణాధికారి, ఎస్పీ ఏఆర్.దామోదర్ మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు విచారించారు. 'రూ.48 లక్షలు ఎందుకు తీసుకున్నారు? అసలు సీఐడీ కేసులు ఏమైనా వాదించావా?' అని అడగ్గా.. తులసిబాబు మొదట కాస్త తడబడ్డట్లు కనిపించినా, తర్వాత వాదించలేదని చెప్పినట్లు తెలిసింది. అయితే డబ్బులు ఎందుకిచ్చారు? అని ప్రశ్నించగా.. తులసిబాబు నుంచి మౌనమే సమాధానమైనట్లు సమాచారం. అర్హత లేకున్నా లీగల్ అసిస్టెంట్‌గా సీఐడీలో ఎలా చేరావు? అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్‌తో ఉన్న సంబంధం ఏంటి? అని అడిగినట్లు తెలిసింది. రఘురామకృష్ణరాజును సీఐడీ కార్యాలయంలో విచారిస్తున్న సమయంలో ముసుగు ధరించిన నలుగురు వ్యక్తులు లోపలికి వచ్చారు. వారిలో తులసిబాబు ఉన్నట్లు రఘురామ గుర్తించారు. మిగిలిన ముగ్గురు ఎవరు? అనే కోణంలో తులసిబాబును ఎస్పీ విచారించినట్లు తెలిసింది. రఘురామకృష్ణరాజును హత్య చేయాలని పథకం రూపొందించింది, మిమల్ని సీఐడీ కార్యాలయానికి పంపింది ఎవరు? అనే ప్రశ్నలకు తులసిబాబు నుంచి ఎలాంటి సమాధానం లేదని సమాచారం. విచారణ అనంతరం తులసిబాబును తాలూకా పోలీసు స్టేషన్‌కు పంపించారు. శుక్రవారం ఉదయం గుంటూరులోని సీఐడీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి, అక్కడి నుంచి జైలుకు తీసుకెళ్లనున్నారు.

తులసిబాబుపై ఏసీబీకి రఘురామ ఫిర్యాదు

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తులసిబాబుపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు గురువారం లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. తులసిబాబుకు అర్హత లేకపోయినప్పటికీ అతన్ని లీగల్ అసిస్టెంట్‌గా నియమించి, ప్రభుత్వ నిధులిచ్చి.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఏసీబీ విచారణ జరపాలని కోరారు.

సార్.. నా నంబర్‌ను బాయ్‌ఫ్రెండ్ బ్లాక్ చేశాడు!

- అనంతలో డయల్ 100కు యువతి ఫోన్..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'సార్.. నా బాయ్‌ఫ్రెండ్ నా నంబర్‌ను బ్లాక్ చేశాడు. నాతో మాట్లాడటం లేదు. మీరు ఫోన్‌చేసి వాడితో మాట్లాడండి. నా నంబర్‌ను అన్ బ్లాక్ చేయించండి..' అని ఓ యువతి పోలీసులను కోరడం చర్చనీయాంశంగా మారింది. అనంతపురం జిల్లా గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఆమె.. డయల్ 100కు ఫోన్‌చేసి సాయం కోరడం గమనార్హం. గురువారం వచ్చిన ఈ ఫిర్యాదును కంట్రోల్ రూం నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌కు పంపించారు. దీంతో గుత్తి పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ సుధాకర్ ఆమెను సంప్రదించారు. అయితే, తన ఇంటి వద్దకు రావద్దని, తన బాయ్‌ఫ్రెండ్‌కు ఫోన్‌చేసి, తన నంబర్‌ను అన్‌బ్లాక్ చేయిస్తే చాలని విన్నవించింది. దీంతో ఆమె బాయ్‌ఫ్రెండ్ నంబర్ సేకరించి, ఫోన్‌చేశారు. స్పందించకపోవడంతో వెనుదిరిగారు. స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆ యువతికి సూచించారు.

లోక్‌సభ, రాజ్యసభ ముందుకు
వక్ఫ్ బిల్లుపై జేపీసీ నివేదిక!

అసమ్మతి నోట్‌ను తొలగించారంటూ విపక్షాల అభ్యంతరం

- ఫేక్ రిపోర్టు అని కొట్టిపారేసిన ఖర్గే
- ఏదీ తొలగించలేదన్న రిజిజు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: సభ్యుల నిరసనలు, నినాదాలు, వాకౌట్లు, స్వల్ప వాయిదాల మధ్య వక్ఫ్ సవరణ బిల్లు-2024పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నివేదిక గురువారం పార్లమెంటు ఉభయసభల ముందుకొచ్చింది. రాజ్యసభలో బీజేపీ సభ్యుడు మేధా విశ్రామ్ కులకర్ణి, లోకసభలో ఎంపీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ చైర్‌పర్సన్ జగదాంబికా పాల్ నివేదికను ప్రవేశపెట్టారు. రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున్ ఖర్గే ఈ నివేదికను 'ఫేక్ రిపోర్టు' గా కొట్టిపారేశారు. విపక్ష ఎంపీలు జారీచేసిన అసమ్మతి నోట్‌ను నివేదిక నుంచి తొలగించారని, ఇది అప్రజాస్వామిక చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి తిప్పి పంపాలని డిమాండ్ చేశారు. అయితే విపక్ష సభ్యుల ఆరోపణలను పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు కొట్టిపారేశారు. నివేదిక నుంచి ఏదీ తొలగించలేదని, అన్ని వివరాలనూ సభ ముందు ఉంచామన్నారు. మంత్రులు భూపేందర్ యాదవ్, నిర్మలా సీతారామన్ కూడా విపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.



కాగా అభ్యంతరాల నోట్‌ను తొలగించారంటూ విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ ఎంపీ మేధా విశ్రామ్ కులకర్ణి సభలో నివేదికలోని ఐదో భాగానికి సంబంధించిన తప్పొప్పుల పట్టిక (కోరిజండమ్)ను ప్రవేశపెట్టారు. లోక్‌సభలో అమిత్ షా మాట్లాడుతూ అసమ్మతి నోట్‌తో కూడిన నివేదికను ప్రవేశపెట్టడంపై బీజేపీకి అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. తొలి విడత బడ్జెట్ సమావేశాలకు ముగింపు పలుకుతూ ఉభయసభలు వాయిదాపడ్డాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 10నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి.

హిందూ, ముస్లింల మధ్య పోరుగా చూడొద్దు

ముస్లింల అభిప్రాయాలను వక్ఫ్‌ప్యానల్ పూర్తిగా విస్మరించిందని, వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదిస్తే, దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) హెచ్చరించింది. వక్ఫ్ బిల్లుపై ముందుకు వెళ్లొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బిల్లుపై జేపీసీ నివేదికను ఉభయసభల్లో ప్రవేశపెట్టిన నేపథ్యంలో లా బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సయిఫుల్లా రెహమానీ విలేకరులతో వక్ఫ్ సమస్యలనేవి హిందువులు, ముస్లిం మధ్య పోరు కాదని.. ఇది న్యాయం కోసం జరిగే పోరాటమని పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లును రూపకల్పనలో 'మతపరమైన వివక్ష' కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు.

లోక్‌సభలో కొత్త ఆదాయ పన్ను బిల్లు

ఆదాయ పన్ను చట్టాన్ని సరళీకరిస్తూ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ గురువారం లోక్‌సభలో కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని స్పీకర్ ఓం బిర్లాను అభ్యర్థించారు. అసలు బిల్లు ప్రవేశపెట్టడాన్నే విపక్షాలు వ్యతిరేకించాయి. అయితే, మూజువాణి ఓటుతోనే బిల్లు ప్రవేశపెట్టడానికి స్పీకర్ అనుమతి లభించింది. లోక్‌సభ సెలక్ట్ కమిటీ బిల్లును అధ్యయనం చేసి వచ్చే సమావేశాల తొలిరోజు తన నివేదికను సమర్పిస్తుంది. ప్రస్తుత చట్టంలో కన్నా కొత్త బిల్లులో ఎక్కువ సెక్షన్లు ఉన్నాయని కాంగ్రెస్ సభ్యులు మనీశ్ తివారీ, ప్రేమచంద్రన్ చేసిన వ్యాఖ్యలను నిర్మల ఖండించారు. ప్రస్తుత చట్టంలో 819 సెక్షన్లు ఉండగా.. కొత్త బిల్లులో కేవలం 536 సెక్షన్లు ఉన్నాయని గుర్తు చేశారు. కొత్త చట్టాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తామన్నారు.

బుల్లెట్ నడిపాడని చేతులు నరికారు

(మొదటి పేజీ తరువాయి)

చేతులూ నరికేశారు. తమిళనాడులోని శివగంగ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. అంటరానితనం నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ముగ్గురిని అరెస్టు చేశారు. శివగంగ జిల్లా మేల్‌పిడవూరు గ్రామానికి చెందిన దళితవర్గానికి చెందిన అయ్యాసామి, శివగంగలోని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల అతడు తనకిష్టమైన బుల్లెట్ బండి కొన్నాడు. రోజూ దానిపై కాలేజీకి వెళ్తుండడం పట్ల గ్రామంలోని కొందరు అగ్రవర్ణాలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో అయ్యాసామి బుధవారం కళాశాలకు బుల్లెట్‌పై వెళ్తుండగా అతడిని ముగ్గురు అగ్రవర్ణాల యువకులు అడ్డుకున్నారు. 'కులం తక్కువోడివి..! నువ్వు మా ముందే బండెక్కుతావా?.. నీకు బుల్లెట్ కావాల్సివచ్చిందా?' అంటూ దాడి చేశారు. కత్తులతో ఆ యువకుడి రెండు చేతులూ నరికేశారు. చుట్టుపక్కల వారు అయ్యాస్వామిని మదురై రాజాజీ ఆస్పత్రికి తరలించారు. అతడి చేతులు అతికించేందుకు వైద్యులు శస్త్రచికిత్స చేపట్టారు. అయ్యాసామి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వెళ్లిన సమయంలో దాడిచేసిన దుండగులు అతడి ఇంట్లోకి వెళ్లి వస్తువులను ధ్వంసం చేశారు.

సివిల్స్ దరఖాస్తు ప్రక్రియలో మార్పులు

- కొన్ని ఎంట్రీలను 'ఎడిట్' చేసుకొనే అవకాశం కల్పించిన యూపీఎస్సీ
- పేరు, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ మార్పునకు నో చాన్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల ఫిర్యాదుల నేపథ్యంలో ఈ ఏడాది ప్రిలిమ్స్ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో యూపీఎస్సీ పలు మార్పులు చేసింది. దరఖాస్తు సమయంలో సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయని అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈమేరకు నిర్ణయం తీసుకుంది. మార్పులకు సంబంధించి కమిషన్ అధికారిక నోటీస్ విడుదల చేసింది. వన్-టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్)లో కొన్ని ఎంట్రీలను 'ఎడిట్' చేసుకొనే అవకాశం కల్పించినట్లు తెలిపింది. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2025 దరఖాస్తు గడువును ఈనెల 18 వరకు పొడిగించగా.. తుది దరఖాస్తు సమర్పణ తర్వాత ఏవైనా మార్పులు/సవరణలు ఉంటే 19 నుంచి 25వ తేదీ వరకు అవకాశం ఉంటుందని పేర్కొంది. దరఖాస్తు తుది సమర్పణ వరకు, ఆ తర్వాత మైనారిటీ స్థితి, 10 తరగతి రోల్ నంబర్ వంటి వాటిల్లో తప్పులు ఉంటే మార్చుకోవచ్చని యూపీఎస్సీ తెలిపింది. అయితే ఓటీఆర్ ప్రొఫైల్‌లోని పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ కాలమ్స్‌లో మార్పులకు అవకాశం ఉండదని పేర్కొంది. పేరు మార్చుకున్నా లేదా మెట్రిక్యులేషన్/ఉన్నత విద్య సర్టిఫికెట్‌లోని పేరులో దోషం ఉన్న సందర్భాల్లో గెజిట్ నోటిఫికేషన్ సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి లేకుంటే.. ప్రిలిమ్స్ ఫలితాల తర్వాత ఆన్‌లైన్‌లో సమర్పించొచ్చని పేర్కొంది. అభ్యర్థి తన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ లేదా ఈమెయిల్ ఐడీ యాక్సెస్ ను కోల్పోతే.. ఒకదాని ఆధారంగా మరో దాన్ని మార్చుకోవచ్చని తెలిపింది. రెండింటి యాక్సెస్ కోల్పోతే అవసరమైన మార్పుల కోసం కమిషన్‌కు అభ్యర్థన పెట్టుకోవాలని సూచించింది.

47 పోస్టులతో ఐఈఎస్ నోటిఫికేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 47 పోస్టులతో ఇండియన్ ఎకనమిక్ సర్వీస్(ఐఈఎస్), ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐఎస్ఎస్) ఎగ్జామ్ 2025కి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 4వ తేదీ లోపు యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ upsc.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయస్సు 2025 ఆగస్టు 2 నాటికి 21 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉండాలి. పూర్తి వివరాలకు యూపీఎస్సీ నోటిఫికేషన్ చూడవచ్చు.


విలేకరులతో మాట్లాడుతున్న చింతమనేని

చింతమనేనిపై హత్యాయత్నం!

» కారు అడ్డుపెట్టి కవ్వింపు చర్యలు.. ఇనుప రాడ్డుతో దాడి
» మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిపై ఎమ్మెల్యే గన్‌మ్యాన్ ఫిర్యాదు
» ఎస్పీకి ఆధారాలు అందజేసిన చింతమనేని ప్రభాకర్

పెదవేగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై హత్యాయత్నం జరిగింది. బుధవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఏలూరు సమీపంలోని ఓ గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు హాజరై, వెనుతిరిగిన సమయంలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, చింతమనేని కారుకు తన కారును అడ్డుగా పెట్టి, కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. కారును అడ్డు తీయాలని తాను వెళ్లి అభ్యర్థించినప్పటికీ.. దుర్భాషలాడుతూ అబ్బయ్యచౌదరి ఇనుప రాడ్డు తీసుకుని దాడి చేశారని చింతమనేని గన్‌మ్యాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ అల్లరి మూకలు ప్రభాకర్‌పై దాడికి ప్రయత్నించాయని డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో దెందులూరులో ఉద్రిక్తత నెలకొంది. పెదవేగి మండలం దుగ్గిరాలలోని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇంటికి టీడీపీ శ్రేణులు భారీగా చేరుకున్నాయి. అటు వైసీపీ వర్గీయులు పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని కొఠారు ఇంటికి భారీగా చేరుకున్నారు. దీంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి, పర్యవేక్షించారు. ఈ సంఘటనపై చింతమనేని ప్రభాకర్ ఏలూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ వివాదానికి సంబంధించిన ఆధారాలను ఎస్పీకి అందించారు.

కర్నూలు కాంగ్రెస్ కార్యాలయం కబ్జాపై విచారణ

» ఏపీసీసీకి గిడుగు రుద్రరాజు నివేదిక

కర్నూలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం కబ్జా అభియోగాలపై విచారణ చేసిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు గురువారం ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలకు నివేదిక అందజేశారు. కర్నూలు నగరంలోని పార్క్ రోడ్‌లో ఇంటి (డోర్) నంబరు 40/860లో ఉన్న కళా వెంకటరావ్ భవన్ కాంగ్రెస్ సొంత భవనమని, అది కాంగ్రెస్ పార్టీ ఆస్తి అని ఆయన నివేదికలో పేర్కొన్నారు. భవనంలో కొంత భాగం వాణిజ్య దుకాణాలకు అద్దెకు ఇచ్చి, అద్దె సొమ్మును బ్యాంక్ ఖాతాలో జమ చేయడంతో పాటు కార్యాలయ సిబ్బంది జీతాలు, రోజు వారి కార్యక్రమాల కోసం డీసీసీ అధ్యక్షుడు ఖర్చు చేస్తారు. అయితే కర్నూలు డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ ఏఐసీసీ, ఏపీ కాంగ్రెస్ కమిటీ అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్ చట్టం-2001 కింద 'కళా వెంకటరావ్ భవన్ సొసైటీ' పేరుతో సొసైటీని రిజిస్ట్రేషన్ నం.21/2025తో జనవరి 28న రిజిస్టర్ చేయించారని నివేదికలో పేర్కొన్నారు. పార్టీ ఆస్తి దుర్వినియోగం చేయాలనే ఉద్దేశంతోనే సొసైటీ రిజిస్ట్రేషన్ చేసినట్లు కనిపిస్తోందని గిడుగు వివరించారు. దీనిని పార్టీ వ్యతిరేక చర్యగా పరిగణించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గిడుగు రుద్రరాజు తన నివేదికలో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

» పార్టీ శ్రేణులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా పిలుపు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులను కోరారు. ఫిబ్రవరి 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై గురువారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నాయకులు, కార్యకర్తలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగస్వాములు కావాలని పల్లా కోరారు. రాబోయే రెండు వారాలు పార్టీకి అత్యంత కీలకమైన సమయమని, గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

తిరుమల నడక దారిలో చిరుత కలకలం

తిరుమల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అలిపిరి నడకమార్గంలో గురువారం రాత్రి చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఏడవమైలు ముగ్గుబావికి వద్ద భక్తులకు చిరుత కనిపించింది. దీంతో భయంతో ఓ భక్తబృందం కేకలు వేస్తూ పరుగులు తీశారు. వెంటనే సమీపంలో భద్రతాసిబ్బంది సమాచారం ఇవ్వడంతో విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు అక్కడకి చేరుకున్నారు. క్షణాల వ్యవధిలో చిరుత అడవిలోకి వెళ్లిపోయినట్టు నిర్ధారించుకున్న అటవీ అధికారులు కాలినడక భక్తులను అప్రమత్తం చేసి పంపారు.

కోళ్లకు మరణశాసనం..!

వ్యాక్సిన్ లేని వైరస్ బర్డ్ ఫ్లూ.. వలస పక్షులతోనే వ్యాధి వ్యాప్తి

» ఇది మనుషులకు సోకదు
» జీవ భద్రతా చర్యలతో నివారణ
» పశువైద్య నిపుణుల సూచన
» గోదావరి జిల్లాల్లో వ్యాప్తిపై ఆందోళన
» అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం
» నియంత్రణకు కఠిన చర్యలు
» తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని సూచన


పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరులో బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను ఖననం చేస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బర్డ్ ఫ్లూ.. వైరస్ కోళ్లు, బాతుల పాలిట మరణశాసనంగా మారింది. ఇది వలస పక్షుల నుంచి కోళ్లు, బాతులకు మాత్రమే సోకుతుందని పశువైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది ఆస్ట్రేలియా నుంచి వలస పక్షులు కొల్లేరు, సిలికాన్ సరస్సులతో పాటు ఇతర జలాశయాలకు ఎక్కువగా వచ్చాయి. కానీ.. ఆ పక్షుల్లో ఈ వ్యాధి కనబడదు. దీనివల్ల వలస పక్షులు, కొంగలు చనిపోవు. కేవలం క్యారియర్లుగానే ఉంటాయి. అవి విసర్జించే రెట్టల ద్వారా వ్యాధిని వ్యాప్తి చేస్తాయి. వాటి ముక్కు నుంచి వచ్చే ద్రవం నీటిలో చుక్క పడినా వైరస్ ప్రభావం చూపుతుంది. సాధారణంగా శీతాకాలంలో బర్డ్‌ఫ్లూ వైరస్ ఉనికిలో ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ అంతరిస్తుంది. సహజంగా జలాశయాల వద్ద వలస పక్షులతో పాటు దేశీయ కొంగలు కూడా సంచరిస్తాయి. ఆ కొంగలు కోళ్ల ఫారాల వద్దకి రావడం వల్ల వైరస్ అంతర బదిలీ అవుతుందని పశువైద్య నిపుణులు చెబుతున్నారు. కోళ్ల పెంపకంలో బాధ్యతగా లేకపోతే.. ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందని అంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో సహజంగా కోళ్ల మరణాలు 3.5 శాతంగా ఉంటుంది. మరణాలు సహజమే కానీ.. కోళ్లు అత్యధికంగా మృతి చెందితే దానికి వైరస్‌లే కారణం. ప్రస్తుతం కోళ్ల మరణాలకు కారణమైన బర్డ్‌ఫ్లూ నివారణకు ప్రత్యేకంగా వ్యాక్సిన్ లేదని పశుసంవర్ధక శాఖ తెలిపింది. కోళ్ల ఫారాల వద్ద పరిశుభ్రతతోపాటు ఇతర జీవ భద్రతా ప్రమాణాలు పాటించడమే దీనికి నివారణ అని పేర్కొంది. కోడికి కోడికి మధ్య నిర్ణీత దూరం పెట్టడం, మంచి దాణా అందించి, శాస్త్రీయ పద్ధతుల్లో పౌల్ట్రీలు నిర్వహించడం ద్వారా వైరస్‌లకు చెక్ పెట్టొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ వైరస్ మనుషులకు సోకదు..

బర్డ్‌ఫ్లూ కారణంగా పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు, తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో 5.42లక్షల కోళ్లు మృతి చెందాయి. పక్షి జాతుల్లో వచ్చే వైరస్‌లను నిర్ధారించే ప్రయోగశాల నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్ మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లోనే ఉంది. గోదావరి జిల్లాల్లో చనిపోయిన కోళ్లకి సంబంధించిన నమూనాలను ఈ ల్యాబ్‌కే పంపగా.. బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయింది. దీని శాస్త్రీయ నామం ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (హెచ్5ఎన్1). కాగా, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకినట్లు రాష్ట్రంలో ప్రచారం జరుగుతోంది. పశుసంవర్ధక శాఖ అధికారులు మాత్రం దీన్ని కొట్టిపారేశారు. భోపాల్‌లోని ల్యాబ్‌కు మాత్రమే ఈ వ్యాధిని నిర్ధారించే అధికారం ఉందని చెప్పారు. ఈ వైరస్ కోళ్ల నుంచి మనుషులకు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. కాగా, బర్డ్‌ఫ్లూ నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా 721 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్ఆర్‌టీ)లు ఏర్పాటు చేశామని, దీనిపై ఆందోళన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. కోళ్లు చనిపోయిన గ్రామాల్లో ఒక కిలోమీటరు పరిధిని అలర్ట్ జోన్ (అప్రమత్తత పరిధి)గా, పది కిలోమీటర్ల పరిధిని సర్వేలెన్స్ ప్రాంతంగా ప్రకటించి, ఆ ప్రాంతం నుంచి కోళ్లు, కోళ్ల ఉత్పత్తుల రాకపోకలను కట్టడి చేస్తున్నామని తెలిపింది.


పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరులో పీపీ కిట్లతో వైరస్ సోకిన కోళ్లను ఖననం చేసేందుకు సిద్ధమైన ఆర్ఆర్‌టీ సభ్యులు

భయం గుప్పెట్లో గోదావరి జిల్లాలు

కోళ్ల ఫారాలు ఎక్కువగా ఉన్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ భయం వెంటాడుతూనే ఉంది. చికెన్ వినియోగానికి ఎలాంటి ఇబ్బందీ లేదని అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. ప్రజలు భయపడుతున్నారు. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో బ్రాయిలర్ వారానికి 20వేల టన్నులు, ఫారం 15వేల టన్నులు తినేవారు. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో బ్రాయిలర్ వ్యాపారం 2 వేల టన్నులు కూడా ఉండటం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఫారం కోళ్లను కనీసం కొనడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదని వాపోతున్నారు. ఏలూరు జిల్లా బాదంపూడిలో బర్డ్‌ఫ్లూ కలకలం రావడంతో ఆ ప్రభావం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాపై పడింది. తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లో చికెన్, గుడ్ల దుకాణాలు వెలవెలబోతున్నాయి.

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు: మంత్రి అచ్చెన్న

రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ నియంత్రణకు అన్నిచర్యలూ తీసుకుంటున్నామని వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. బాగా ఉడికించిన గుడ్లు, చికెన్ నిరభ్యంతరంగా తినొచ్చని ప్రభుత్వం తరఫున ప్రకటించారు. గురువారం అమరావతి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. బర్డ్‌ఫ్లూ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తున్నామని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరులో ఓ వ్యక్తికి బర్డ్‌ఫ్లూ సోకిందంటూ జగన్ మీడియాలో ట్రోలింగ్ వేయడంతో.. వైద్యశాఖ కార్యదర్శి వెంటనే వెళ్లి పరిశీలించారని, అది తప్పుడు ప్రచారమని తేలిందని చెప్పారు. ఏపీ గుడ్లను తెలంగాణ ప్రభుత్వం నిషేధించలేదన్నారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో తమ ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆ రాష్ట్రం ప్రకటనలు చేస్తే.. ఏపీకి నోటీసులిచ్చినట్లు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు మాట్లాడుతూ.. వలస పక్షుల వల్ల కోళ్లు, బాతులకు మాత్రమే బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం ఉంటుందని, మనుషులకు సోకినట్టు ఎక్కడా నమోదు కాలేదని చెప్పారు. వెటర్నరీ డాక్టర్లు తమ పరిధిలోని పౌల్ట్రీల యజమానులతో మాట్లాడి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. బర్డ్‌ఫ్లూ సోకిన 14వేల కోళ్లను కాల్చేసి, 340 గుడ్లను నాశనం చేశామన్నారు. ఆయా పౌల్ట్రీల్లో ఉన్న 1.4లక్షల కోళ్లను కూడా కాల్చేస్తామన్నారు. వాటిలో ఒక్కో కోడికి రూ.140 చెల్లిస్తామని చెప్పారు.

నివారణకు కఠిన చర్యలు: సీఎస్

బర్డ్‌ఫ్లూ నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని సీఎస్ విజయానంద్ తెలిపారు. గురువారం సచివాలయం నుంచి పశుసంవర్ధక, వైద్యఆరోగ్యశాఖల ఉన్నతాధికారులతో కలిసి, జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. వ్యాధి నివారణకు చర్యలు, చనిపోయిన కోళ్లను శాస్త్రీయంగా పూడ్చిపెట్టడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీచేశారు. కేంద్రం జారీచేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అసత్య ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మాట్లాడుతూ.. బర్డ్‌ఫ్లూ మనుషులకు సోకినట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదన్నారు. ఢిల్లీ నుంచి కేంద్ర పశుసంవర్ధకశాఖ కమిషనర్ అమిత్ మిత్రా వర్చువల్‌గా మాట్లాడుతూ.. కోళ్ల ఫారాలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలని, వైరస్ సోకిన కిలోమీటర్ పరిధిని రెడ్ జోన్‌గా ప్రకటించి, 15 రోజులకోసారి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

మనుషులకు సోకిందంటూ వదంతులు.. ఏలూరు కలెక్టర్ సీరియస్

ఏలూరు జిల్లాలో ఒక వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకిందంటూ వదంతులు చెలరేగాయి. దీనిపై ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి సీరియస్ అయ్యారు. సరైన నిర్ధారణ లేకుండా ఇలా అసత్య ప్రచారం చేస్తూ ప్రజల్లో అలజడి సృష్టించవద్దని కోరారు. ఇప్పటికే తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను అప్రమత్తం చేసి యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపడుతున్నారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను శాస్త్రీయ పద్ధతుల్లో ఖననం చేస్తున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి చెప్పారు. తణుకు రూరల్ మండలం వేల్పూరులో గురువారం నిర్వహించిన కోళ్ల ఖననం చేసే పనులను ఆమె పరిశీలించారు.

రేపు నెల్లూరు జిల్లాకు చంద్రబాబు

» కందుకూరులో 'స్వచ్ఛాంధ్ర'లో పాల్గొననున్న సీఎం

కందుకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కందుకూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 15న పర్యటిస్తారు. శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు పట్టణంలోని దూబగుంట సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఎంఆర్ఎఫ్ ఫెసిలిటీ సెంటర్ (వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్)కు చేరుకుని అక్కడ విఎషినరీని ప్రారంభిస్తారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వీధులు, డ్రైనేజీలు శుభ్రం చేసే కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. ఎంపిక చేసిన మూడు గృహాలలో ఇంకుడుగుంతలను ప్రారంభిస్తారు. అనంతరం పార్కు కమ్ పాండ్‌ను సందర్శిస్తారు. బహిరంగ సభలో మాట్లాడటంతోపాటు మున్సిపాలిటీలోని ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం హెలిపాడ్‌కు చేరుకుని ఉండవల్లి బయలుదేరి వెళతారు.

ఎమ్మెల్సీ బరిలో 70 మంది అభ్యర్థులు

విశాఖపట్నం/ఏలూరు/గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాసనమండలి ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం ముగిసింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరూ నామినేషన్లు ఉపసంహరించుకోకపోవడంతో బరిలో పది మంది అభ్యర్థులు నిలిచారు. ఇక ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 35 మంది పోటీపడనున్నారు. మొత్తం 54 మంది నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనలో 11 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 8 మంది పోటీ నుంచి తప్పుకోవడంతో 35 మంది బరిలో మిగిలారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల్లో గురువారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోగా తుదిపోరులో 25 మంది అభ్యర్థులు నిలిచారు.

నక్సల్స్ సమస్యను సామాజిక సమస్యగా చూడాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విజయవాడ(ధర్నాచౌక్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నక్సల్ సమస్యను శాంతిభద్రతల సమస్యగా కాకుండా రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యగా గుర్తించినప్పుడే సరైన పరిష్కారం లభిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివాసీలపై మారణకాండ ఆపాలని, కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, హక్కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిరసన సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్‌లకు అప్పగించేందుకే ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులపై కేంద్రం మారణకాండకు ఒడిగట్టిందని ధ్వజమెత్తారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడటం దారుణమన్నారు.


మిర్చి ధరను అడ్డుకుంటే చర్యలు

» వ్యాపారుల ఎగుమతి లైసెన్సులు రద్దు చేస్తాం
» మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత హెచ్చరిక

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మిర్చి ధర పెరగక్కుండా ఎగుమతిదారులు అనైతిక చర్యలకు పాల్పడితే వారి ఎగుమతి లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేస్తామని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో విర్చి ఎగుమతిదారుల రహస్య సమావేశం శీర్షికతో ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందించారు. విదేశాలకు విర్చిని ఎగుమతి చేసే వ్యాపారులను ఆమె గుంటూరులోని తన కార్యాలయానికి పిలిపించుకుని మందలించారు. మిర్చి రైతులకు తగిన ధర రావడం లేదన్న విషయంలో సీఎం చంద్రబాబు చాలా సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. గత ఏడాది కంటే ప్రస్తుత సీజన్‌లో ధర తగ్గించడంపై సీరియస్ అయ్యారు. ఎక్స్‌పోర్టు క్వాలిటీతో పాటు దేశీయంగా వినియోగించే మిర్చి రకాల ధర పెరిగేందుకు సహకరించాలని కోరారు. చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు ఎగుమతి అయ్యే తేజ వెరైటీ విర్చికి గతంలో క్వింటాల్‌కు రూ.22 వేలకుపైగా లభిస్తే ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తుండటం సరికాదన్నారు. రైతులు పండించే మిర్చిపైనే లావాదేవీలు జరుగుతున్నాయని, అలానే ప్రభుత్వానికి మార్కెట్ ఫీజు వస్తున్నదన్న విషయాన్ని గ్రహించాలన్నారు.

గుడి వద్ద సీఐడీ డీఎస్పీ మృతదేహం

» అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


డీఎస్పీ నాగరాజు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఓ గుడి వద్ద ఒక వ్యక్తి విగత జీవిగా పడిఉన్నాడనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆరా తీయగా ఆయన డీఎస్పీ అని తెలిసింది. సీఐ బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీపురం పరిధిలోని ఎస్ఆర్ఎంటీ గోదాము సమీపంలోని సాయిబాబా గుడి దగ్గరలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికుల నుంచి గురువారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని ఫొటోను పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టిన కొద్దిసేపటికే ఆయన సీఐడీ డీఎస్పీ అని తెలిసింది. కర్నూలు జిల్లా ఆస్పరికి చెందిన బి.నాగరాజు(54) 1995లో ఎస్ఐగా సర్వీసులో చేరి డీఎస్పీ స్థాయికి ఎదిగారు. ఏడాది క్రితం బదిలీపై రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయానికి వచ్చారు. లాడ్జిల్లో ఉంటూ విధులకు హాజరయ్యేవారు. డిసెంబరు నుంచి మెడికల్ లీవులో ఉన్నారు. ఈ నెల 2న రాజమహేంద్రవరం వెళుతున్నానని కర్నూలు నుంచి వచ్చారు. ఇక్కడ ఓ లాడ్జిలో ఉంటూ 10వ తేదీ వరకూ కుటుంబ సభ్యులకు ఫోనులో అందుబాటులో ఉన్నారు. ఆ రోజు రాత్రి 10 గంటలకు చివరిగా మాట్లాడారు. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. హైదరాబాద్‌లో ఉంటున్న నాగరాజు కుమారుడు వంశీకృష్ణ గురువారం ఉదయం రాజమహేంద్రవరం వచ్చి ఆరా తీయగా ఆఫీస్‌కి రావడం లేదని చెప్పారు. వాట్సాప్ గ్రూపుల్లో పెట్టిన ఫోటోను సీఐడీ సిబ్బంది గుర్తించి ప్రకాశం నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాజీలాల్ పేర్కొన్నారు.



సాయి మనోజ్ఞను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, చిత్రంలో ఆమె తల్లిదండ్రులు పద్మజ, కిశోర్ చౌదరి, భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, భాష్యం హనుమంతరావు

సాయిమనోజ్ఞ రాష్ట్రానికే గర్వకారణం

» జేఈఈ టాపర్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అభినందన

అమరావతి/గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఆలిండియా టాపర్‌గా జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గుత్తికొండ సాయి మనోజ్ఞ రాష్ట్రానికే గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. గురువారం అమరావతి క్యాంప్ కార్యాలయంలో సాయి మనోజ్ఞను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ యువత ప్రతిభావంతులని, వారి సామర్థ్యాలను వెలికితీసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి నిలిపి దానికి అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తూ ప్రతి విద్యార్థీ తన పూర్తి సామర్థ్యాన్ని వినియోగించి గొప్ప విజయాలు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. సాయి మనోజ్ఞ 100 పర్సంటైల్ సాధించిన ఏకైక తెలుగు విద్యార్థినిగా రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేశ్ సాయి మనోజ్ఞను అభినందిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి కఠోర శ్రమ ఒక్కటే మార్గమని సూచించారు. ఎటువంటి అవసరమైనా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతి బిడ్డ విజయంలో తల్లి పాత్ర ఎంతో కీలకమని సాయి మనోజ్ఞ తల్లి పద్మజను లోకేశ్ సత్కరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సాయిమనోజ్ఞ తండ్రి కిశోర్ చౌదరితో కరిక్యులం ప్రక్షాళనపై లోకేశ్ చర్చించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు పాల్గొన్నారు.

తక్కువ మంది విద్యార్థులున్న ఎయిడెడ్ స్కూళ్లపై చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతి తక్కువ మంది విద్యార్థులతో నడుస్తున్న ఎయిడెడ్ పాఠశాలలపై చర్యలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. గత మూడేళ్ల నుంచి వరుసగా విద్యార్థులు తగ్గిపోతున్న పాఠశాలలకు నోటీసులు జారీచేయాలని ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశించారు. అలాగే 40 కంటే తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఏం చర్యలు తీసుకున్నారో నివేదికలు సమర్పించాలని సూచించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా 126 ఎయిడెడ్ పాఠశాలల్లో 40 మందిలోపు విద్యార్థులున్నారు. అసలు విద్యార్థులు లేని పాఠశాలలు కూడా 80 ఉన్నాయి. జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, మిగులు ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని టీచర్స్ గిల్డ్ ప్రతినిధి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి కోరారు.

రంజాన్ ఏర్పాట్ల కోసం అధికారులకు ఆదేశాలివ్వండి

» ప్రభుత్వానికి రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ నెలలో ముస్లింలకు సౌకర్యాలు కల్పించేందుకు, ఏర్పాట్ల నిర్వహణకు జిల్లా పరిపాలన, అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి వక్ఫ్ బోర్డు లేఖ రాసింది. ఈ మేరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే వక్ఫ్ బోర్డు కార్యాలయం నుంచి రాష్ట్రంలోని ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్‌లకు, వక్ఫ్ సంస్థల నిర్వాహకులకు రంజాన్ మాసానికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టవలసిందిగా ఆదేశించామని తెలిపారు. ఆరోగ్య జాగ్రత్తలు, పారిశుధ్యం, భద్రతా ప్రమాణాలు, విద్యుత్‌సరఫరాపై సంబంధితశాఖల అధికారులను ఆదేశించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఉపవాస దీక్షలు ఉండే ముస్లింల కోసం దుకాణాలకు, కూరగాయల మార్కెట్లకు, హోటళ్ల రాత్రి బాగా పొద్దుపోయే వరకు తెరిచి ఉంచేలా, తెల్లవారుజామున తెరిచేందుకు అనుమతులు ఇచ్చే విధంగా పోలీస్‌శాఖను కోరినట్లు అజీజ్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇదేనా న్యాయం?

ఒకరి మరణానికి మరొకరి చర్యలు కారణమైనట్టుగా రుజువైతే చాలు, భారతదేశ చట్టాల ప్రకారం సదరు వ్యక్తికి ఐదేళ్ళనుంచి యావజ్జీవం వరకూ శిక్షపడుతుంది. కేసు తీవ్రత, ఇమిడివున్న హింస ఇత్యాదివి న్యాయమూర్తుల మనసును తాకితే శిక్షల స్థాయిలో తేడాలుంటాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి ఒక భయానకమైన కేసులో చెప్పిన తీర్పు ఆగ్రహాశ్చర్యాలను కలిగించింది, తీవ్ర చర్చకు దారితీసింది. భార్య నిరాకరిస్తున్నా అసహజ శృంగారం చేసి అంతిమంగా ఆమె చావుకు కారకుడైన ఓ నలభైయేళ్ళ వ్యక్తిని జస్టిస్ నరేంద్రకుమార్ వ్యాస్ నిర్దోషిగా ప్రకటించి, జైలు నుంచి వదిలేయాల్సిందిగా ఆదేశించారు. తన చావుకు భర్త కారకుడని, తాను తిరస్కరిస్తున్నా అతడు అసహజమైన రీతుల్లో అఘాయిత్యానికి పాల్పడ్డాడని మేజిస్ట్రేట్ సమక్షంలో భార్య ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా, ఇప్పటికే జగదల్‌పూర్ అదనపు సెషన్స్ న్యాయమూర్తి అతడికి పదేళ్ళ కఠిన కారాగార శిక్ష విధించింది. ఆ తీర్పును ఇప్పుడు రద్దుచేస్తూ, భార్య వయసు పదిహేనేళ్ళు దాటినపక్షంలో, 'సమ్మతి' అన్నమాటకు విలువే ఉండదని న్యాయమూర్తి అన్నారు. వైవాహిక బంధంలో అత్యాచారాలు, అఘాయిత్యాలు అన్న మాటలకు ఈ దేశచట్టాలు తావివ్వవు కనుక, 'మారిటల్ రేప్'కు పాల్పడినందుకు మగవాడిని అరెస్టుచేయడానికి ఇక్కడ వీల్లేదు కనుక దిగువకోర్టు శోధించి విధించిన సెక్షన్లన్నింటినీ హైకోర్టు న్యాయమూర్తి పక్కకు నెట్టి సదరు భర్తను నిర్దోషి అని తేల్చేశారు. ఐపీసీ సెక్షన్ 375లో భర్తలకు దఖలుపడిన మినహాయింపుల కారణంగా, అత్యాచారం, అసహజ శృంగారం, దోషపూరిత నరహత్య ఇత్యాదివన్నీ ఈ కేసులో కొరగాకుండా పోయాయి. అన్యాయమైన చట్టాలున్నప్పుడు తీర్పులు కూడా అన్యాయంగానే ఉంటాయి. కానీ, ఈ కేసులో దిగువకోర్టులో బాధితురాలికి దక్కిన ఆ కాస్త మరణానంతర న్యాయం కూడా పెద్దకోర్టులో లభించకపోవడం విషాదం.

ఆమె మరణానికీ, వాంగ్మూలానికీ విలువే లేకపోయింది. 2013లో ఐపీసీ సెక్షన్ 375కు చేసిన సవరణ కారణంగా వైవాహిక బంధంలో భార్య అనుమతి, సమ్మతికి తావు లేకపోయింది. భర్తచేసే లైంగికచర్య ఎటువంటిదైనా అత్యాచారం కాకుండా పోయింది. అఘాయిత్యాలకు కూడా అధికారిక అనుమతి దక్కింది. నిర్దిష్ట వయోపరిమితి దాటితే చాలు, ఆమె అభీష్టంతో నిమిత్తం లేకుండా శృంగారానికి తెగబడవచ్చు. అతడి అసహజ శృంగారం కారణంగానే ఆమె శరీర అంతర్భాగాలు ఛిద్రమై మరణించిందని పోస్టుమార్టమ్ నివేదిక నిర్ధారించింది. వైవాహిక బంధంలో అత్యాచారం అన్నదానికి గుర్తింపు లేనందున, ఆమె ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా శృంగారం చేయడానికే కాదు, అసహజరీతిలో వ్యవహరించి ప్రాణాలనే ప్రమాదంలో పడవేయవచ్చునని ఈ తీర్పు చెబుతోంది. వైవాహిక స్థితితో నిమిత్తం లేకుండా ప్రతీ వ్యక్తి హక్కునూ, గౌరవాన్ని పరిరక్షించాల్సిన చట్టాలు కేవలం పెళ్ళయిన కారణంగా సమ్మతికి స్థానం లేకుండా చేసి, మరొకరికి బలిపెట్టే రీతిలో తయారుకావడం సరికాదు.

ఎనిమిదేళ్ళనాటి ఈ కేసు భారత న్యాయసంహితలోనూ పకడ్బందీగా కొనసాగుతున్న నిబంధలను సరిదిద్దుకోవాల్సిన కర్తవ్యాన్ని గుర్తుచేస్తోంది. కేవలం వివాహం అయిన కారణంగా ఆమె మరణానికి కారకుడైన వ్యక్తికి సెక్షన్ 304, 376, 377 వంటివి వర్తించకుండాపోవడం, భార్య మరణ వాంగ్మూలానికీ, పోస్టుమార్టమ్ నివేదికకూ వీసమెత్తు విలువలేకపోవడం, ఆమె మరణానికి కారకుడైనప్పటికీ భర్త అయినందున చట్టం అతడిని వదిలెయ్యడం సరికాదు.

వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించలేమనీ, ఇది చట్టబద్ధమైన అంశాన్ని మించిన సామాజిక సమస్య అని కేంద్రం వాదిస్తోంది. వివాహం చేసుకున్నంత మాత్రాన సమ్మతి తొలగిపోయినట్లు కాదనీ, దానిని రక్షించే నిబంధనలున్నాయని మరోపక్క హామీ ఇస్తోంది. కానీ, ఈ తీర్పు అనంతరం అనేక కొత్త ప్రశ్నలు, సవాళ్ళు తలెత్తాయి. సుప్రీంకోర్టు తక్షణ జోక్యంతో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఆదేశాలను నిలువరించి, సమాజానికి తప్పుడు సందేశాలు పోకుండా జాగ్రత్తపడాలి. ఆమోదం లేని శృంగారానికీ, పెళ్ళి ముసుగులో జరిగే అఘాయిత్యాలకు ఎటువంటి రక్షణలూ దక్కకుండా దేశ సర్వోన్నత న్యాయస్థానం, కేంద్రప్రభుత్వం కలసికట్టుగా కృషిచేయాలి.

తెలుగు రాష్ట్రాల కయ్యం ఎగువ రాష్ట్రాలకు వినోదం

కృష్ణ, గోదావరి జలాలను వినియోగించుకోవడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కొట్లాడుకుంటుంటే, ఎగువన వున్న కర్ణాటక, మహారాష్ట్రలు వినోదం చూస్తూ వారి పనులు చక్కబెట్టుకుంటున్నాయి. అన్ని విధాలుగా విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతున్నది. ముఖ్యంగా రెండు రాష్ట్రాల పాలకులు, ప్రతిపక్ష, ఇతర రాజకీయ నాయకులు, సామాజిక మేధావులు ఒక తాటిపైకి వచ్చి కృష్ణ, గోదావరి నదులపై కర్ణాటక, మహారాష్ట్రలు సాగిస్తున్న ఆధిపత్యంపై పోరాడాలి. ఇక్కడ ఒకే రాష్ట్రంలో ఉన్న కొద్దిపాటి నీటి కోసం అనుసంధానం గురించి ఆలోచించకుండా జాతీయ స్థాయిలో నదుల అనుసంధానంపై కేంద్రం మీద ఒత్తిడి తేవాలి. ఉత్తరాదిన ఉన్న గంగానదిని, దక్షిణాదిన ఉన్న కావేరితో అనుసంధానం చేసినప్పుడే భారతదేశం సస్యశ్యామలమవుతుంది.

జాతీయ స్థాయిలో నదుల సంధానంలో భాగంగా గంగ–కావేరి లింక్ ప్రాజెక్ట్ గురించి 2000–2004 మధ్య ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయి తీవ్రంగా కసరత్తు చేశారు. 2002లో రాష్ట్రపతి అబ్దుల్ కలాం జాతినుద్దేశించి ప్రసంగిస్తూ... దేశంలో కొన్ని రాష్ట్రాలు దుర్భిక్షంతో అల్లాడుతుంటే, మరికొన్ని భయంకర వరదలతో భీతిల్లుతున్నాయని, ఇందుకు శాశ్వత పరిష్కారం నదుల అనుసంధానమేనన్నారు. వెంటనే రంజిత్ కుమార్ అనే న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా ఈ విషయాన్ని సుప్రీంకోర్ట్ దృష్టికి తీసుకెళ్లారు. ఏకీభవించిన న్యాయస్థానం ఈ బృహత్తర పథకాన్ని 2012 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. వాజ్‌పేయి కూడా అప్పటి కేంద్రమంత్రి సురేష్ ప్రభు సారథ్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా వాజ్‌పేయిని కలిసి కోటి రూపాయలు విరాళం కూడా ఇచ్చారు. 2004లో ప్రభుత్వం మారడంతో ఈ నదుల అనుసంధాన ప్రక్రియ మూలనపడింది. సుప్రీంకోర్ట్ 2012లో ఈ విషయం గురించి కన్నెర్ర చేసి 2016లోగా నదుల అనుసంధానం పూర్తి చేయాలని ఆదేశించింది. 2014లో మళ్లీ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నదుల అనుసంధానం, గంగానది ప్రక్షాళన, నదులలో పెరుగుతున్న కాలుష్యం గురించి ప్రధాని నరేంద్ర మోదీ కొంతమేర కదలిక తీసుకొచ్చారు. కానీ ప్రస్తుతం ఈ విషయాలను కేంద్ర పాలకులు పట్టించుకోవడం మానేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాయకులు ఎంతగా వద్దని వారించినా కర్ణాటక ఆలమట్టి డ్యాం ఎత్తును పెంచింది. అలాగే కర్ణాటకలోని ఎగువ తుంగ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించింది. ఇదే విధంగా మహారాష్ట్ర కూడా గోదావరి మీద బాబ్లీ ప్రాజెక్టు పూర్తి చేసింది. కృష్ణ, గోదావరి నదులపై మహారాష్ట్ర కర్ణాటకలు అనధికారికంగా చెక్‌డ్యాంలు, రిజర్వాయర్‌లు నిర్మిస్తున్నాయి. ఎగువ రాష్ట్రాల నుండి వస్తున్న నీటిపై మన హక్కులను కాపాడుకోవడం కోసం తెలుగు రాష్ట్రాల ప్రజలు సమైక్యంగా పోరాడాలి.

– తిప్పినేని రామదాసప్పనాయుడు

1931–2025: గమ్యం చేరని కుల లెక్కల బండి!

ప్రతి దేశానికి కొండగుర్తుల్లా కొన్ని ఏడాదులు ఉంటాయి. సమాజ జీవితాన్ని కీలక మలుపు తిప్పిన ఆ సంవత్సరాలకు ప్రాధాన్యం ఇవ్వటం అన్ని దేశాల్లోనూ ఉంటుంది. పరాయి పాలకుల నుంచి స్వాతంత్ర్యం పొందిన ఏడాదికున్న ప్రాముఖ్యత మరోదానికి ఉండదు. వలస పాలకులపై జరిపిన సమరాల్లో ముఖ్యమైన వాటినీ అలాగే గుర్తు పెట్టుకుంటాం. బ్రిటిషు పాలకులపై దేశవ్యాప్తంగా పోరాటం పెల్లుబికిన 1857నీ అలాగే స్మరించుకుంటాం. వీటికి భిన్నమైనవీ కొన్ని ఉంటాయి. అలాంటి వాటిల్లో 1931 ఒకటి. నిజానికది ఏ ప్రజాపోరాటాలకు సంబంధించిన ఏడాది కాదు. కులాల ఆధారంగా జనాభా లెక్కలను చివరిసారిగా సేకరించిన ఏడాదిగా మాత్రమే దానికి ప్రాధాన్యత ఉంది. కులాల సరిహద్దులను దాటలేని సామాజిక పరిస్థితుల్లో మనమింకా జీవిస్తున్నామనటానికి ఇప్పటికీ ఆ ఏడాదికి లభిస్తున్న ప్రాధాన్యతే నిదర్శనం. ఉద్యోగాలు, పదవులు, ఆస్తుల్లో వివిధ కులాలకున్న



■ రాహుల్ కుమార్



ప్రాబల్యం గురించి చర్చలు ఇటీవల బాగా ఊపందుకున్నాయి. తెలంగాణలో కులగణన వివరాలను వెల్లడించటంతో వివాదాలూ తీవ్రంగా ముసురుకుంటున్నాయి. భవిష్యత్తులో కులగణన చేపట్టే ఏ రాష్ట్రంలోనైనా ఇదే పరిస్థితి తలెత్తవచ్చు!

కులాల లెక్కలపై ఏకాభిప్రాయం రావటం చాలా అరుదు. ఫలానా కులం జనాభాని తక్కువచేసి చూపించారనీ అధికార పార్టీకి దగ్గరగా ఉన్న మరో కులం జనాభాని అధికంగా చూపించారనీ విమర్శలు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ విమర్శల్లో ప్రధానమైనవి రెండే. సర్వేను సమగ్రంగా జరపకుండా బీసీల సంఖ్యను తక్కువగా చూపారన్నది మొదటి విమర్శగా చెప్పుకోవచ్చు. ముస్లింల్లో వెనుకబడిన తరగతులుగా కొందరిని గుర్తించి వారిని బీసీల్లో కలపటం ఏమిటని ప్రశ్నించటాన్ని రెండో విమర్శగా పరిగణించొచ్చు. బీజేపీ నేతలు రెండో విమర్శను ఎక్కువగా చేస్తున్నారు. ఈ రెండు విమర్శలకూ బీజాలు ఇప్పటివి కావు. వీటికి చాలా చరిత్ర ఉంది.

మొదటి విమర్శ చేసే వాళ్ల వాదనకు... మండల్ కమిషన్ బీసీల విషయంలో వేసిన అంచనాల లోతుల్లోకి వెళ్లకపోవటమే ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో కులాల లెక్కలు వచ్చినా వాటిని బయట పెట్టలేదు. వాటి వెల్లడికి ఎన్ని డిమాండులు వచ్చినా ఖాతరూ చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం కులగణన వివరాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల వారీగా అసెంబ్లీలో వెల్లడిస్తున్న సందర్భంలో రాజకీయ ఎదురుదాడి కోసం 2014 నాటి సమగ్ర కుటుంబ సర్వే విశేషాల్లో కొన్నిటిని బీఆర్ఎస్ పార్టీ వెలుగులోకి తెచ్చింది. ఆనాటి సర్వేలో బీసీలు 51 శాతంగా ఉన్నట్లు తేలిందనీ పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన సర్వేలో ఆ శాతం ఎలా తగ్గుతుందనీ ప్రశ్నించింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే హిందూ బీసీలు 46.25 శాతం ఉన్నట్లు మాత్రమే నిర్ధారించింది. మరోవైపు రాష్ట్రంలోని మొత్తం ముస్లిం జనాభాని 12.56 శాతంగా పేర్కొని అందులో 10.8 శాతాన్ని వెనుకబడిన తరగతులుగా నిర్ధారించింది. ఈ 10.8 శాతాన్ని హిందూ బీసీలతో కలిపేసి బీసీలు మొత్తంగా 56.33 శాతంగా ఉన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది.

హిందూ, ముస్లింల్లోని బీసీలను కలిపి లెక్కించటం కొత్త కాకపోయినా బహిరంగ విమర్శలూ అంతర్గత అసంతృప్తులూ ఆగటం లేదు. కొన్ని లక్షల కుటుంబాలు (3,56,323) సర్వేలో పాల్గొనలేదని ప్రభుత్వం వెల్లడించటమూ విమర్శలకు కారణమైంది. సర్వేలో పాల్గొనని వారి కోసం మళ్లీ కుల గణనను చేపడతామని ప్రభుత్వం ప్రకటించాల్సి వచ్చింది. హిందువులు, ముస్లింల్లోని వెనుకబడిన తరగతులను కలిపి లెక్కించి మొత్తంగా ఈ వర్గాలకు 27 శాతం రిజర్వేషన్లు ఉండాలని మండల్ కమిషన్ స్పష్టమైన సిఫార్సులు చేసింది. హిందూ కులాల్లో వెనుకబడిన తరగతులను నిర్ధారించటానికి ఏ ప్రమాణాలను అనుసరించిందో వాటినే ముస్లింలకూ వర్తింపచేసింది. కమిషన్ సిఫార్సులను సుప్రీంకోర్టు ఆమోదించింది. కులాలవారీ జనాభాలెక్కలు మండల్ కమిషన్‌కు ఆనాడు అందుబాటులో లేవు. 1980లో చేసిన సిఫార్సులకు 1931 నాటి జనాభా లెక్కలపైనే ఆధారపడింది. 1951, 1961, 1971ల్లో చేపట్టిన జనాభా లెక్కలను పరిశీలించి ప్రతి దశాబ్దానికి నమోదైన జనాభా పెరుగుదల రేటుపై కమిషన్ ఒక అంచనాకు వచ్చింది. ఆ జనాభా రేటుని 1931 నాటి లెక్కలకు అన్వయించి బీసీల శాతాన్ని స్థూలంగా నిర్ధారించింది.

హిందువుల్లో బీసీలు 50 శాతానికి పైగా ఉంటారని మండల్ కమిషన్ చెప్పలేదు. హిందూ బీసీలను 43.70 శాతంగానే పేర్కొంది. ఇతర మతాల్లోని (ప్రధానంగా ముస్లింల్లోని) వెనుకబడిన తరగతులను 8.40శాతంగా నిర్ధారించింది. అలా మొత్తంగా బీసీలను 52 శాతంగా లెక్కగట్టి 27శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించింది. మండల్ కమిషన్ నివేదికలో బీసీలుగా పేర్కొన్న ముస్లింలు అప్పటి నుంచి కేంద్రంలో ఓబీసీ జాబితాలో ఉన్నారు. ఆ తర్వాత కూడా ముస్లింల్లోని వెనుకబడిన తరగతులను కేంద్ర జాబితాలో చేర్చారు. అయితే మండల్ కమిషన్ ముస్లింల్లో 52శాతం జనాభాని మాత్రమే బీసీలుగా పరిగణించవచ్చని పేర్కొంది. తెలంగాణలో మాత్రం 89శాతం ముస్లింలను బీసీలుగా నిర్ధారించారు. బీసీ–ఈ కింద ముస్లింలకు ప్రస్తుతం రిజర్వేషన్లను అమలుచేస్తున్నారు. బీసీ–ఈలో చేర్చిన ముస్లిం వర్గాల జనాభా ఇంత అధికంగా ఉండటానికి సహేతుక

1931 నాటి ప్రధాన కులాల జనాభా

1. బలిజ	39,300	33. పార్ధీ	6,009
2. బోయ	2,214	34. పెరిక	51,504
3. భట్రాజు	12,491	35. పిచ్చకుంట్ల	8,957
4. బెస్త	1,27,182	36. రంగారి (రంగ్రేజ్)	8,343
5. భోగం	17,046	37. సాతాని	50,627
6. బ్రాహ్మణ	1,26,449	38. ఔసుల–కంసాల	89,617
7. మేదరి	22,381	39. సుతార్	80,272
8. దర్జీ	40,870	40. తెలగ (మున్నూరు, ముత్రాసీ)	8,59,874
9. చాకలి	2,12,709	41. తేలి (గాండ్ల)	25,375
10. గోశాయి	1,003	42. ఉప్పర	29,284
11. గుర్జర్	962	43. వెలమ	48,988
12. గురవ్	7,585	44. వీరముష్టి	6,225
13. మంగలి	96,915	45. వడ్డెర	93,946
14. హత్కర్	4,991	46. వంజరి	40,740
15. దేవాంగ్ (సాలె)	3,06,844	47. యాదవ	5,10,576
16. ఈడిగ (గౌండ్ల)	3,73,341	**గిరిజన తెగలు**	
17. కాపు	7,94,043	1. చెంచు	2,264
18. రెడ్డి	1,64,372	2. ఎరకల	37,727
19. కటిక	65,561	3. గోండ్	1,09,830
20. కంచరి	16,392	4. కోయ	33,638
21. కుమ్మర	85,904	5. లంబాడీ	2,02,423
22. కోలి	12,291	6. పార్ధీ	5,608
23. కోమటి	2,25,160	7. వర్గీకరించని గిరిజనులు	4,228
24. క్షత్రియ (రాజ్‌పుత్)	29,673	8. గిసాడి	2,171
25. కురుమ	1,70,015	**ఆది హిందూ కులాలు**	
26. లింగాయత్ (జంగం)	72,826	1. దౌర్ (మాల, మహార్)	4,81,722
27. లోధ	4,780	2. మాదిగ (మోబీ,మాంగ్)	7,72,680
28. కమ్మరి	62,025	**ఇతర మతాలు**	
29. మాలి	4,166	1. ముస్లిం	6,79,322
30. మరాఠా	70,516	2. క్రైస్తవులు	1,20,518
31. మార్వాడి	12,253		
32. పాంచాల్	1,087		

నాటి తెలంగాణ జనాభా 75,54,598

కారణాలను ప్రభుత్వం చూపించాల్సి ఉంటుంది. కులగణన సర్వేలో ముస్లింలకు సంబంధించి లభ్యమైన సమస్త సమాచారాన్ని ప్రజల ముందు పెడితే కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది.

బీసీల శాతానికి సంబంధించి నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు (ఎన్ఎస్ఎస్ఓ) 2011–2012లో వేసిన అంచనాలు కూడా భిన్నంగానే ఉన్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఎంపిక చేసుకున్న గ్రామాలు, పట్టణ–నగర ప్రాంతాలను అధ్యయనం చేసి ఎంతో విలువైన సమాచారాన్ని ఎన్ఎస్ఎస్ఓ అయిదేళ్లకు ఒకసారి అందిస్తుంది. దేశ జనాభాలో ఎస్టీలు (8.8శాతం), ఎస్సీలు ((18.7శాతం), ఓబీసీలు (43.1 శాతం) ఉన్నట్లు ఎన్ఎస్ఎస్ఓ అంచనా వేసింది. 2004–2005 నాటి సర్వేతో పోల్చితే ఓబీసీ జనాభా 3శాతం పెరిగినట్లు కూడా పేర్కొంది. ఒకటి మాత్రం స్పష్టం. రాష్ట్ర ప్రభుత్వాలు చేసే సర్వేలకంటే ఎన్ఎస్ఎస్ఓ సర్వేలు చాలా ప్రామాణికంగా ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం 2024 మే నెలలో ప్రచురించిన 'సోషల్ వెల్ఫేర్ స్టాటిస్టిక్స్' పుస్తకంలో కూడా ఓబీసీ శాతాలను రాష్ట్రాల వారీగా పేర్కొంటూ ఎన్ఎస్ఎస్ఓ గణాంకాలనే ఉదహరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓబీసీలు 50.4శాతం ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 35 ఉంటే 10 చోట్ల మాత్రమే ఓబీసీల జనాభా 50 శాతం దాటింది. దేశవ్యాప్త సగటు 44శాతం మాత్రమేని పేర్కొంది.

తెలంగాణలో బీసీల లెక్కలు 1931లో ఎలా ఉన్నాయో తెలుసుకోవటం కూడా ఆసక్తిగా ఉంటుంది. ఇప్పుడు బీసీలుగా పరిగణిస్తున్న కులాల జనాభాని లెక్కించి చూస్తే అప్పుడు కూడా బీసీలు 46–47 శాతం మధ్యలో ఉన్నట్లే కనపడుతుంది. పక్కన ఇచ్చిన పట్టికలో పేర్కొన్న కాపులు, లింగాయత్, మరాఠీలను బీసీల్లో కలపకుండా లెక్కిస్తే ఈ శాతం వచ్చింది. మరాఠీల్లో బ్రాహ్మణేతరులు మాత్రమే ప్రస్తుతం తెలంగాణ బీసీ జాబితాలో ఉన్నారు. కులగణన పత్రంలో లింగాయత్‌లను ఓసీల జాబితాలో ఉన్నట్టు చూపించారు. మరాఠీలతో పాటు 5000 లోపున్న చిన్న కులాల జనాభాను కలిపితే (పట్టికలో వీటి వివరాలు ఇవ్వలేదు) బీసీల శాతంలో చాలా స్వల్పంగా మార్పు ఉండొచ్చు. ఇక తెలంగాణలో రెడ్లను ప్రత్యేక కులంగా గణించటం 1931తోనే మొదలైంది. అప్పటి వరకూ రెడ్లు తమని కాపులుగానే చెప్పుకునేవారు. 1931 నాటి జనాభా లెక్కల సేకరణ నాటికి రెడ్లుగా నమోదు చేయించుకున్న వారు తక్కువేనని చెప్పాలి. ఆనాటి కోమట్ల సంఖ్య (2,25,160)తో పోల్చితే జనాభాలో రెడ్లుగా నమోదైన వారు 1,64,372 మాత్రం ఉండటమే దీనికి నిదర్శనం. కాపులను కూడా కలిపి చూస్తే తెలంగాణలో ఓసీల జనాభా 19.12శాతం తేలుతుంది. లింగాయత్, బ్రాహ్మణ మరాఠీలను జాబితాలో కలిపితే ఇందులో కొంత తేడా రావచ్చు. తాజా సర్వేలో తెలంగాణలో హిందూ ఓసీలు 13.31శాతం మాత్రమే ఉన్నారు. ముస్లిం ఓసీలను కలిపితే అది 15.79శాతం అయింది.

అయిదు అధికారిక సర్వేలూ–అంచనాల్లోనే కులాల శాతాలకు సంబంధించి ఇన్ని తేడాలు ఉన్నాయి. కులాల లెక్కల్లో దిగిరావటం ఉండదు. పెంచుకోటానికే ప్రయత్నాలన్నీ ఉంటాయి. కుల చైతన్యం ఎంతగా విజృంభిస్తే అంతగా మన సామాజిక జీవితం సంక్లిష్టమూ సమస్యాత్మకమూ అవుతుంది. పరిమిత వనరులు, పరిమిత ఉద్యోగాలు, పెరిగే జనాభాకు అనుగుణంగా వేగమెక్కని ఆర్థికాభివృద్ధి, విపరీతంగా పెరిగే అసమానత్వం సామాజిక సమూహాల మధ్య తీవ్ర పోటీకీ వైషమ్యాలకూ దారితీస్తుంది. ఆ పోటీ సంఖ్యాధిక్యతల మార్పుపై విముఖతను వ్యక్తం చేస్తుంది. అందుకే కులాల లెక్కలను కదిలించటం తేలిక! ఆమోదాన్ని సాధించటం కష్టం!

> **పరిమిత వనరులు, పరిమిత ఉద్యోగాలు, పెరిగే జనాభాకు అనుగుణంగా వేగమెక్కని ఆర్థికాభివృద్ధి, విపరీతంగా పెరిగే అసమానత్వం సామాజిక సమూహాల మధ్య తీవ్ర పోటీకీ వైషమ్యాలకూ దారితీస్తుంది. ఆ పోటీ సంఖ్యాధిక్యతల మార్పుపై విముఖతను వ్యక్తం చేస్తుంది. అందుకే కులాల లెక్కలను కదిలించటం తేలిక! ఆమోదాన్ని సాధించటం కష్టం!**

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

కృత్రిమ మేధో విప్లవం.. సన్నద్ధత ముఖ్యం

రానున్న కాలం కృత్రిమ మేధదే. అది ప్రపంచాన్ని పాలించబోతోంది. తగ్గ సన్నద్ధత చూపని దేశం వెనకబడక తప్పదు. కృత్రిమ మేధను విశ్వమానవ శ్రేయస్సుకి ఉపయోగపడేలా జాగ్రత్త వహించాలి. అందులో భాగంగా ఏభైకి పైగా దేశాలు కలిసి ఒక సదస్సు ఫ్రాన్స్‌లో నిర్వహించాయి. భారత్ కూడా ముఖ్య భూమిక తీసుకుంది. రెండో సమావేశం భారత్‌లో జరపబోతున్నట్లు ప్రకటించింది. ఎందుకీ సన్నద్ధత అంటే కృత్రిమ మేధ సంబంధిత విజ్ఞానం ఏ ఒక్కరి దగ్గరో పోగుపడి వారి స్వార్థానికే ఉపయోగపడేలా కాకుండా అందరికీ అందడానికి. మేలైన పరిశోధనలు జరిగి, ఆ ఫలాలు ఉమ్మడిగా పొందడానికి.

ఇంతవరకూ కృత్రిమ మేధ పరిశోధనల్లో అమెరికా ముందుంది. చాట్‌జీపీటీ ద్వారా ప్రపంచానికి ఆ విజ్ఞాన ఫలాన్ని పరిచయం చేసినా, పరిశోధన కొనసాగేందుకు వీలైన సమాచారాన్ని, సాంకేతికతను మిగతా దేశాలకు దూరంగా ఉంచింది, లేదా బాగా ఖరీదైన వ్యవహారంగా ఉంచింది. ఎప్పుడైతే చాట్‌జీపీటీకి పోటీగా చైనా అతి చౌకగా డీప్‌సీక్ తెచ్చి, అదే స్థాయిని సాధించడమే కాకుండా, సాంకేతిక సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచిందో, అమెరికా పెత్తనం చేజారింది. ఇప్పుడు భారత్ సహా మిగతా దేశాలన్నీ కోరుతున్నది ఇదే. పరిశోధనకు అవసరమైన విజ్ఞానం అన్ని దేశాలకు లభ్యం కావాలి. పేద దేశమైనా ఆ రంగంలో ప్రగతి సాధించగలగాలి. ప్రయోజనాలు అధికంగా, ఉమ్మడిగా పొందడానికి అవకాశం ఉండాలి తప్ప, ఏ ఒక్కరి చేతిలోనో బందీ కారాదు.

ఇక కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాలు పోతాయన్నది. నిజమే చాలా వరకూ పోతాయి. అదే సమయంలో కొత్త ఉద్యోగాలు వస్తాయి. కొత్త నైపుణ్యాల్ని అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. పవర్ లూమ్ వచ్చాక చరఖాలు మూలపడినట్లు చాలా రంగాల్లో మార్పులు వస్తాయి. వాటికి తగ్గట్టుగా మారాల్సిందే. అదే సమయంలో యంత్రం దానికి ఇచ్చిన ఫీడ్ బట్టే ఫలితాన్ని ఇస్తుంది. తప్పుడుగా ఇస్తే, తప్పుడు ఫలితాలొస్తాయి. తప్పులు లేని వ్యవస్థ, అందుకు తగ్గ ఉమ్మడి నియమాలు, నియంత్రణ ఏర్పరుచుకోవాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. దీనికి అమెరికా, బ్రిటన్ సరే అనలేదు. పెత్తనం పోతుందని బాధేమో! భారత్‌తో సహా మిగతా దేశాలు తత్సంబంధిత పరిశోధనలకు పెద్దపీట వెయ్యడమే కాకుండా, కలిసి ముందుకు సాగాలి.

– డి.వి.జి శంకరరావు, మాజీ ఎంపీ

ఢిల్లీ: మూడో కన్ను తెరిచిన మధ్యతరగతి



■ రాజ్‌దీప్ సర్దేశాయి


దీపశిఖ

అరవింద్ కేజ్రీవాల్ ఒక ప్రజా నాయకుడుగా తనను తాను పునరావిష్కరించుకోగలరా? తన రాజకీయ పునరాగమనాన్ని సుసాధ్యం చేసే సానుకూలతలను సృష్టించుకోగలరా? నైతిక విలువలకు నిబద్ధమైన నాయకుడు అనే యశస్సు తుడిచిపెట్టుకుపోయినందున కోల్పోయిన వైభవాన్ని పునః సాధించుకునేందుకు కష్టసుఖాల నెదుర్కొంటూ ఆయన పోరాడవలసి ఉంటుంది.

నా స్నేహితురాలు ఒకరు పది సంవత్సరాల క్రితం (ఫిబ్రవరి 2015) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి ఓటు వేశారు. ఆమె మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీకి గట్టి మద్దతుదారు. 2014 సార్వత్రిక ఎన్నికలలో ప్రప్రథమంగా భారతీయ జనతా పార్టీకి ఆమె ఓటు వేశారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ పాలన నానా కుంభకోణాలకు తావివ్వడం పట్ల ఆగ్రహంతో ఆమె బీజేపీ వైపు మొగ్గారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ఆమె ఆప్‌కు ఓటు వేశారు. ఎందుకని? ఆమె ఇలా సమాధానమిచ్చారు: 'మోదీ, కేజ్రీవాల్ ఇరువురినీ నేను ఇష్టపడతాను. ఇరువురూ స్వయం కృషితో ఉన్నతస్థానాలకు ఎదిగిన నాయకులు. మార్పు తీసుకువస్తామని నమ్మకంగా హామీ ఇస్తున్నారు'.

సరే, ఆ ఫిబ్రవరి నుంచి ఈ ఫిబ్రవరికి వద్దాం. ఈ సారి బీజేపీకి ఆమె ఓటు వేశారు గత పదేళ్లుగా 'ఢిల్లీ ఫార్ములా' (ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్) ప్రకారం ఆమె ఓటు వేస్తూ వచ్చారు: కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్న ఆలోచన ఆమెకు లేనే లేదు. గెలిచే అవకాశాలు ఏ మాత్రం లేవు గనుక కాంగ్రెస్‌కు వేసే ఓటు పూర్తిగా వ్యర్థమయ్యే ఓటే అన్నది ఆమె అభిప్రాయం. మరి ఈసారి ఆప్‌కు ఓటు వేయకూడదని ఎందుకు నిర్ణయించుకున్నారు? 'ఆప్ పాలన నాకు తీవ్ర ఆశాభంగం కలిగించింది. నేనూ ఒకప్పుడు ఆప్ వలంటీర్‌గా పని చేశాను. ఇప్పుడు ఆప్ ఏమీ భిన్నమైన పార్టీ కాదని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. కేజ్రీవాల్ మరొక రాజకీయవేత్త మాత్రమే' అని ఆమె సమాధానమిచ్చారు.

ఢిల్లీ సంపన్న మధ్య తరగతి వర్గానికి ప్రతినిధి నా స్నేహితురాలు. ఆమె వోటింగ్ ప్రాధాన్యాలలో, 2025 ఎన్నికలల్లో ఆప్, అరవింద్ కేజ్రీవాల్ ఎందుకు ఓడిపోయారన్న దానికి కీలక కారణమున్నదని మీరు గ్రహించి ఉంటారు. ఢిల్లీ ఉజ్వల రాజకీయ తారగా కేజ్రీవాల్ మొట్టమొదట మెరిసినప్పుడు సంప్రదాయ రాజకీయవేత్తకు ఆయన పూర్తిగా భిన్నమైనవాడు అనే భావన ప్రజల మనసుల్లో నాటుకు పోయింది. ఐఐటి పట్టభద్రుడు, సమాచార హక్కు కార్యకర్త, మెగాసెసే పురస్కార గ్రహీత, ఇండియా అగనెస్ట్ కరప్షన్ సంస్థాపక సభ్యుడు అయిన కేజ్రీవాల్ అన్నిటికీ మించి 'ఆశాభావ' రాజకీయాలకు ప్రతినిధి అని దేశ ప్రజలు భావించారు, గౌరవించారు. నరేంద్ర మోదీ 'అచ్చే దిన్' (మంచి రోజు) తీసుకువస్తానని హామీ ఇవ్వగా ప్రజా జీవితంలో అవకాశవాద, అవినీతికర, జవాబుదారీతనం తూకుండా వ్యవహరిస్తున్న రాజకీయవేత్తలకు ప్రజా జీవితంలో స్థానం లేకుండా చేస్తానని కేజ్రీవాల్ వాగ్దానం చేశారు. బీజేపీ హిందుత్వ 'మతతత్వ' పార్టీగా, కాంగ్రెస్ కుటుంబ–కేంద్రిత, ప్రజలతో సన్నిహిత సంబంధాలు లేని కులీనుల ప్రాబల్యమున్న పార్టీగా ప్రజలు భావిస్తున్న కాలంలో అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీని ఏర్పాటు చేశారు. సరికొత్త, ఎటువంటి చరిత్ర భారం లేని పార్టీగా ఆప్ ప్రజల దృష్టికి వచ్చింది. మధ్య తరగతి విద్యావంతులు ఆప్ పట్ల ఆకర్షితులయ్యారు. దేశ పరిస్థితులను సమూలంగా మార్చి వేసేందుకు ఆ పార్టీ తమకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వగలదని ఆశించారు. స్వల్పకాలంలోనే ప్రజల సంపూర్ణ మద్దతుతో ఆప్ అధికారానికి వచ్చింది.



అయితే ఆప్ 'భిన్నమైన రాజకీయ పార్టీ' అన్న నమ్మకం గత పదేళ్లుగా క్రమంగా సడలిపోయింది. తొలుత ఆప్ పట్ల ఆకర్షితులయిన మధ్య తరగతి వారే ఇప్పుడు ఆ పార్టీని అధికారం నుంచి తొలగించారు. ఢిల్లీలో ఎల్లెడలా చెత్త కొండలు, రోడ్ల మీద పారుతున్న మురికి నీరు మొదలైన సమస్యలకు పరిష్కారం లభించగలదనే ఆశాభావంతోనే వారు ఆప్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారు. 2025 ఎన్నికల తీర్పును మధ్యతరగతి ప్రజల ఆగ్రహ 'ప్రభంజనం'కు అంతిమ దృష్టాంతంగా చెప్పవచ్చు.

ఇప్పుడు ఒక ప్రధాన ప్రశ్నను తరచి చూద్దాం: అరవింద్ కేజ్రీవాల్ ఒక ప్రజా నాయకుడుగా తనను తాను పునరావిష్కరించుకోగలరా? తన రాజకీయ పునరాగమనాన్ని సుసాధ్యం చేసే సానుకూలతలను సృష్టించుకోగలరా? నైతిక విలువలకు నిబద్ధమైన నాయకుడు అనే యశస్సు తుడిచిపెట్టుకుపోయినందున కోల్పోయిన వైభవాన్ని పునః సాధించుకునేందుకు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పోరాడవలసి ఉంటుంది, తప్పదు.

రాజకీయ సమస్యలు, సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు బీజేపీ, కాంగ్రెస్‌కు ఉన్నట్టుగా ఆప్‌కు పటిష్ఠ సంస్థాగత నిర్మాణం లేదు అధికారాన్ని ఆశించి మాత్రమే ఆప్‌లో చేరినవారు పార్టీ ఫిరాయించేందుకు వెనుకాడరు. వచ్చే కొద్ది నెలల్లో చీలికలు, ఫిరాయింపులతో ఆప్ బలహీనపడే అవకాశం ఎంతైనా ఉన్నది. అసలు కేజ్రీవాల్ నాయకత్వానికే సవాళ్లు ఎదురవ్వవచ్చు.


సందేహం లేదు, ఆప్ అధినేతకు పరిస్థితులు అన్నీ ప్రతికూలంగా ఉన్నాయి. అయినప్పటికీ 54 ఏళ్ల కేజ్రీవాల్ రాజకీయ జీవితం సమాప్తమయిందని ఎవరైనా భావిస్తే అది తొందరపాటే అవుతుంది. పూర్తిగా పొరపడడమే కాగలదు. ఢిల్లీ ప్రజా తీర్పు, బ్రాండ్ కేజ్రీవాల్‌ను మధ్యతరగతి ప్రజలు తిరస్కరించిన వాస్తవాన్ని పూర్తిగా ప్రతిబింబించి ఉండవచ్చు గానీ, కిందిస్థాయి అల్పాదాయ వర్గాలవారు ఆయన పాలనను, రాజకీయ శైలిని సంపూర్ణంగా సమర్థించారని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఆప్ 'చీపురుకట్ట' ఒక నిర్దిష్ట వర్గ అస్తిత్వానికి ఒక రాజకీయ చిహ్నంగా భాసిల్లింది, ఇక ముందూ తప్పక భాసిల్లుతుంది. కాకపోతే ఓటమిలో సైతం ఆప్‌కు 44 శాతం ఓట్లు ఎలా వస్తాయి? ఢిల్లీ ఓటర్లలో కేజ్రీవాల్‌కు మద్దతు ఇంకా గణనీయంగా ఉన్నదనేది కొట్టివేయలేని వాస్తవం ఓటుహక్కును వినియోగించడంలో కాసుల లబ్ధికి తొలి, మలి, తుది ప్రాధాన్యమిస్తున్న బేరసారాల ధోరణి ఓటర్లలో అంతకంతకూ పెరిగిపోతోన్న ప్రస్తుత రాజకీయ వాతావరణంలో పేదలకు మౌలిక వసతులు సమకూర్చేందుకు కేజ్రీవాల్ చేసిన ప్రయత్నాలు అంత తేలిగ్గా విస్మరణకు గురవుతాయా? ఉచిత విద్యుత్, ఉచిత నీరు, మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం ఇత్యాదులను సామాన్య ప్రజలు తేలిగ్గా విస్మరించరు.

ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని ఇక నుంచీ కేజ్రీవాల్‌తో బీజేపీ చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉన్నది. ఆయన్ని అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకుంటే దానివల్ల నష్టపోయేది తామేనన్న విషయాన్ని బీజేపీ నాయకులు గుర్తించాలి. కక్ష సాధింపు చర్యలు కేజ్రీవాల్ మళ్లీ వీధుల్లోకి వచ్చే అవకాశాన్ని కల్పిస్తాయి. 2024లో ఢిల్లీ మద్యం కుంభకోణంలో మొదటిసారి అరెస్టయి జైలుకు వెళ్లిన సందర్భంలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయకుండా పదవిలో కొనసాగడం ద్వారా కేజ్రీవాల్ పెద్ద తప్పుచేశారు. అధికారాన్ని త్యజించి ప్రజా న్యాయస్థానంలో తీర్పుకు ప్రయత్నించి ఉంటే ఆయనకు చాలా సమస్యలు తప్పిపోయి ఉండేవి. సుప్రీంకోర్టు తీర్పు నొకదాన్ని తోసిపుచ్చేందుకు కేంద్రం ఒక ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చి, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి అధికారాలను తగ్గించేందుకు కేంద్రం ప్రయత్నించినప్పుడైనా కేజ్రీవాల్ ఎన్నికలకు వెళ్లి ఉండవలసింది. గత అక్టోబర్‌లో తన జూనియర్ సహచరురాలు ఆతిషికి అధికారాన్ని అప్పగించే నాటికి సమయం మించిపోయింది, ఆప్ పట్ల అభిమానం, కేజ్రీవాల్ పట్ల సానుభూతి ప్రజల్లో దాదాపుగా అంతరించిపోయాయి.

సామాన్య ప్రజలతో మళ్లీ ఆత్మీయానుబంధాన్ని నెలకొల్పుకుని, తన విశ్వసనీయతను పెంపొందించుకునేందుకు కేజ్రీవాల్ సంవత్సరాల క్రితం తాను ఎక్కడ ప్రారంభమయ్యారో తిరిగి అక్కడకే వెళ్లి తీరాలి. అసాధారణ పోరాటకారుడు కేజ్రీవాల్. ప్రజా సమస్యలను శాసన సభలోను, వెలుపల నిలకడగా నమ్మకంగా లేవనెత్తి వాటి పరిష్కారానికి పోరాడే సామర్థ్యమున్న నేతగా అరవింద్ కేజ్రీవాల్ అద్వితీయుడు. భారత రాజకీయాలలో ఇటువంటి సమర్థ నేతలకు ఇంకా స్థానమున్నది. వ్యూహాత్మక మేధ, ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్న కేజ్రీవాల్ అవసరం బాగా ఉన్నది. ఎన్నో ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. దేశ రాజకీయాలపై తనదైన ముద్ర వేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆప్ ఓటమి కేజ్రీవాల్‌కు అవసరమైన ఒక మేలుకొలుపు.

తాజా కలం: బీజేపీకి ఓటు వేసిన నా మిత్రురాలు ఆప్ పట్ల ఇంకా పూర్తిగా విముఖం కాలేదు. 'బీజేపీ తన హామీలు అన్నిటినీ నెరవేరిస్తే, మంచిదే. లేనిపక్షంలో ఐదు సంవత్సరాల తరువాత నేను మళ్లీ నా నిర్ణయాన్ని మార్చుకుంటాను' అని ఆమె అన్నారు. భారత దేశ రాజకీయాలలో ఏదీ స్థిరంగా ఉండదు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజల నిర్ణయాలు చాలా చంచలంగా ఉంటాయి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)





కృష్ణలంక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసు కంచె

అడ్డంగా దొరికారు

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో చిక్కిన వల్లభనేని వంశీ

దాడి సూత్రధారి వంశీనే.. కానీ, తెరవెనుక మంత్రాంగం



కృష్ణలంక పోలీస్ స్టేషన్ వద్ద వల్లభనేని వంశీమోహన్

కలుగులో ఉన్న ఎలుక ఎన్ని రోజులు తప్పించుకోగలదు? ఏదో ఒకరోజు బయటకు రాకమానదు. వచ్చాక చేతికి చిక్కకా మానదు. ప్రస్తుతం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఏం లేదు. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో కీలక సూత్రధారి వంశీనే అయినా తన చేతికి మట్టి అంటకుండా తెరవెనుక కథ నడిపించిన ఆయన మొత్తం 93 మంది నిందితుల్లో ఏ71గా నిలిచారు. ఎన్నికల ముందు నమోదైన కేసు.. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం రావడం, సీఐడీ చేతికి చేరడంతో ఏ71గా ఉన్న వంశీ ఎలా చిక్కుతారని అందరూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈలోపు కోర్టు నుంచి ఇంటీరియం ఆర్డర్ తెచ్చుకున్న వంశీని ఏం చేయలేరని భావించారు. కానీ, తన కేసును తానే తవ్వుకున్నట్టు.. ఈ కేసులో ఫిర్యాది సత్యవర్ధన్‌ను ప్రలోభాలకు గురిచేయడం, కుటుంబ సభ్యులను బెదిరింపులకు పాల్పడటంతో వల్లభనేని వంశీమోహన్ అరెస్టు కథకు అడుగులు పడేలా చేసింది. కలుగులో ఉన్న ఎలుక కావాలనే బయటకు వచ్చి సీఐడీకి చిక్కింది.

- 93 మంది నిందితుల్లో ఏ71 నిందితుడిగా నమోదు
- ఎలాగైనా తప్పించుకోవాలని కుటిల ప్రయత్నాలు
- ఫిర్యాది సత్యవర్ధన్‌ను ప్రలోభాలకు గురిచేశారని ఆరోపణలు
- రూ.అరకోటి వరకు ఆశ చూపడంతో సీఐడీకి చిక్కిన ఆయుధం
- తప్పించుకోబోయి ఇరుక్కుపోయిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే



వైద్య పరీక్షల నిమిత్తం వంశీని ప్రభుత్వాసుపత్రి లోపలికి తీసుకెళ్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి.. వైసీపీ హయాంలో జరిగిన ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో కీలక సూత్రధారి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్. పథక రచన చేసింది ఆయనేనని వైసీపీ వర్గాలే బాహాటంగా చెబుతాయి. తన కార్యాలయం నుంచే మొత్తం దాడి ఎపిసోడ్‌ను నడిపించారన్నది అభియోగం. దీంతో ఆయన ఏ71 నిందితుడిగా ఉన్నాడు. దాడికి ప్రధాన సూత్రధారే అయినా.. చేతికి మట్టి అంటకుండా చేయటం వల్ల వంశీ ఏ71గా చేర్చారు. ఇన్నాళ్లూ స్తబ్దుగా ఉన్న ఈ కేసు టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ తెరపైకి వచ్చింది. నిందితులను గుర్తించటం, ఆధారాలు సేకరించటం వంటి వాటికి చాలా సమయమే పట్టింది. నవంబరులో కేసును సీఐడీకి బదిలీ చేశాక వేగం పుంజుకుంది. ఈ కేసులో ముందస్తుగా వంశీ హైకోర్టు నుంచి ఇంటీరియం ఆర్డర్ కూడా తెచ్చుకున్నారు. మొత్తం 93 మంది నిందితుల్లో 49 మందినే అరెస్టు చేశారు. మరో 31 మంది మాత్రం అరెస్టు కాకుండా తప్పించుకున్నారు. ఇంకా 13 మంది అజ్ఞాతంలో ఉన్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి..

ఈ కేసులో దొరక్కుండా, చిక్కకుండా తెలివిగా వ్యవహరిస్తున్న వంశీ తనంతట తాను ఈ కేసును తిరగతోడుకున్నారు. టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో ప్రత్యక్ష సాక్షి, బాధితుడైన కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ పేరుతో కేసు పెట్టించారు. ఈ కేసును అప్పట్లో టీడీపీ నేత బచ్చుల అర్జునుడు కుమారుడు బోస్ స్వయంగా సత్యవర్ధన్ ద్వారా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. సీఐడీకి బదలాయించాక కేసులో పురోగతి నెలకొనటంతో పరిణామాలు వేగంగా మారాయి. దీంతో ఇప్పటి వరకు చిక్కకుండా ఉన్న వంశీ ఒక్కసారిగా తనకు తానే ఇరుక్కున్నారు. ఈ కేసు పెట్టిన సత్యవర్ధన్‌ను తమ దారిలోకి తెచ్చుకునే ప్రయత్నాలు చేశారని తెలుస్తోంది. రామవరప్పాడులోని సత్యవర్ధన్ కుటుంబాన్ని ముందుగా వైసీపీ రౌడీమూకలు బెదిరించినట్టుగా సమాచారం. ఈ బెదిరింపులతోనే సత్యవర్ధన్ తల్లి పలుమార్లు టీడీపీ నాయకుల దగ్గరకు వెళ్లి భయాందోళన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి ఏమైనా అవుతుందేమోనని, తమ బిడ్డ పరిస్థితి ఏమిటని ఆమె వాపోయారు. ఓ పథకం ప్రకారం బెదిరింపులు సాగించాక ప్రలోభాలకు తెరతీసినట్టు సమాచారం. రూ.అరకోటి మేర ప్రలోభాల ఎర వేసినట్టుగా తెలుస్తోంది. ఈ కేసు తమకు ప్రతికూలంగా వస్తే రూ.2 కోట్ల మేర ఖర్చు మిగతా 6లో..

హైడ్రామా

హైదరాబాద్ నుంచి నగరానికి వంశీ

- భవానీపురం పీఎస్ వద్ద మొదటి స్టాప్
- అక్కడి నుంచి కృష్ణలంక పీఎస్‌కు తరలింపు
- పోలీసుల కాన్వాయ్ వెనుకే వచ్చిన వంశీ సతీమణి
- అడ్డుకుని విచారించి పంపేసిన పోలీసులు
- కృష్ణాజిల్లాలో 144 సెక్షన్, నగరంలో 30 సెక్షన్ అమలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అరెస్టుతో ఎన్టీఆర్, కృష్ణాజిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. వంశీ అరెస్టుకు వ్యతిరేకంగా వైసీపీ అరాచక శక్తులు రహదారులపైకి వచ్చే అవకాశం ఉందని గ్రహించి అన్ని ప్రాంతాల్లోనూ భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. గురువారం ఉదయం హైదరాబాద్‌లో వంశీని అరెస్టు చేసిన పోలీసులు రోడ్డు మార్గాన విజయవాడ తీసుకొచ్చారు. జగ్గయ్యపేట నుంచి విజయవాడ వరకు ఎలాంటి అల్లర్లు జరక్కుండా ఏర్పాట్లు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా వంశీని మిగతా 6లో..

నగరంలో హై అలర్ట్

నిషేధాజ్ఞలు విధించిన సీపీ

- పోలీసు నిఘాలో గన్నవరం నియోజకవర్గం
- కృష్ణలంక పీఎస్ వద్ద వంశీ అనుచరుల హంగామా
- ఆసుపత్రి, కోర్టు వద్ద కూడా అదే పరిస్థితి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వంశీ అరెస్టు నేపథ్యంలో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు నగరంలో నిషేధాజ్ఞలు విధించారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు నగరంలో ఎలాంటి నిరసనలు, ఆందోళనలు నిర్వహించవద్దని ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు గురువారం నుంచే అమలు చేశారు. మరోపక్క గన్నవరం జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు కూడా నిషేధాజ్ఞల ఉత్తర్వులిచ్చారు. కృష్ణలంక పోలీసు స్టేషన్ నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు బందోబస్తును ఏర్పాటు చేశారు. వంశీ ఉన్న వాహనాలపై డ్రోన్లతో నిఘా ఉంచారు. ప్రభుత్వాసుపత్రి నుంచి రాత్రి 10 గంటల సమయంలో కోర్టుకు తీసుకెళ్లారు. ప్రభుత్వాసుపత్రి, కోర్టుల భవనం, జిల్లాజైలు వద్ద పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. కోర్టు, జిల్లాజైలు చుట్టుపక్కల మార్గాలను మూసేశారు. గన్నవరంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. నగరంలోని యార్లగడ్డ ఐకాన్‌కు పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు చేరుకున్నారు. స్వీట్లు తినిపించుకున్నారు.

మాజీ మంత్రి పేర్ని నాని హౌస్ అరెస్టు
ఇంటికి వెళ్లి నానీతో చర్చించిన ఏఎస్పీ, డీఎస్పీ 8లో

వంశీ అరెస్టులో తప్పులేదు
మంత్రి కొల్లు రవీంద్ర 8లో

రాజకీయాల్లో ఆత్మహత్యలే..!
ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

వేట మొదలు

వైసీపీ మాజీల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- తర్వాత లిస్టులో జోగి, కొడాలి, పేర్ని
- బియ్యం దొంగతనం కేసులో పేర్ని నాని
- 'అగ్రిగోల్డ్' కేసులో ఇరుక్కున్న జోగి కుటుంబం
- చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో కూడా..
- గుడివాడ టీడీపీ ఆఫీసుపై దాడిలో కొడాలి నానిపై త్వరలో కేసు

అధికారంలో ఉండగా చెలరేగిపోయిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరిగా ఉచ్చు బిగుస్తోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసినవారు, ఎమ్మెల్యేల అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. సభ్యసమాజం తలదించుకునేలా బూతులతో పేట్రేగిపోయారు. అరాచకాలు, అక్రమాలకు ఊతమిస్తూ తమ అనుయాయులతో ప్రజలను జలగల్లా పీడించారు. ప్రజలకు అండగా నిలుస్తున్నారన్న ఉద్దేశంతో టీడీపీ నాయకులు, ఆఫీసులపై దాడులకు తెగబడ్డారు. భయానక వాతావరణాన్ని సృష్టించారు. అధికారం ఉంది కదా.. అని కన్నూమిన్ను కానకుండా అరాచకాలకు పాల్పడిన వారిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఫలితంగా ఒక్కొక్కరి పాపాలు పండుతున్నాయి.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ ఆఫీసులపైనా, చంద్రబాబు ఇంటిపైనా దాడులకు పాల్పడిన వారంతా ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన వైసీపీ నేతలే. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌తో పాటు మాజీ మంత్రులైన జోగి రమేశ్, పేర్ని నాని, కొడాలి నాని, వెలంపల్లి శ్రీనివాసరావుతో పాటు దేవినేని అవినాశ్ సాగించిన అడ్డగోలు వ్యవహారాలు అన్నీ ఇన్నీ కావు. నాడు అధికారగర్వంతో విర్రవీగిన వారి భరతం పట్టేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అసలైన చేప గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తాజాగా వలకు చిక్కారు. టీడీపీ ఆఫీసుపై దాడికి సంబంధించి కీలక సూత్రధారి, పథక రచనకు శ్రీకారంచుట్టిన వంశీమోహన్ కేసు నుంచి తప్పించుకునేందుకు ఫిర్యాదుదారుడినే ప్రలోభపెట్టాడన్న ఫిర్యాదులపై అరెస్టయ్యారు. గతంలో చంద్రబాబు కుటుంబంపై వంశీ ఎన్నో వ్యక్తిగత దూషణలు చేశారు. సభ్యసమాజం వినలేని మాటలతో పాటు కుటుంబాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారు.

జోగి రమేశ్ చుట్టూ ఉచ్చు

చంద్రబాబు ఇంటిపై దాడికి ప్రయత్నించిన మాజీమంత్రి జోగి రమేశ్ ఇప్పటికే విచారణను ఎదుర్కొంటున్నారు. నేడో రేపో ఆయన అరెస్టు కాక తప్పదు. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అగ్రిగోల్డ్ భూములను బలవంతంగా కొనుగోలు చేశారని కూడా ఈయనపై అభియోగాలు ఉన్నాయి. ఈ కేసులో జోగి రమేశ్ తనయుడు ఇప్పటికే అరెస్ట్ అయ్యాడు. జోగి రమేశ్ తెలివిగా తప్పించుకున్నా.. అధికారాన్ని మాత్రం అడ్డగోలుగా దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడులకు పాల్పడిన తరుణంలోనే చంద్రబాబు ఇంటిపై కూడా దాడి చేయటానికి జోగి రమేశ్ సారథ్యం వహించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో కూడా జోగి తప్పించుకునే పరిస్థితి లేదు. విచారణ పూర్తయితే ఆయన్ను అరెస్టు చేసే అవకాశముంది.

పేదల బియ్యం మాయం కేసులో పేర్ని నాని

తెలుగుదేశం పార్టీపై కన్నూమిన్ను కానకుండా విరుచుకుపడిన మరో మాజీమంత్రి పేర్ని నాని కూడా పేదల బియ్యం అమ్ముకున్న కేసులో చిక్కుకున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సివిల్ సప్లయిస్ బఫర్ గోడౌన్‌కు తన భార్య పేరుతో ఉన్న గోడౌన్‌ను లీజుకిచ్చారు. అధికారం ఉంది కదా.. అని అక్రమాలకు పాల్పడ్డారు. పేదల బియ్యాన్ని అమ్మేసుకున్నారు. దొంగతనం బయట పడ్డాక సొమ్ములు చెల్లిస్తామని లేఖ రాశారు. దీనిపై కేసు నడుస్తోంది. ఈ కేసులో పేర్ని నాని, ఆయన సతీమణి.. ఇద్దరూ నిందితులుగా ఉన్నారు. ముందస్తుగా బెయిల్ తెచ్చుకోవటంతో అరెస్టు కాలేదు.

నేడోరేపో కొడాలి నాని కూడా..

గుడివాడకు చెందిన మరో మాజీమంత్రి కొడాలి నాని అధికారం మత్తులో చంద్రబాబును, ఆయన కుటుంబాన్ని తిట్టని తిట్టులేదు. ఆయన బూతులకు సభ్యసమాజం తలవంచుకోవాల్సి వచ్చింది. అధికార బలంతో, బూతులతో పేట్రేగిపోయిన కొడాలి నాని మిగతా 6లో..

రీసెర్చ్ విభాగంలో గందరగోళం

కృష్ణా యూనివర్సిటీలో 57 ఫైళ్లు మాయం

- నెల రోజులకుపైగా రీసెర్చ్ విభాగం మూత
- విద్యార్థులకు సమాధానం చెప్పేవారే కరువు
- తర్వాత రమ్మని పంపేస్తున్న అధ్యాపకులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీ అధికారుల తీరు నానాటికీ వివాదాస్పదంగా మారుతోంది. వర్సిటీలో వివిధ అంశాలపై పరిశోధనలు చేసుకున్న విద్యార్థులు యూనివర్సిటీకి వస్తే, వారికి సరైన సమాధానం చెప్పేవారే కరువయ్యారు. ఇప్పటికే రీసెర్చ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గైడ్‌లను కేటాయించకుండా విస్మరించకుండిపోయారు. ఉద్యోగాలు చేస్తూ వివిధ ప్రాంతాల నుంచి రీసెర్చ్‌లో తమ పేరును నమోదు చేయించుకునేందుకు, గైడ్‌ల నియామకానికి సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు యూనివర్సిటీకి వస్తే రీసెర్చ్ విభాగం కార్యాలయానికి తాళంవేసి కనిపిస్తోంది. అధ్యాపకులను వివరాలు అడిగితే, తమకేమీ తెలియదని, తరువాత రావాలని చెప్పి పంపేస్తున్నారు.

జనవరి 10న ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ రాజీనామా

కృష్ణా యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) విభాగం డైరెక్టర్‌గా ఐదు నెలలుగా పనిచేస్తున్న డాక్టర్ జయశంకరప్రసాద్ తన పదవికి జనవరి 10న రాజీనామా చేశారు. ఆ పదవిని జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ విభాగాల్లో పనిచేసే అధ్యాపకుల్లో ఒకరికి ఇస్తారనే ప్రచారం జరిగింది. కాగా, గతంలో ఆరేళ్లు ఆర్‌అండ్‌డీ డైరెక్టర్‌గా పనిచేసిన కిరణ్‌కుమార్ అనే అధ్యాపకుడికి ఈనెలాఖరు వరకు బాధ్యతలు అప్పగించారు. కానీ, ఆయన చార్జ్ తీసుకోలేదు.

57 ఫైళ్లు మాయం

కృష్ణా యూనివర్సిటీలోని ఆర్‌అండ్‌డీ విభాగం నుంచి 2021-22 విద్యా సంవత్సరంలో కెమిస్ట్రీ, ఫార్మసీ విభాగాలకు సంబంధించిన 57 ఫైళ్లు మాయమయ్యాయి. ఐదు నెలల క్రితం ఆర్‌అండ్‌డీ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న జయశంకరప్రసాద్ ఈ విషయంపై యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. వీటిపై సరైన మిగతా 6లో..



కృష్ణా యూనివర్సిటీ

ఇబ్బందులివీ..

యూనివర్సిటీలోని ఆర్‌అండ్‌డీ విభాగంలో పనితీరును పరిశీలించేందుకు ప్రతి జనవరి, జూన్‌లో రీసెర్చ్ రివ్యూ మీటింగ్ (ఆర్ఆర్ఎం) నిర్వహించాలి. రీసెర్చ్ స్కాలర్లు సరైన విధంగానే పరిశోధనలు చేస్తున్నారా లేదా అనే అంశాన్ని ఈ సమావేశంలో పరిశీలించాలి. సరైన మార్గంలో పరిశోధనలు చేసేలా మార్గదర్శకాలు ఇవ్వాలి. జనవరి 19న ఆర్ఆర్ఎం నిర్వహించాల్సి ఉన్నా ఇంతవరకు నిర్వహించనేలేదు. ఈ ఏడాది 50మందికిపైగా నూతనంగా రీసెర్చ్ చేసేందుకు వివిధ విభాగాల్లో చేరారు. ఎంచుకున్న విభాగాలను ఆధారంగా చేసుకుని గైడ్‌లను కూడా ఇంతవరకు నియమించలేదు. యూనివర్సిటీ ఆర్‌అండ్‌డీ విభాగానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పాతవాటినే ఉంచారు. వివిధ ప్రాంతాల నుంచి రీసెర్చ్ స్కాలర్లు యూనివర్సిటీకి వస్తున్నారు. తమకు గైడ్‌లను కేటాయించాలని వారు కోరుతుండగా, తమకేమీ తెలియదని, కొంతకాలం వేచి ఉండాలని చెప్పి వెనక్కు పంపేస్తున్నారు ఆర్‌అండ్‌డీ విభాగం కార్యాలయం తలుపులు కూడా తీయకపోవడంతో ఈ విభాగంలో సమాధానం చెప్పేవారే కరువయ్యారు. ఇప్పటికే రీసెర్చ్ పూర్తిచేసిన వారు తమ పరిశోధనలను సమర్పిస్తే, వారికి వైవా నిర్వహించి, పీహెచ్‌డీలను ప్రదానం చేసేందుకు అనుమతులు ఇవ్వాలి. ఈ ప్రక్రియ దాదాపు నిలిచిపోయింది. ఇప్పటికైనా యూనివర్సిటీ వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్ ఆర్‌అండ్‌డీ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని రీసెర్చ్ స్కాలర్లు కోరుతున్నారు.

నేడు ప్రేమికుల దినోత్సవం



ప్యార్‌ట్స్

రెండక్షరాలతో మొదలై.. రెండు మనసులను పెనవేసుకుని.. జంట జీవితాలను ముడిపెట్టే మహత్తర మంత్రం ప్రేమ. ఆరాధనా భావమో, ఆకర్షణా స్వభావమో ప్రేమ అనే మాటవింటే ఎవరికైనా ఉత్సాహం ఉరకలేస్తుంది. మనసు ఆనందలోకంలో తేలియాడుతుంది. ఆ అనుభూతి మనుషులకైనా, పక్షులకైనా ఒకేరకంగా ఉంటుంది. ఈ జంట చిలుకలు కూడా అంతే. ప్రేమలోని మధురానుభూతులను తనివితీరా ఆస్వాదిస్తున్న ఈ 'ప్యార్'ట్స్ యనమలకుదురు కరకట్టలోని ఓ చెట్టుపై కనిపించాయి.



వంద పడకలకు నందిగామ వైద్యశాల
ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

రసాయన వ్యర్థాలతో పర్యావరణ ముప్పు
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పనబాక కృష్ణయ్య
- జక్కంపూడిలో 60-40 వెంచర్ పరిశీలన

6లో

పంటకు కష్టం.. రైతుకు నష్టం
- కొనుగోలు లేక వచ్చినకాడికి తెగనమ్ముకుంటున్న పత్తి రైతులు
- మోపిదేవిలో పంటను దున్నేస్తున్న క్యాబేజీ రైతులు



8లో



కేంద్రమంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ బాలశౌరి

రహదారుల విస్తరణకు సహకరించండి

» కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రహదారుల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని గురువారం కలిసి పలు అభివృద్ధి పనులకు అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. మచిలీపట్నం పోర్టు నుంచి జాతీయరహదారి-65ను కలుపుతూ 18.5కిలోమీటర్ల నాలుగులేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు ఇవ్వాలని ఎంపీ కోరారు. మంగినపూడిబీచ్ నుంచి పోర్టు వరకు 12కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. పెడన నుంచి గుడివాడ వయా హనుమాన్‌జంక్షన్, నూజివీడు వరకు జాతీయ రహదారి 216ని గుడివాడ పురపాలకసంఘం పరిధిలో 3.2కిలోమీటర్ల రహదారిని అభివృద్ధికి వినతిపత్రాలను అందజేశారు. గోదావరి బేసిన్‌లో సహజవాయువును వెలికి తీస్తున్నారని, ఈ రహదారులను అభివృద్ధి చేస్తే సహజావాయువుల రవాణాకు ఎంతగానో ఉపయోగం ఉంటుందని ఎంపీ వివరించారు. రహదారుల అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్టు ఎంపీ తెలిపారు.

వంద పడకలకు నందిగామ వైద్యశాల



నందిగామ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నందిగామ ఏరియా వైద్యశాల సేవలు విస్తరించనున్నాయి. వంద పడకల వైద్యశాలకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య కృషి ఫలితంగా ఎప్పటి నుండో ఎదురు చూస్తున్న కలనెరవేరింది. నియోజకవర్గ కేంద్రమైన నందిగామ వైద్యశాలను దివంగత మంత్రి దేవినేని వెంకటరమణ హయాంలో అభివృద్ధి చేశారు. నాటి నుంచి రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. యాభై పడకలు ఉన్న వైద్యశాలను వంద పడకలు చేయాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ అమలు సాధ్యం కాలేదు. ఈక్రమంలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పలు మార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, వైద్యఆరోగ్య శాఖా మంత్రికి వంద పడకల అవసరాన్ని వివరించారు. దీంతో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిప్లస్-4 భవన నిర్మాణం కోసం రూ.34.48 కోట్లు కేటాయించింది. 60 వేల చదరపు అడుగుల భవనం నిర్మించనున్నారు. వైద్యశాలలో ఆధునిక వసతులతో పాటు అదనంగా 52 మంది సిబ్బందిని నియమించనున్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం రోగులకు అందనుంది.

మిక్ విద్యార్థికి రూ. 20 లక్షల ప్యాకేజీ



కంచికచర్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : విక్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థికి రూ.20 లక్షల వార్షిక ప్యాకేజీ లభించింది. కాకినాడ పట్టణానికి చెందిన యడ్లపల్లి సతీష్ చంద్రచౌదరి మిక్‌లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐడీఎస్) నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అద్భుత ప్రతిభను ప్రదర్శించి, సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకోవటం ద్వారా అగ్రశ్రేణి కంపెనీ వెస్టీజ్ లాబ్స్‌లో ఉద్యోగాన్ని పొందాడు. వెస్టీజ్ లాబ్స్ బ్లాక్‌చైన్ రంగంలో ప్రపంచంలో పేరొందిన సంస్థ అని ఏఐడీఎస్ విభాగాధిపతి డాక్టర్ జిసాయి చైతన్యకుమార్ తెలిపారు. సతీష్ చంద్ర రూ.20 లక్షల వార్షిక ప్యాకేజ్‌తో ప్లేస్‌మెంట్ పొందటం పట్ల సీఈవో డి.పాండురంగారావు, కళాశాల యాజమాన్యం హర్షం వెలిబుచ్చారు.

నేటి నుంచి బీఎన్ఎస్ఎస్ నిషేధాజ్ఞలు

గుణదల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలు, టెన్త్, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలో ప్రజా జీవనానికి ఇబ్బందులు లేకుండా నగరంలో బీఎన్ఎస్ఎస్ నిషేధాజ్ఞలు ఈనెల 13 నుంచి ఏప్రిల్ 3 వరకు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టూటౌన్, ఎస్.ఎన్.పురం, ఎ.ఎస్.నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బెజవాడ పోలీసులకు ఏమైంది?

» కోర్టు హాల్లోకి వంశీ సతీమణి, మద్దతుదారులకు అనుమతి

విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వల్లభనేని వంశీ మోహన్‌ను కోర్టులో హాజరు పరిచే క్రమంలో బెజవాడ పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శల పాలైంది. వంశీకి అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలను మూటకట్టుకున్నారు. కోర్టు హాల్లోకి వంశీ మద్దతుదారులను అనుమతించారు. కోర్టు హాల్లోకి వంశీ సతీమణి పంకజశ్రీని కూడా అనుమతించారు. కోర్టు హాల్లోనే భార్యతో వంశీమోహన్ నవ్వుతూ ముచ్చటించారు. అంతకు ముందు వంశీని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచే సమయంలో దొడ్డిదారిన తీసుకు వచ్చారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సభ్య కార్యదర్శిగా శరత్‌కుమార్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీసీవోఎస్టీ) సభ్య కార్యదర్శిగా కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.శరత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగవచ్చని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ శరత్‌కుమార్ గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీలో ఆర్ అండ్ డీ, పీఆర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

కొత్త యూస్ కేసెస్‌తో ముందుకు రండి

» ఎస్ఆర్ఎం వర్సిటీ విద్యార్థుల ఆవిష్కరణపై డ్రోన్ కార్పొరేషన్ ఎండి దినేశ్‌కుమార్

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్త యూస్ కేసెస్‌తో ముందుకొస్తే డ్రోన్ కార్పొరేషన్ సహకారమందిస్తుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దినేశ్‌కుమార్ హామీ ఇచ్చారు. గురువారంనాడు ఎస్ఆర్ఎం వర్సిటీ విద్యార్థులు ఆవిష్కరించిన కొత్త యూస్ కేసెస్ ఆవిష్కరణల ప్రదర్శనను దినేశ్‌కుమార్ చూశారు. విద్యార్థులు రూపొందించిన మారిటైమ్, వైల్డ్ లైఫ్ డ్రోన్లు ఈ సందర్భంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వినూత్నంగా ఆవిష్కరిస్తున్న డ్రోన్లను ప్రోత్సహిస్తామని దినేశ్‌కుమార్ పేర్కొన్నారు.

వేట మొదలు

(5వ పేజీ తరువాయి)

గుడివాడ టీడీపీ ఆఫీసుపై దాడి ఘటనలో సూత్రధారుడిగా ఉన్నారు. టీడీపీ కార్యాలయంపై తన అనుయాయులను ఉసిగొల్పారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపైనా కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించనుంది. ఇదే జరిగితే కొడాలి నాని అరెస్టు కాక తప్పదు. అలాగే, టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి ఘటనలో దేవినేని అవినాశ్‌కు, టీడీపీ నేతలను ఇష్టానుసారంగా బూతులు తిట్టిన వెలంపల్లి శ్రీనివాసరావు కూడా తర్వాత లిస్టులో ఉన్నారు.

చరిత్రలోకి వెళితే..

క్లైదియా చక్రవర్తి రోమ్‌ను పరిపాలిస్తున్న రోజులవి. సామ్రాజ్య విస్తరణలో భాగంగా యువకులెవరూ ప్రేమించకూడదని, పెళ్లి చేసుకోరాదని రాజు శాసనం చేశాడు. ఆయన వద్ద పనిచేసే వాలంటైన్ క్రైస్తవ ప్రవక్త.. 'ప్రేమ' ఎంతో గొప్పదని సమాజంలో పెచ్చురిల్లిపోతున్న చెడును 'ప్రేమ' అనే ఆయుధంతో జయించవచ్చని.. అందరూ ప్రేమ కలిగి జీవించాలని బోధిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో యువతీయువకులను ప్రోత్సహిస్తూ ప్రేమ జంటలకు రాజుకు తెలియకుండా పెళ్లిళ్లు కూడా చేయించేవాడు. రాజుకు ఈ విషయం తెలిసి అతడికి ఉరి శిక్ష విధించి జైల్లో పెట్టించాడు. అక్కడ జైలు అధికారి కుమార్తె ఆస్ట్రియస్ అంధురాలు. ఆమె వాలంటైన్‌తో పరిచయం పెంచుకుని మాట్లాడుతూ ఉండేది. తర్వాత వాలెంటైన్ ప్రార్థనల ద్వారా ఆమెకు కళ్లు తెప్పించాడు. ఉరి శిక్షను అమలు చేసే ముందురోజు వాలెంటైన్ ఆస్ట్రియస్‌కు 'లవ్ ఫ్రమ్ యువర్ వాలెంటైన్' అని ఒక ఉత్తరం రాసి సంతకం చేసి ఇస్తాడు. ఆ మరుసటి రోజే వాలెంటైన్‌ను ఉరి తీస్తారు. ప్లాన్నియాలో వాలెంటైన్‌ను సమాధి చేశారు. ఆ తర్వాత 1537లో ఇంగ్లండ్ రాజు కింగ్ హెన్రీ సెవెన్ ఫిబ్రవరి 14ను 'వాలంటైన్స్ డే'గా అధికారికంగా ప్రకటించారు. నాటి నుంచి ఫిబ్రవరి 14ను ప్రేమికులు 'వాలంటైన్స్ డే'గా జరుపుకుంటున్నారు. రోమన్ దేవత వీనస్‌కు ఎర్రని గులాబీలు అంటే చాలా ఇష్టం. అందుకే ప్రేమికులు ఎర్రని గులాబీలను ప్రేమకు చిహ్నంగా ప్రియురాలికి ఇచ్చి వారి ప్రేమను వ్యక్తపరుస్తూ ఉంటారు.

నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ..

ప్రేమతో.. గెలిచారు!



ప్రేమ.. రెండు అక్షరాలతో మొదలయ్యే అనుబంధం.. రెండు హృదయాలను కలిపేది.. అది వివాహ బంధంతో ముడిపడి వైవాహిక జీవితంలో ఆనందాలను పంచుకుంటూ ఒకరి కోసం ఒకరు అనేలా.. జీవించిడమే నిజమైన ప్రేమకు నిదర్శనం. కుల, మతాలు వేరైనా.. కుటుంబపెద్దలు కాదన్నా.. తమ ప్రేమ గొప్పదని నిరూపించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు వీరు.. ప్రేమికుల రోజు 'వాలంటైన్స్ డే' సందర్భంగా అలాంటి కొన్ని జంటల మధురానుభూతులు వారి మాటల్లోనే..



ప్రభు సన్నిధిలో తొలి పరిచయం..

\- విస్సన్నపేట ఏవో జి.రాజలక్ష్మి, ఏలియా జాక్సన్ దంపతులు

ఆయన ఫేమస్ గిటార్ ప్లేయర్. నేను అగ్రికల్చర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నా.. ఓ సభలో ప్రభు సన్నిధిలో పరిచయమైంది. అది మా మధ్య ప్రేమగా చిగురించి పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాం. మాకు మూడేళ్ల పాప. చాలా సంతోషంగా ఉన్నాం.

పదేళ్ల నాటి ప్రేమ కథ మాది..

\- బంకా బాబూరావు, శివ నాగమణి



2014లో నంద్యాల బ్యాంక్ పరీక్షకు కోసం కోచింగ్ సెంటర్లో ఇద్దరం కలిసి చదివాం. తర్వాత పంచాయతీ కార్యదర్శిగా దుందిరాలపాడులో నాకు ఉద్యోగం లభించింది. అదే గ్రామానికి చెందిన బాబూరావుతో పరిచయం పెరిగి ప్రేమగా మారింది. అప్పట్లోనే పెద్దలను ఎదిరించి 2016లో వివాహం చేసుకున్నాం. వైవాహిక జీవితం హ్యాపీగా సాగుతోంది. ఇప్పుడు ఆయన దుందిరాలపాడు గ్రామ సర్పంచ్.

పెద్దలను ఒప్పించి ఒక్కటయ్యాం

\- సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా, సుజాత



కులాలు వేరైనా మూడేళ్ల ప్రేమతో ఒక్కటై కుటుంబ పెద్దలను ఒప్పించిన మూడుముళ్ల బంధం మాది. మా ప్రేమ కథ అంతా తిరుపతిలోనే సాగింది. వ్యాపారం నిమిత్తం మా కుటుంబం 1990లో తిరుపతికి వెళ్లింది. అక్కడ సుజాత కుటుంబసభ్యులతో పరిచయం ఏర్పడింది. ఎస్వీ యూనివర్సిటీలో ఎంఎస్సీ జువాలజీ చదువుతున్న సుజాతతో పరిచయం పెరిగి మూడేళ్ల పాటు ప్రేమించుకున్నాం. తర్వాత మా ప్రేమను పెద్దలకు చెప్పి ఒప్పించాం. 1993 మే 1న తిరుపతిలోనే కులాంతర వివాహం చేసుకున్నాం. ఇప్పుడు మాకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బొండా సిద్ధార్థ కూడా ప్రేమించిన యువతితో కులాంతర వివాహం చేసుకోవడం విశేషం.

మతాలు వేరైనా.. ప్రేమతో ఒక్కటిగా

\- చిలక నాగేశ్వరరావు, షేక్ తారాబీ



మతాలు వేరైనా.. మనసులు కలిశాయి. ఇరువైపులా పెద్దలను ఒప్పించారు. మనువు చేసుకున్నారు. జీవితంలో ఒడిదుడుకులు ఎదురైనా అధిగమించారు. జీవన సాఫల్యాన్ని పొందారు. పెదవి విరిచిన వారి చేతనే భళా అనిపించుకున్నారు.

ఆర్టీసీలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌గా చిలకా నాగేశ్వరరావు, మంగొల్లు ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తారాబీల ప్రేమ కథ అక్కడే ప్రారంభమైంది. నందిగామ కేవీఆర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో ఒకరికొకరు ఇష్టపడ్డారు. ఇద్దరి మతాలు వేరు కావటంతో పెద్దలు వారి పెళ్లికి తొలుత ఇష్టపడలేదు. తర్వాత వారిని ఒప్పించి ఒక్కటయ్యారు. నాగేశ్వరరావు ఆర్టీసీలోను, తారాబీ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తున్నారు. పిల్లలను ఉన్నత విద్యావంతుల్ని చేశారు. కుమారుడు వినయ్‌తేజా యూఎస్‌లో ఎంఎస్ చేసి అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె అలేఖ్య తేజా (గీతాంజలి) కెనడాలో ఎంఎస్ చేసింది.

మా ప్రాంతాలు వేరైనా..

\- షేక్ నాగసైదా, గంటా ఆలివేలు

ఉద్యోగరీత్యా జగ్గయ్యపేట వచ్చాను. స్థానిక స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. స్వగ్రామం విజయనగరం జిల్లా పార్వతీపురం. పట్టణానికి చెందిన షేక్ నాగసైదాతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటామని పెద్దలకు చెప్పాం. తొలుత సుముఖత వ్యక్తం చేయకపోయినా.. కుటుంబసభ్యులు, బంధువులను కలిసి ఒప్పించాం. వారి అనురాగానికి గుర్తుగా షేక్ సుమయ కౌశర్ (7), తైమూర్ ఆలీ (5)లు కుమారులు పుట్టారు. పోలీసు ఉద్యోగం చేసుకుంటు, కుటుంబాన్ని చూసుకోవటంలో భర్త సహకారం ఎంతో ఉంది. (ఆంధ్రజ్యోతి-విజయవాడ)



రసాయన వ్యర్థాలతో పర్యావరణ ముప్పు

» పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పనబాక కృష్ణయ్య

» జక్కంపూడిలో 60-40 వెంచర్ పరిశీలన

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జక్కంపూడి గ్రామంలో రసాయన వ్యర్థాలను డంప్ చేసి గాలి, భూమిని కలుషితం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పనబాక కృష్ణయ్య హెచ్చరించారు. ఇటీవల గ్రామ పంచాయతీ పరిధిలోని 60-40 వెంచర్‌లో క్రాబ్స్ బయో కెమికల్ సంస్థకు చెందిన రసాయన వ్యర్థాలు డంపింగ్ చేసిన నేపథ్యంలో వాతావరణ కలుషితంపై స్పందించిన పనబాక కృష్ణయ్య గురువారం ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్‌తో కలిసి రసాయన వ్యర్థాలు డంపింగ్ జరిగిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంచర్ లేఅవుట్ కమిటీ చైర్మన్ అక్కడి పరిస్థితులను వివరించారు. 135 ఎకరాలకు గాను సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో రసాయన వ్యర్థాల డంపింగ్ జరిగిందని, భూములు కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంచర్‌లోకి వెళ్లే పరిస్థితి కూడా లేదని గ్రామంలో గాలి, నీరు కలుషితమై మూగజీవాలపై ప్రభావం చూపుతోందని వివరించారు. దీనిపై స్పందించిన చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ, ఇప్పటికే క్రాబ్స్ కంపెనీని మూయించడం జరిగిందని, రసాయనాల డంపింగ్ కాంట్రాక్ట్ తీసుకున్న జగ్గయ్యపేట కంపెనీపై కూడా చర్యలు ఉంటాయన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, సాంకేతిక నిపుణుల ద్వారా ఈ ప్రాంతంలో గాలి, నీరు,



రైతులు, వెంచర్ కమిటీతో మాట్లాడుతున్న పనబాక కృష్ణయ్య

భూమి ఎంత వరకు కలుషితమైందో సర్వే చేయిస్తామన్నారు. కంపెనీ నుంచి నష్టపరిహారాన్ని ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పర్యటనలో లేఅవుట్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ధనేకుల వెంకటసుబ్బారావు, ఏఎల్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ముంతాజ్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

» 15న కందుకూరులో సీఎంచే ప్రదానం

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఈవో దశరథరామిరెడ్డి నుంచి ఫోన్



మిద్దెపై తోటను తిలకిస్తున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం గాంధీనగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు ముంతాజ్‌బేగంకు ఈనెల 15న కందుకూరు మార్కెట్ యార్డులో సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర అవార్డు అందించనున్నారు. సాధారణంగా అవార్డుకు సంబంధిత వ్యక్తి ప్రభుత్వానికి ఆయా శాఖల ద్వారా దరఖాస్తు చేసుకుంటారు. అయితే ముంతాజ్ బేగం స్వచ్ఛాంధ్ర అవార్డుకు దరఖాస్తు చేయలేదు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఫిబ్రవరి 1న 'మిద్దె తోట-ఆరోగ్యానికి కోట' శీర్షికతో ప్రచురించిన కథనానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ స్పందించింది. రిటైర్డు టీచరు ముంతాజ్ బేగంకు కార్పొరేషన్ సీఈవో దశరథ రామిరెడ్డి స్వయంగా ఫోన్ చేశారు. కందుకూరులో మూడో శనివారం ఉదయం 11 గంటలకు మార్కెట్ యార్డులో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు, జ్ఞాపిక, శాలువా అందుకోవాలని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ బాపిరాజు గురువారం ఉదయం ముంతాజ్‌బేగం మిద్దెపై పెంచుతున్న తోటను పరిశీలించారు. అవార్డును అందుకోవాలని కార్పొరేషన్ తరఫున ఆమెను ఆహ్వానించారు. కాగా రాష్ట్రంలో కేవలం ఇద్దరికి మాత్రమే ఈ అవార్డు దక్కనుంది. ముంతాజ్‌బేగంతో పాటు పార్వతీపురంలో ఆశ్రమం నిర్వహిస్తున్న రిటైర్డు ఎంపీడీవో ఎనిగళ్ల పద్మజ ఉన్నారు.

బందరు చేరిన సైకిల్ యాత్రికుడు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నుంచి భారతదేశంలో 50 వేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేస్తూ మచిలీపట్నంకు గురువారం వచ్చిన సైకిల్ యాత్రికుడు పెంచల చైతన్యను గురువారం కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, కన్యకా పరమేశ్వరీ దేవస్థానం ఉపాధ్యక్షుడు సామా కాంతారావు తదితరులతో కలిసి చైతన్యను సత్కరించారు. చైతన్య మాట్లాడుతూ, నెల్లూరు నుంచి గుజరాత్ రాష్ట్రంలోని పాకిస్తాన్ సరిహద్దు వరకు 15 రోజుల పాటు 3830 కిలోమీటర్ల యాత్ర చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్యమంతో ఈ కార్యక్రమం చేపట్టానని, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఎం ఫార్మసీ చేసి ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నట్టు చైతన్య చెప్పాడు.



సైకిల్ యాత్రికుడు పెంచల చైతన్యను సత్కరిస్తున్న నేతలు

వాహనాల 12 ఏళ్ల ఫిట్‌నెస్ డ్రాఫ్ట్ రద్దు చేయండి

» కేంద్రానికి లారీ ఓనర్స్ అసోసియేషన్ లేఖ

లబ్బీపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్లు దాటిన వాహనాలపై పరిమితులు విధిస్తూ కేంద్రప్రభుత్వం ఈ నెల 7న విడుదల చేసిన జీఎస్ఆర్ 124(ఇ) డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాసినట్లు ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా మోటార్ ట్రాన్స్ పోర్ట్ కాంగ్రెస్ సౌత్ జోన్ ఉపాధ్యక్షులు వై.వి.ఈశ్వరరావు తెలిపారు. ఈ నోటిఫికేషన్ అమలులోకి వస్తే దేశవ్యాప్తంగా డ్రైవర్లు, వాహనయజమానులు ఒకరే అయినవారు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, పాత వాహనాలు నిషేధించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. కొత్త నిబంధనల వల్ల లక్షలాది వాహన యజమానులు ఆర్థికంగా నష్టపోతారని, డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో సంవత్సరాల వారీగా, విధించిన అధిక ఫిట్నెస్ ఫీజులు పూర్తిగా తొలగించాలని చిన్న, మీడియం, వాహనాలకు 500 రూపాయలు, హెవీ గూడ్స్ పాసింజర్ వాహనాలకు వెయ్యి రూపాయలు ఫీజును మాత్రమే నిర్ణయించాలని, ముఖ్యంగా లక్షలాది మంది ప్రజల జీవనోపాధితో ముడిపడిన నూతన ముసాయిదాలపై పునరాలోచన చేయాలని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.

రీసెర్చ్ విభాగంలో గందరగోళం

(5వ పేజీ తరువాయి)

సమాధానం చెప్పేవారే కరువయ్యారు. పరిశోధనలు పూర్తిచేసిన స్కాలర్లు.. శాసనసభ్యులు, మంత్రులతో చెప్పించుకుని పీహెచ్‌డీలు ఇప్పించాలని యూనివర్సిటీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఫైళ్లు కనిపించకుండా తామేమీ చేయలేమని అధికారులు సాచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే తమ పరిశోధనలు పూర్తిచేసిన 10 మందికిపైగా స్కాలర్స్ తమ థీసిస్‌లను సమర్పిస్తామంటున్నారు. అయితే, వీరికి సంబంధించిన ఫైళ్లు మాయం కావడంతో ఏం చేస్తారో చెప్పకుండా జాప్యం చేస్తూ వస్తున్నారు. తన ఫైళ్లు మాయం కావడంపై రంజిత్ అనే స్కాలర్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అతడికి గుట్టుచప్పుడు కాకుండా పీహెచ్‌డీ అందజేశారు. కృష్ణా యూనివర్సిటీ, ఆంధ్రా లయోల కళాశాల అధికారుల మధ్య పరిపాలనాపరమైన విభేదాలు వచ్చాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే రెండేళ్లుగా కళాశాలను నడుపుతున్నారని, త్వరగా అటానమస్ అనుమతులు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులు.. లయోలా కళాశాలకు ఇటీవల నోటీసులు జారీ చేశారు. కానీ, ఈ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో రీసెర్చ్ స్కాలర్స్ ఆరుగురు పరిశోధనలు చేసుకునేందుకు ఖాళీలు ఉన్నాయని యూనివర్సిటీ అధికారులే చూపిస్తున్నారు. దీంతో ఆరుగురు స్కాలర్స్ దరఖాస్తు చేసుకున్నారు. కృష్ణా యూనివర్సిటీ నుంచి అనుమతులు తీసుకోని లయోలా కళాశాలకు రీసెర్చ్ విభాగంలో మాత్రం అనుమతులు ఉన్నట్టుగా చూపడం ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి.

అడ్డంగా దొరికారు

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రూ.అరకోటి ఎరవేస్తే ఖర్చు తగ్గుతుందన్న కోణంలో సత్యవర్ధన్‌ను తెలివిగా ప్రలోభపరిచారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా సత్యవర్ధన్ కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంతో ఊహించని ట్విస్ట్ నెలకొంది. దీంతో కేసు నుంచి తప్పించుకున్నామని వంశీ అండ్ గ్యాంగ్ అనుకుంది. కానీ, అనవసరంగా జోక్యం చేసుకుని అదే కేసులో ఇరుక్కుపోయింది. వంశీ పీకల్లోతు కూరుకుపోయారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారని, భయపెట్టారన్న ఫిర్యాదులు కుటుంబ సభ్యుల నుంచి కూడా రావటంతో వంశీ పోలీసుల వలలో పడ్డారు. దీంతో కేసును మరింత జఠిలం చేసుకోవటంతో పాటు మరిన్ని నేరాభియోగాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. వంశీమోహన్‌పై గురిపెట్టిన పోలీసులకు మరింత సులువుగా మారింది.

మరో రెండు కేసులు సిద్ధం

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయిన వల్లభనేని వంశీమోహన్‌పై మరో రెండు కేసులు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. 2019 ఎన్నికలకు ముందు నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసు ఇదివరకే నమోదైంది. ఆ కేసును రీ ఓపెన్ చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరుతున్నారు. 2019లో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో వంశీ నియోజకవర్గంలో మూడు మండలాల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. స్థలం ఎక్కడో చూపకుండా అప్పట్లో పట్టాలు ఇచ్చారు. ఈ వ్యవహారం ఎన్నికలయ్యాక వెలుగుచూసింది. బాపులపాడు మండలంలో వెలుగుచూసిన నకిలీ ఇళ్ల పట్టాల ఉదంతం గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో కూడా ఉందని తేలింది. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఈ పట్టాలిచ్చారన్నది అభియోగం. ఈ నేపథ్యంలో అప్పట్లో బాపులపాడు తహసీల్దార్ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. ఈ కేసు ఉదంతం తర్వాతే వంశీమోహన్ జగన్ దగ్గరకు చేరారు. దీంతో కేసు మరుగున పడిపోయింది. గన్నవరం ఎమ్మెల్యే డిమాండ్‌తో ఈ కేసు రీ ఓపెన్ చేసే పరిస్థితి కనిపిస్తోంది. అలాగే, అనుమతులు లేకుండా రూ.210 కోట్ల మేర మట్టిని అక్రమంగా తరలించినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా నిర్ధారించినట్టు తెలుస్తోంది. దీనిపై కూడా కేసు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. వంశీ తప్పించుకోకుండా ఉండేందుకు కేసులన్నీ బనాయించే అవకాశం ఉందని తెలుస్తోంది.

అక్రమాలపై నిఘా

ఓపక్క వల్లభనేని వంశీమోహన్‌ను కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చిన క్రమంలోనే ప్రభుత్వాసుపత్రి సమీపంలో నిఘా వర్గాల అత్యున్నత అధికారులు భేటీ అయ్యారు. రెండు జిల్లాల్లో వంశీ అరాచకాలేంటి? వాటికి సంబంధించి ఫిర్యాదులు వచ్చాయా? వంటి వివరాలను సేకరించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వంశీ వ్యాపార కార్యకలాపాలు ఏంటి? వంశీ అనుచరులు, వారిపై ఉన్న వివాదాలు వంటి వాటిపై కూడా ఆరా తీస్తున్నారు.

హైడ్రామా

(5వ పేజీ తరువాయి)

తీసుకొచ్చే మార్గాన్ని పరిశీలించారు. వంశీ ఉన్న వాహనాలు ఏ సమయానికి ఏ ప్రాంతాన్ని దాటాయో నిఘా వర్గాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకున్నాయి. వంశీని ఏ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తారన్న దానిపై రకరకాల ప్రచారాలు సాగాయి. పటమట పోలీసులు కేసు నమోదు చేశారు కాబట్టి నేరుగా అక్కడికే తీసుకొస్తారని భావించారు. దీంతో పటమట పోలీస్‌స్టేషన్ వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వైసీపీ నేతలు తలశిల రఘురాం, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ చేరుకున్నారు. కొద్దిసేపు అక్కడి పరిస్థితిని పరిశీలించుకుని వెళ్లిపోయారు. నగరంలోకి వంశీని తీసుకొచ్చాక వాహనాలను భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆయన్ను అక్కడే ఉంచుతారని అంతా భావించారు. తర్వాత కొద్దిసేపటికి వాహనం మార్చి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ వైసీపీ నేతలు, వంశీ న్యాయవాదులు భారీగా చేరుకున్నారు. హైదరాబాద్ నుంచే వంశీ భార్య పంకజశ్రీ కారులో కాన్వాయ్ వెంట వచ్చారు. నందిగామ వద్ద పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. తర్వాత నేరుగా ఆమె కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వంశీతో మాట్లాడాక ఆమెను బయటకు పంపేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

15, 16 తేదీల్లో నగరంలో నాటిక పోటీలు

శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ కార్యదర్శి నిట్టల శ్యాంసుందర్

కృష్ణలంక, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : యూత్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫోరం, కళావిపంచి హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో విజయవాడ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో నాటిక పోటీలు జరుగుతాయని శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ కార్యదర్శి నిట్టల శ్యామ్ సుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 6 మంచి , సమాజ సాంస్కృతిక కళారంగానికి ఉపయోగపడే నాటికలను ఎంపిక చేసి నగర ప్రేక్షకుల ముందు పెట్టే ప్రయత్నం చేశామని తెలిపారు.

ఆటోనగర్ పూర్వవైభవానికి కృషి చేద్దాం

ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీ అసోసియేషన్ సభ్యులతో ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు స్థానిక వ్యాపారస్తులతో కలిసి కృషి చేద్దామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు గురువారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆటోనగర్‌లోని ఆటో మొబైల్ రంగంలో ఉపాధి పొందుతున్న లక్షలాది మంది వర్కర్లను ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యపరంగా అప్‌గ్రేడ్ చేయాలంటే ఎలాంటి వసతులు, సదుపాయాలు కావాలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. యువతకు ఉద్యోగావకాశాలు, ఆటో మొబైల్ రంగంలో వ్యాపార అవకాశాలు అభివృద్ధి చెందటానికి పారిశ్రామికవేత్తల నుంచి సూచనలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ



ఎంపీ కేశినేని శివనాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేసిన ఎంఎస్ఎంఈ అసోసియేషన్ నాయకులు

ఆటో ఇండస్ట్రీస్‌లో మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని అప్‌గ్రేడ్ అయ్యేందుకు ఆటోనగర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఎంపీకి పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవ ప్రెసిడెంట్ బాయన వెంకటరావు, ప్రెసిడెంట్ దోనేపూడి దుర్గాప్రసాద్, మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ దాసరి రామకృష్ణ, పలు అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

బంధం బంధుత్వాలను నేటితరానికి తెలపాలి: గద్దె

పటమట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మనుషుల మధ్య బంధాలు, బంధుత్వాలు ఉమ్మడి కుటుంబంగా ఉంటే కలిగే సంతోషాల గురించి నేటి తరానికి తెలపాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. 14వ డివిజన్ పటమట దర్శిపేటలోని శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవార్ల ఏసీ కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ మండపం నిర్మాణం మొదలుపెట్టిన వద్ద నుంచి ప్రారంభోత్సవం వరకు మహిళలు ముందంజలో ఉన్నారన్నారు. నిత్యం భజనలు, పూజలు, ప్రార్థనలు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఆవుల నాసరయ్య, పోతంశెట్టి నాగేశ్వరరావు, ముమ్మనేని ప్రసాద్, చింతల సాంబయ్య, రావి సౌజన్య, నర్రా కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న గద్దె రామ్మోహన్

యాష్‌తో వృత్తిపరమైన అభివృద్ధి

ప్యూర్ సంస్థ ఫౌండర్ అండ్ సీఈవో డాక్టర్ శైలా తాళ్లూరి

లబ్బీపేట,ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్యూర్ యూత్ క్లబ్ హబ్ కేవలం స్వచ్ఛంద సేవ గురించి మాత్రమే కాకుండా నాయకత్వం, సేవ, ఆవిష్కరణలను సమగ్రపరచడం ద్వారా రాబోయే సామాజిక బాధ్యతగల నాయకులను రూపొందిస్తుందని ప్యూర్ సంస్థ ఫౌండర్ అండ్ సీఈవో డాక్టర్ శైలా తాళ్లూరి పేర్కొన్నారు. సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల్లో భాగంగా సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, ప్యూర్ యూత్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో యంగ్ ఎంట్రప్రెన్యూర్ స్కిల్ హబ్‌ను(యాష్) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ యాష్ విద్యార్థులకు వాస్తవ ప్రపంచ అనుభవం, వృత్తి పరమైన వృద్ధి అవకాశాలు, బలమైన ప్రపంచ నెట్‌వర్క్‌ను అందిస్తుందని తెలిపారు. ప్రాజెక్టు నిర్వహణ, కెరీర్ అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, వ్యాపార ఆలోచనలు మిళితం చేసి యువ ఆవిష్కర్తలుగా స్టార్టప్‌లు ప్రారంభించే సువర్ణ అవకాశం ఈ హబ్ కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ వెల్లంకి శ్రీదేవి, రేడియాలజిస్ట్ జి.వి.వరప్రసాద్, బీవీఎస్.కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న శైలా తాళ్లూరి

రక్తహీనత ముక్త భారత్‌పై అవగాహన సదస్సు

సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా గురువారం సిద్ధార్థ మహిళా కళాశాల వెల్‌నెస్ క్లబ్, ఎన్ఎస్ఎస్-1,2,3 విభాగాల ఆధ్వర్యంలో రక్తహీనత ముక్త భారత్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ డైరెక్టర్--2 డాక్టర్ రంజనా బండారి మాట్లాడుతూ ఎర్రరక్త కణాలు తగ్గినప్పుడు ఎనీమియా వస్తుందని, అవయవాలు సరిగా పనిచేయవని, ఇంకా ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ సమస్య నుంచి బయట పడాలంటే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, విటమిన్ సీ ఉండే వాటిని, డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలన్నారు. ఈ సమస్య ఉన్నప్పుడు డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ఆర్.మాధవి, ఎస్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా
శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

బస్టేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26న ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనున్నట్టు అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ప్రతి సంవత్సరం కూడా మహాశివరాత్రి భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. కిందటేడాది 3,259 బస్సులను 99 శివ క్షేత్రాలకు నడిపి రూ.10.7 కోట్ల ఆదాయాన్ని పొందింది. మొత్తం 17.02 లక్షల కిలో మీటర్లు తిరిగింది. కిలో మీటర్‌కు రూ.59.13 పైసలు సాధించింది. ఆక్యుపెన్సీ రేటు 100 శాతం ఉండటం విశేషంగా చెప్పవచ్చు. అదే క్రమంలో ఈ రానున్న శివరాత్రికి 3,500 బస్సులను 99 శైవ క్షేత్రాలకు వివిధ జిల్లాల నుంచి నడిపేందుకు రంగం సిద్ధం చేసినట్లు అధికారులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఒక ప్రకటనలో తెలిపారు. రూ.11 కోట్ల ఆదాయాన్ని పొందే లక్ష్యంతో కిలో మీటర్‌కు రూ.60.45 పైసలు సాధించేందుకు 102 శాతం ఆక్యుపెన్సీ పొందేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పాత చార్జీలే కొనసాగుతాయని, చార్జీలు పెంచటం లేదని తెలిపారు. అన్ని డిపోల నుంచి కూడా ప్రత్యేక బస్సులు ఉంటాయని ముఖ్యంగా అన్ని మేజర్ టౌన్స్ నుంచి శ్రీశైలానికి బస్సులు నడుపుతున్నట్లు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు.

దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ క్రికెట్
పటేల్ సీసీ, న్యూ ఎవరెస్ట్ జట్లు గెలుపు



శ్రీ నిచ్యా 85 పరుగులు, ఎం.రూపేష్ 83 పరుగులు (న్యూ ఎవరెస్ట్ జట్టు)

విజయవాడ(స్పోర్ట్స్),ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మూలపాడులోని డీవీఆర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో గురువారం రెండు మ్యాచ్ లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో షైనింగ్ స్టార్ సీసీ, పటేల్ సీసీ జట్లు తలపడగా మొదట బ్యాంటింగ్ చేసిన పటేల్ సీసీ జట్టు 48ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసింది. అనంతరం బ్యాంటింగ్‌కు దిగిన షైనింగ్ స్టార్ సీసీ జట్టు 49.3ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 213పరుగులు మాత్రమే చేసింది. దీంతో పటేల్ సీసీ జట్టు 3పరుగులతో విజయం సాధించి, 4పాయింట్లు సాధించింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో న్యూ ఎవరెస్ట్ జట్టు, వీవీకేఆర్ఎం జట్టు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన న్యూ ఎవరెస్ట్ జట్టు 50ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 392 పరుగులు చేసింది. జట్టులో కెఎస్ఎన్ శ్రీ నిచ్యా 85పరుగులు, ఎం.రూపేష్ 83పరుగులు, డి.సాయి అకిల్ 56పరుగులు చేశారు. అనంతరం బ్యాంటింగ్ చేసిన వీవీకేఆర్ఎం జట్టు 20ఓవర్లు మాత్రమే ఆడి 10వికెట్లు కోల్పోయి 65పరుగులు చేసి ఓటమి పాలైంది. న్యూ ఎవరెస్ట్ జట్టు 4పాయింట్లు సాధించింది.

ఆక్సిలరీ ఆర్టరీ ఆపరేషన్ విజయవంతం



ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చింతలపాడు మండలం చందర్లపాడు గ్రామానికి చెందిన కోరుగంటి సురేష్‌కు ఎడమ చేతి ఆక్సిలరీ ఆర్టరీ మూసుకుపోవడంతో ఎడమ చేతి ఆపరేషన్‌ను జీజీహెచ్‌లో విజయవంతంగా పూర్తి చేశారు, డాక్టర్ మోతీలాల్, సిటీ సర్జన్, సీటీ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఎనస్థీషియాలజీ ప్రొఫెసర్ సోఫియా, స్నేహలత నీరజలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

రూ. 5.3కోట్లతో
బందరు, ఏలూరు కాల్వగట్ల సుందరీకరణ

● కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర



బందరు కాల్వగట్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని బందరు, ఏలూరు కాల్వగట్లను రూ 5.3కోట్లతో సుందరీకరించడం జరుగుతుందని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బందరు, ఏలూరు కాల్వగట్ల సుందరీకరణ పనులను గురువారం నగర కమిషనర్ ధ్యానచంద్ర పలువురు ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కాల్వగట్ల సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుమారు 3 కిలోమీటర్ల పొడవునా బందరు కాలువను రూ 3.3 కోట్లతో, రూ. 2 కోట్లతో ఏలూరు కాలువను రెండు కిలోమీటర్ల మేరకు సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాల్వగట్ల వెంబడి వ్యర్థాలను పూర్తిగా తొలగించి కాలుష్య నియంత్రణకు పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులను 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టడం జరుగుతుందన్నారు. ఇంజనీరింగ్, ఉద్యానశాఖ అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్ పి. సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) లతా, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) రామ్మోహన్ పాల్గొన్నారు.



● నాల్గో డివిజన్ పరిధిలో ఫిలిం కాలనీ మూడో రోడ్డు 2వ క్రాస్ రోడ్డులోని మున్సిపల్ వాటర్ పైపు ధ్వంసమైంది. వారం రోజులు గడిచినా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో తాగునీరు వదిలిన ప్రతి సారి మంచి నీరు వృథాగా పోతోంది.

ఎస్.ఎన్ ప్రసాద్, స్థానికుడు

● **వెంటనే మరమ్మతులు చేస్తాం**

సిబ్బందిని పంపించి వాటర్ పైపునకు మరమ్మతులు చేయిస్తాం.

-రారాజు, వీఎంసీ వాటర్ డిపార్టుమెంట్ అధికారి

(భారతీనగర్,ఆంధ్రజ్యోతి)

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

ప్రమాదాలకు నిలయం విజయనగర్ కాలనీ సెంటర్

భారతీనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు నిలయంగా మారిన విజయనగర్ కాలనీ సెంటర్. ఈ సెంటర్ గుణదల, లయెలా కళాశాల, క్రీస్తురాజుపురం వెళ్లే మూడు రోడ్లు కూడలి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. గతంలో ఈ సెంటర్లో వాహనదారుల వేగం తగ్గించడానికి రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేశారు. వాహనాల రాకపోకలకు ప్రస్తుతం వేసిన స్పీడ్ బ్రేకర్లు ధ్వంసమైపోయాయి. ఈ రోడ్డులో వాహనదారులు వేగంగా రావడంతో ఈసెంటర్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే వాహనదారులు వేగాన్ని తగ్గించడానికి సెంటర్‌లో స్పీడ్ బ్రేకర్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.



విజయనగర్ కాలనీ సెంటర్ (ఇన్‌సెట్లో) ధ్వంసమైన స్పీడ్‌బ్రేకర్

కనకదుర్గానగర్‌లో క్యాంటీన్ తొలగింపు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం అధికారులు గురువారం కనకదుర్గానగర్‌లో క్యాంటీన్‌కు గడువు ముగియడంతో తొలగించారు. రాకపోకలకు అడ్డంగా ఉండటంతో పాటు, అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నందున్న ఈవో ఆదేశాల మేరకు క్యాంటీన్‌ను తొలగించారు.

16న సంకటహర చతుర్థి

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రతినెలా పౌర్ణమి తరువాత వచ్చే చవితి నాడు సంకటహర చతుర్థి హోమం 16న జరుగుతుందని ఈవో ఓ ప్రకటనలో తెలిపారు.

బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడిగా గౌతమ్ కుమార్

వన్‌టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షుడిగా బందెల గౌతమ్ కుమార్ నియమితులయ్యారు. ఈనెల 10న పార్టీ అధినేత్రి, జాతీయ అధ్యక్షురాలు మాయావతి గౌతమ్ కుమార్‌ని అధ్యక్షుడిగా, బి.పరంజ్యోతిని రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నియమించారు. ఈనెల 15న రాష్ట్రంలోని రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, అసెంబ్లీ అధ్యక్షుడు, ఇన్‌చార్జిలు రాష్ట్ర పార్టీ కార్యాలయానికి రావాలని రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



పంటకు కష్టం.. రైతుకు నష్టం



● కొనుగోలు లేక వచ్చినకాడికి తెగనమ్ముకుంటున్న పత్తి రైతులు ● గత్యంతరం లేక మోపిదేవిలో పంటను దున్నేస్తున్న క్యాబేజీ రైతులు

దేశానికి అన్నం పెట్టే రైతన్నల పరిస్థితి నేడు ఎంతో దుర్భరంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్లో అమ్మకానికి పెట్టాక ధరలు తగ్గడం, కొనేవాళ్లు లేకపోవడం, ప్రభుత్వ సాయం అందకపోవడం వంటి సమస్యలన్నీ ఒక్కసారిగా మీద పడటంతో వారి జీవితం అగమ్యగోచరంగా మారింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో రైతులకు పంట పండించడం పెద్ద కష్టమేం కాకపోవచ్చు కానీ పండించిన పంటను మార్కెట్లో అమ్ముకోవడమే ఎంతో కష్టంగా మారింది. వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి సాగుచేసిన క్యాబేజీ, పత్తి పంటలకు నేడు గిట్టుబాటు ధర లేకపోవడం, మార్కెట్లో కొనే నాథుడు రాకపోవడంతో చేతికొచ్చిన పంటనంతా వచ్చినకాడికి తెగనమ్ముకుంటున్నారు. అదీ కుదరకపోతే ట్రాక్టర్‌తో దున్నేస్తున్నారు. ఏంటి రైతన్నా నీకొచ్చిన కష్టం అని అడిగితే దానికి సమాధానం వారి కన్నీళ్లలో కనిపిస్తుంది.

- ఆంధ్రజ్యోతి, మోపిదేవి, కంచికచర్ల

కూరగాయలు, వాణిజ్య పంటలకు మోపిదేవి మండలంలోని లంక గ్రామాలు ప్రసిద్ధి. మోపిదేవి వార్పు, మోపిదేవిలంక, కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక, నాగాయితిప్ప, కోసూరువారిపాలెం గ్రామాల్లో కూరగాయలు, వాణిజ్య పంటలను అధికంగా సాగు చేస్తుంటారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో వచ్చిన వరదల కారణంగా వాణిజ్య, కూరగాయల పంటలు సర్వం కొట్టుకుపోయాయి. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల్లో క్యాబేజీ, క్యాలీఫ్లవర్ 300 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికి అందివచ్చింది. ఎకరాకు రూ.60వేలు కౌలు చెల్లించి రూ.50వేలకుపైగా పెట్టుబడి పెట్టి 3 నెలలు సాగు చేయగా, ప్రస్తుతం రైతు బజార్లు, ప్రైవేట్ మార్కెట్లలో కేజీ రూ.20 పలుకుతుంది. రైతుల నుంచి గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావట్లేదు. పంట చేతికందిరోజులు గడుస్తున్నాయి. 20 రోజులుగా కొనేవాళ్లు రాకపోవటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. గతేడాది పంట కాలంలో ఎకరాకు రూ.2లక్షల వరకు పంటను కొనుగోలు చేసి బెంగుళూరు, మద్రాసు వంటి నగరాలకు వారే తీసుకెళ్లేవారని, ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు కూడా రాకపోవటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.ప్రభుత్వమే గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి: గద్దె శ్రీహరి, రైతు



మండలంలో సాగు చేసిన క్యాబేజీ, క్యాలిఫ్లవర్ పంటలను మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఇప్పటికే రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ప్రస్తుతం పంట కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఏం చేయాలో తోచక ట్రాక్టర్లతో దున్నివేయాలి వచ్చింది.

ఆర్థికంగా నష్టపోతున్నాం: సింహాద్రి రంజిత్ బాబు



ఇటీవల కొద్ది నెలల క్రితం వచ్చిన వరదల కారణంగా నష్టపోయాం. సాగు చేసి పంట పండించినా కొనేవారు లేక మరింత నష్టాల్లో కూరుకుపోతున్నాం. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుకు నూరుశాతం రాయితీపై విత్తనాలు అందించి రైతులను ఆదుకోవాలి.

పత్తి ధర దారుణంగా పడిపోయింది. క్వింటా రూ.5వేల నుంచి రూ.5,500 మించి రావటం లేదు. చివరితీత పత్తి నాణ్యత తగ్గటంతో వ్యాపారులు చురుగ్గా కొనటం లేదు. కొద్ది రోజుల నుంచి సీసీఐ కూడా తీసుకోవటం లేదు. మరో గత్యంతరం లేక రైతులు అయినకాడికి తెగనమ్ముకుంటున్నారు. జిల్లాలో పత్తితీతలు దాదాపుగా పూర్తయ్యాయి. వాటి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేదు. గులాబీ రంగు ఆశించటంతో ఎక్కువ భాగం గుడ్డి (నల్లమచ్చ) పత్తి రావటంతో పాటుగా విత్తనాలు నాసిరకంగా ఉంటున్నాయి. దీంతో ఈ పత్తిని కొనేందుకు స్థానిక వ్యాపారులు ముందుకు రావటం లేదు. ఆచితూచి తీసుకుంటున్నారు తప్పితే గతంలో మాదిరిగా చురుగ్గా కొనటం లేదు. నిన్నటి దాకా కొన్న గుజరాత్ వ్యాపారులు కూడా కొనుగోళ్ల ప్రక్రియను పూర్తిగా నిలిపేశారు. భారత పత్తి సంస్థ (సీసీఐ) కూడా కొద్దిరోజుల నుంచి పెద్దగా కొనటం లేదు. దాదాపుగా కొనుగోళ్లను నిలిపేసిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులు వచ్చిందే ధర అన్నట్టుగా అమ్ముకుంటున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.7,520. ప్రస్తుతం క్వింటాకు రూ.5,500 లోపు ధర రావటం గగనమవుతోంది. పత్తిని నిల్వ ఉంచినా ఉపయోగం లేనందున అమ్మేస్తున్నారు. అయితే ఎలాంటి వ్యర్థాలు, నల్లమచ్చ లేకుండా ఉన్నట్టయితే ముఖ్యంగా రెండు, మూడు తీతల పత్తిని రూ.6,800 కొంటున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి రైతులు అమ్మకుండా పెద్దగా పత్తి నిల్వ చేయలేదు. ఆర్థికంగా వెసులుబాటుతో పాటు తగిన వసతులున్న అతికొద్ది మంది మాత్రమే మున్ముందు ధర పెరుగుతుందన్న ఆశతో పత్తి నిల్వ చేశారు. ఈ సీజన్‌కు సంబంధించి జిల్లాలో రైతుల నుంచి సీసీఐ రూ.384.41 కోట్ల విలువైన పత్తి కొనుగోలు చేసింది. తిరువూరు ఏఎంసీ పరిధిలో 1,83,431.72 క్వింటాళ్లు, నందిగామ ఏఎంసీ పరిధిలో 35,662.52 క్వింటాళ్లు, జగ్గయ్యపేట ఏఎంసీ పరిధిలో 1,66,246.96 క్వింటాళ్లు, మైలవరం ఏఎంసీ పరిధిలో 69,185.10 క్వింటాళ్లు, కంచికచర్ల ఏఎంసీ పరిధిలో 66,716.86 క్వింటాళ్లు, వెరశి 5,21,243.16 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసింది.

వంశీ అరెస్టులో ఉత్కంఠ!

- భవానీపురం పీఎస్ వద్ద మొదటి స్టాప్
- అక్కడి నుంచి కృష్ణలంక పీఎస్‌కు తరలింపు
- కాన్వాన్ వెనకే వచ్చిన వంశీ సతీమణి
- అడ్డుకుని విచారించి పంపేసిన పోలీసులు
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో నిషేధాజ్ఞలు

హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గంలో విజయవాడకు తరలింపు

వన్‌టౌన్, విద్యాధరపురం, ఆటోనగర్, జగ్గయ్యపేట రూరల్, నందిగామ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టులో హైటెన్షన్ నెలకొంది. హైదరాబాద్‌లో ఆయన్ని అరెస్టు చేసిన పోలీసులు ఆయన్ను రోడ్డుమార్గం ద్వారా విజయవాడకు తీసుకువస్తూ ఉదయం 10.30 నుంచి 11 గంటల ప్రాంతంలో అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు గరికపాడు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి గౌరవరం వరకు ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, తదితర శాఖల అధికారులు పర్యవేక్షించారు. చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద జగ్గయ్యపేట వైసీపీ కన్వీనర్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వంశీ అరెస్టును నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి ఆయన్ను మొదట విజయవాడ శివారు పోలీసు స్టేషన్‌గా ఉన్న భవానీపురం తరలించారు. అక్కడ సుమారు 10 నిముషాలు మాత్రమే సెల్లార్‌లో ఉంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్కడి నుంచి నగరంలోని కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు తరలించారు. భవానీపురం పోలీసుస్టేషన్‌లో వంశీని ఉంచారన్న సమాచారం తెలుసుకుని వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు ముందస్తుగానే అప్రమత్తమై భద్రతా చర్యలు చేపట్టారు. ఆయన్ను అక్కడి నుంచి తరలించడంతో అక్కడి అలజడి సర్దుమణిగింది.





వంశీని స్టేషన్‌లోకి తీసుకెళ్తున్న పోలీసులు, అంతర్రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద వంశీని తీసుకొస్తున్న పోలీసు కాన్వాయ్



కృష్ణలంక పోలీస్ స్టేషన్ వద్ద టెన్షన్ టెన్షన్

వల్లభనేని వంశీని భవానీపురం పోలీసు స్టేషన్ నుంచి కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు తరలించిన తరువాత అక్కడ హై టెన్షన్ నెలకొంది. మాజీ ఎమ్మెల్యే వంశీని పరామర్శించేందుకు పోలీసు స్టేషన్ వద్దకు వచ్చిన ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు, పలువురు వైసీపీ నేతలు, పోతిన మహేష్, లాయర్ తానికొండ చిరంజీవి, వంశీ సతీమణి పంకజశ్రీలను పోలీసులు స్టేషన్ గేటు వద్దే అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పెనమలూరు వైసీపీ ఇన్‌చార్జి దేశభక్తుని చక్రవర్తి, పలువురు పార్టీ నేతలు, గన్నవరం నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్టేషన్ వద్దకు తరలివచ్చారు. దీంతో స్టేషన్ వద్ద ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. స్టేషన్ గేటు ముందే పంకజశ్రీ, లాయర్లు గంటల తరబడి నిలబడి ఉండటంతో ఎట్టకేలకు పోలీసు అధికారులు వారిని స్టేషన్‌లోకి అనుమతించి వంశీతో మాట్లాడే అవకాశం కల్పించారు. సుమారు 30 నిమిషాలకు పైగా వారు వంశీతో మాట్లాడి బయటకు వచ్చారు.



వంశీ సతీమణిని విచారించిన పోలీసులు

హైదరాబాద్‌లో వంశీని అరెస్టు చేసినప్పటి నుంచి పోలీసుల కాన్వాయ్‌తో పాటు ఆయన సతీమణి పంకజశ్రీ తన వాహనంలో అనుసరిస్తూ వచ్చారు. నందిగామ సమీపంలో పోలీసులు ఆమె కారును అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ కార్యకర్తల హడావుడి నేపథ్యంలో ఆమెను మునగచర్ల సమీపంలోని బోస్ డ్రైవింగ్ స్కూలుకు తరలించారు. ఏసీపీ ఏబీజీ తిలక్, నందిగామ, నందిగామ రూరల్, జగ్గయ్యపేట సీఐలు లచ్చునాయుడు, చవాన్, వెంకటేశ్వరరావు ఆమెను విచారించారు. అరెస్టు సమయంలో వంశీ ఎవరెవరికి ఫోన్‌లు చేశారన్న అంశంపై ఆరా తీసినట్లు తెలిసింది. ఆమె వద్ద ఉన్న వంశీమోహన్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఆమెను హైదరాబాద్ తిరిగి పంపాలని భావించినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె కోరినట్టు విజయవాడ వైపు పంపారు. ఈ సమాచారం తెలుసుకున్న నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అక్కడకు చేరుకుని కలిసే ప్రయత్నం చేయగా అప్పటికే పోలీసులు ఆమె వాహనాన్ని పంపించేయడంతో ఆయన వెనుతిరిగి వెళ్లిపోయారు.



పటమట స్టేషన్లోకి అనుమతి లేదు..!

వల్లభనేని వంశీ మోహన్‌ను పటమట పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తారని సమాచారంతో స్టేషన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. ఉదయం నుంచి ఏసీపీ, పటమట సీఐ, గుణదల సీఐ స్టేషన్లోనే ఉన్నారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వచ్చిన ఫిర్యాదుదారులను తర్వాత రావాలని తిప్పి పంపేశారు. ఆవరణలో కేవలం సిబ్బంది తప్ప మరెవ్వరినీ అనుమతించలేదు. దీంతో ఫిర్యాదుదారులు కిమ్మనకుండా వెనక్కి వెళ్లిపోయారు. మధ్యాహ్నం స్టేషన్ సమీపంలో తలశీల రఘురాం తన వాహనంలో తనిఖీ చేసి వెళ్లిపోయారు. అనంతరం అక్కడికొచ్చిన ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ రాజకీయ కక్షతోనే వల్లభనేని వంశీని అరెస్ట్ చేశారని ఆరోపించారు. దీంతో పోలీసులు వెళ్లిపోవాలని సూచించారు. మధ్యాహ్నం సత్యవర్ధన్‌ను వైజాగ్ నుంచి స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో ప్రత్యేక పోలీస్ విభాగం అక్కడకు చేరుకుని సత్యవర్ధన్ కిడ్నాప్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

● ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్

వన్‌టౌన్: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని వైసీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. అందుకు ఉదాహరణ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు అని చెప్పారు. వంశీ అరెస్టు పై న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

వంశీపై ప్రభుత్వం కక్ష సాధింపులు

● లాయర్ తానికొండ చిరంజీవి

మాజీ ఎమ్మెల్యే వంశీపై ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని ప్రముఖ లాయర్ తానికొండ చిరంజీవి అన్నారు. పోలీసు స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ వంశీపై ఏదో ఒక కేసు నమోదు చేసి, నాన్ బెయిల్‌బుల్ కేసు పెట్టి 100 రోజుల వరకు బెయిల్ రానీయకుండా జైలులో పెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు.

అన్యాయంగా వంశీపై కేసు

మాజీ ఎమ్మెల్యే మొండితోక

వంశీపై అన్యాయంగా కేసు బనాయించి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని నందిగామ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. వంశీపై ఎవరూ ఫిర్యాదు చేయకుండానే పోలీసులు అరెస్టు చేశారని విమర్శించారు.

వంశీ అరెస్ట్‌పై అనుమానాలు

● వైసీపీ నేత పోతిన

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైసీపీ నేత పోతిన మహేష్ అన్నారు. వంశీ అరెస్టుపై తమకు అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రభుత్వం కావాలనే వంశీని కేసుల్లో ఇరికించటానికి ప్రయత్నిస్తుందన్నారు.

అవుట్ సోర్సింగ్‌లో 'రిటైర్డ్ ఎంప్లాయిస్' ఆదేశాలు విరమించుకోవాలి

బస్టేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్లరికల్ సిబ్బంది ఖాళీలకు సంబంధించి అవుట్ సోర్సింగ్‌లో పదవీ విరమణ చేసిన వారిని పెట్టాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య గురువారం ఆర్టీసీ ఎండీకి లేఖ రాశారు. ఖాళీలు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ అయిదేళ్లలో అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో పదోన్నతులు లేకుండానే రిటైర్ అయ్యారని, మరో వైపు త్వరలో పదోన్నతులు వస్తాయని ఎదురు చూస్తున్న సమయంలో రిటైర్డ్ ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ ద్వారా తీసుకుని భర్తీ చేయాలని ఉన్నతాధికారి ఇచ్చిన నోటిఫికేషన్ ఆందోళన కలిగిస్తుందన్నారు. పదోన్నతుల విషయంలో అధికారులకు ఒక న్యాయం, కిందిస్థాయి ఉద్యోగులకు మరో న్యాయం జరుగుతుందన్నారు.

మాజీ మంత్రి పేర్ని నాని హౌస్ అరెస్టు

● ఇంటికి వెళ్లి నానితో చర్చించిన ఏఎస్పీ, డీఎస్పీ



పేర్ని నానితో మాట్లాడుతున్న ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ రాజా

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు దృష్ట్యా ముందస్తు భద్రతాచర్యల్లో భాగంగా మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)ని హౌస్ అరెస్టు చేశారు. ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ రాజా గురువారం ఉదయం నాని ఇంటికి పోలీసు బలగాలతో వెళ్లారు. ఈ సందర్భంగా వారు నానికి కొన్ని సూచనలు చేశారు. అనుమతి లేకుండా బయటకు వెళ్లరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దని తెలిపారు. దాదాపు 40 నిముషాలపాటు వారు నానితో చర్చలు జరిపారు. ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, మచిలీపట్నం, ఆర్‌పేట ఎస్సైలు కూడా అక్కడికి చేరుకున్నారుర. పేర్ని నాని ఇంటి వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించడంతో మచిలీపట్నంలో కాసేపు సంచలనం రేకెత్తింది. రామానాయుడుపేట సెంటర్ నుంచి, పేర్ని నాని ఇంటి వరకు పోలీసులు రావడంతో వైసీపీ కార్యకర్తలు పేర్ని నాని ఇంటికి చేరుకున్నారు. అయితే హౌస్ అరెస్టు సంగతి తెలుసుకుని ఎవరి ఇళ్లకు వారు వెళ్లారు.

144 సెక్షన్ అమలు

మచిలీపట్నం, గుణదల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అరెస్ట్ నేపథ్యంలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 144, 30 సెక్షన్ల అమలు చేస్తున్నట్టు కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం కృష్ణాజిల్లాలో ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేయకూడదని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఎన్టీఆర్ జిల్లాలోనూ...

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 13 నుంచి మే 12 వరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నిషేదాజ్ఞలు అమల్లో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. నగరంలో కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలు, టెన్త్, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఈ సెక్షన్ 30 అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమయంలో కమిషనరేట్ పరిధిలో ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసన, ధర్నాలు పోలీసుల ముందస్తు అనుమతులు లేకుండా నిర్వహించరాదన్నారు. నిషేదాజ్ఞలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వంశీ అరెస్టులో తప్పులేదు

● మంత్రి కొల్లు రవీంద్ర విమర్శ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): దళిత నేత సత్యవర్ధన్‌పై దౌర్జన్యకాండను చేసిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టు చేయడంలో తప్పులేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ సీఎంగా ఉన్న జగన్ మెప్పుకోసం కన్నతల్లిలాంటి టీడీపీ కార్యాలయంపై దాడి జరపడం సిగ్గుచేటన్నారు. అక్రమాలకు పాల్పడినవారెవరూ తప్పించుకోలేరన్నారు.

రాజకీయాల్లో హత్యలుండవు..ఆత్మహత్యలే..!

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పటమట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో హత్యలుండవు కేవలం ఆత్మహత్యలే ఉంటాయని రాజకీయ అనుభవజ్ఞులు చెప్పేవారని దానికి వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నిదర్శనంగా నిలుస్తున్నాడని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ వంశీ అరెస్టు సక్రమమేనని ఆయన ఒక నేరాన్ని చేసి దాన్ని కప్పిపుచ్చడానికి మరిన్ని నేరాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. దళిత యువకుడిని కిడ్నాప్ చేస్తేనే పోలీసులు వంశీని అరెస్టు చేశారన్నారు. రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ మాట్లాడుతూ అన్యాయంగా, అక్రమంగా వ్యవహరిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, పేరేపి ఈశ్వర్, కలపాల విక్రమ్ పాల్గొన్నారు.

వంశీ మనిషికాదు.. మృగం

● నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వంశీమోహన్ మనిషి కాదని మృగంలాంటి వాడని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య విమర్శించారు. వంశీఅరెస్టుపై స్పందించిన సౌమ్య తనకు రాజకీయ జీవితాన్నిచ్చిన చంద్రబాబు లాంటి మహోన్నతమైన వ్యక్తిపైన, ఆయన కుటుంబ సభ్యులపైన తీవ్ర వ్యాఖ్యలు చేసిన వంశీని కఠినంగా శిక్షించాలని సూచించారు.

దుర్మార్గులను ప్రభుత్వం ఉపేక్షించదు

● ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా



పామర్రు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాసామ్య స్ఫూర్తితో కొనసాగుతున్న ప్రభుత్వంలో అరాచక శక్తులు, దుర్మార్గాలకు పాల్పడేవారిని ఎంతమాత్రం ఉపేక్షించడం జరగదని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గురువారం వంశీ అరెస్టుపై జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిర్యాదుదారుడైన దళిత వర్గానికి చెందిన యువకుడిని కేసు ఉపసంహరణ కోసం భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు కిడ్నాప్‌కు పాల్పడడం వంశీ చేసిన మరో దుర్మార్గరపు చర్య కాదా అని ప్రశ్నించారు.

పోలీసులపై గౌరవం పెరిగింది


● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): దుర్మార్గుడైన వంశీమోహన్ అరెస్టుతో రాష్ట్ర పోలీసులపై ప్రజల్లో మరింత గౌరవం పెరిగిందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్‌లోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తప్పు చేసిన వారెవ్వరైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదు చేసిన దళితుడిని కిడ్నాప్ చేసి ఒత్తిడి తెచ్చి కేసును మాఫీ చేయాలని ప్రయత్నాలు చేశారన్నారు. అధికారమదంతో విర్రవీగితే ఏం జరుగుతుందో వంశీ అరెస్టు ఒక ఉదాహరణ అన్నారు. త్వరలోనే కొడాలి నానీ సైతం కటకటాల పాలవ్వడం ఖాయమన్నారు. ఇద్దరు మిత్రులు త్వరలోనే జైలులో కలుస్తారని జోస్యం చెప్పారు.

వంశీ పాపం పండింది


● మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసి తగులబెట్టి అక్రమాలకు పాల్పడిన వల్లభనేని వంశీ పాపం ఇన్నాళ్లకు పండిందని మాజీ ఎంపీ, ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. మచిలీపట్నంలో గురువారం రాత్రి మీడియాతో మాట్లాడారు. గన్నవరంలో వంశీ దమనకాండ ఇంతా అంతా కాదన్నారు. ఎంతోమందిపై కేసులు పెట్టించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారన్నారు. మహిళలను వేధించారన్నారు.

విర్రవీగిన ప్రతి ఒక్కరూ ఊచలు లెక్కపెట్టాల్సిందే!


● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న



వన్‌టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డిని చూసి విర్రవీగిన ప్రతి ఒక్కరూ ఊచలు లెక్కపెట్టాల్సిందేనని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఎక్స్‌లో పోస్టు చేశారు. వంశీ అరెస్టు నేపథ్యంలో ఆయన స్పందిస్తూ టీడీపీలో నేతగా ఎదిగి పక్కపార్టీలోకి వెళ్లి ఇష్టం వచ్చినట్టు వాగితే ఎంతవాడినైనా వదిలే ప్రసక్తి లేదని చెప్పడానికి వంశీ అరెస్టే ఉదాహరణ అని చెప్పారు. మొరిగిన కుక్కలు చాలా ఉన్నాయని, అవి కూడా త్వరలోనే బోనులోకి వెళతాయన్నారు.

వంశీ దుర్మార్గుడు

● టీడీపీ నేతల ధ్వజం



తోట్లవల్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వల్లభనేని వంశీ లాంటి దుర్మార్గుడు ఎవరూ ఉండరని, ఫిర్యాదు ఇచ్చిన దళిత వ్యక్తి సత్యవర్ధన్‌ని బెదిరించి కేసు వెనక్కు తీసుకుంటున్నట్టు కోర్టులో అఫిడవిట్ వేయించటం అతడి దుర్మార్గానికి పరాకాష్ట అని టీడీపీ సీనియర్ నేత ఎన్ విజయకుమార్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. గరికపర్రులో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తనకు రాజకీయ జన్మనిచ్చిన కన్నతల్లిలాంటి టీడీపీ కార్యాలయాన్ని వంశీ తగులపెట్టించాడని, అధికారంలో ఉన్నప్పుడు అంతులేని అరాచకాలు చేశాడన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



నితిన్ గడ్కరీని కలిసి రైతుల తరఫున విజ్ఞప్తిచేస్తున్న ఎంపీ పురందేశ్వరి

రైతుల అవస్థలు తొలగించి న్యాయం చేయండి

గొల్లపూడి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి నుంచి పెద అవుటుపల్లి వరకు (ప్యాకేజీ-3) పశ్చిమ బైపాస్ నిర్మాణంలో 12 ఏళ్ల నుంచి దారి సౌకర్యం లేక రైతులు పడుతున్న అవస్థలను తొలగించి దారి ఏర్పాటుతో న్యాయం చేయాలని రాష్ట్ర జాతీయ రహదారుల శాఖ రీజనల్ అధికారికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాలు జారీ చేశారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎంపీ పురందేశ్వరి, బీజేపీ నేత నూతులపాటి బాలకోటేశ్వరరావు గతంలో గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. బుధవారం మరోమారు పురందేశ్వరి రైతులతో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి సమస్యను వివరించగా ఆయన స్పందించి ఆర్వోకు ఆదేశాలిచ్చినట్టు గురువారం విలేకర్లకు తెలిపారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అమరావతి, గన్నవరం విమానాశ్రయం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అభివృద్ధి కోసం రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని ఆర్వోను ఆదేశించినట్టు చెప్పారు.

ప్రేమను పంచేందుకే వచ్చాం

బ్రహ్మకుమారీస్

మనలో చాలామంది కనీసం ఇరవై మంది సభ్యులు ఉమ్మడి కుటుంబంలో కలిసి జీవించడం చూసిన తరం నుంచి వచ్చారు. ప్రస్తుత తరంలో వివాహం చేసుకోకూడదని లేదా పిల్లలను కనకూడదని నిర్ణయించుకున్న యువతీ యువకుల తరాన్ని ఇప్పుడు మనం చూస్తున్నాం. సంబంధాలను ఒత్తిడితో కూడుకున్నవిగా, వాటివల్ల చాలా భావోద్వేగాలకు గురికావలసి ఉంటుందనే ఆలోచనతో... వాటికి దూరంగా ఉండాలని, ఒంటరిగా జీవించాలనీ చాలామంది నిశ్చయించుకుంటున్నారు. కానీ ఈ ధోరణి సరైనది కాదు. ఎందుకంటే మానవులు ప్రేమ జీవులు. మనలో ఎంతో ప్రేమ ఇప్పటికే ఉంది. ఇతరుల నుంచి మనం ప్రేమ కోసం యాచించవలసిన అవసరం లేదు. అయితే ఇతరులు మనకు ప్రేమను ఇవ్వలేకపోతున్నారు. ఎందుకంటే వారు కూడా ప్రేమకోసం ఎదురుచూస్తున్నారు. మనమందరం మనలో ఉన్న ప్రేమను గుర్తించడం లేదు, దాన్ని పెంపొందించుకోవడం లేదు. ప్రేమించడం అనేది ఆత్మ తాలూకు అసలు స్వభావం. 'నేను ప్రేమను పంచడం కోసమే ఇక్కడకు వచ్చాను' అనేది తెలుసుకోవాలి. మనం మన అంచనాలను తగ్గించుకొని, బేషరతుగా ప్రేమించినప్పుడే మంచి సంబంధాలు ఏర్పడతాయి.



రీఛార్జ్ చేసుకుందాం...

మరి ప్రేమను ఇవ్వగలిగేలా మనం మనల్ని ఎలా సిద్ధం చేసుకోగలం? దీనికి బ్యాటరీని ఉదాహరణగా తీసుకుందాం. మన 'అంతరాత్మ'ను ఒక బ్యాటరీ అని అనుకుందాం. అది పూర్తిగా ఛార్జ్ అయి ఉన్నప్పుడు... మీరు భావోద్వేగపరంగా ఆరోగ్యంగా ఉంటారు. ఆనందం, శాంతి, ప్రేమ... ఇదే మన సహజమైన జీవన విధానం. మన నిర్లక్ష్యం కారణంగా బ్యాటరీలోని ఛార్జ్ తగ్గిపోయినప్పుడు... అంటే మనలోపలి నుంచి ఆనందాన్ని, శాంతిని, ప్రేమను మనం పొందలేనప్పుడు... కొనుగోలు చేసిన వస్తువులలో, మనం సాధించిన విషయాల్లో వాటిని వెతకడం ప్రారంభిస్తాం. తీర్థయాత్రల్లో, సెలవు రోజుల్లో శాంతిని వెతుక్కుంటాం. ఇతరులు మనల్ని ప్రేమించాలని కోరుకుంటున్నాం, సరే! కానీ మనం వారికి తిరిగి ఏమి ఇవ్వాలి? మీలో లేని వాటిని లేదా తక్కువైన వాటిని ఇతరులకు ఎలా ఇవ్వగలరు?

మనమే ప్రేమగా మారాలి..

కాబట్టి మనల్ని మనం రీఛార్జ్ చేసుకోవాలి. ఆధ్యాత్మికంగా మనల్ని మనం శక్తిమంతం చేసుకోవాలి. ఉదయం లేవగానే ధ్యానం చేయడం, మంచి గ్రంథాలను చదవడం, సంతోషంగా, సంతృప్తి ఉండడం లాంటి సానుకూల చర్యలతో రోజును ప్రారంభించాలి. దీనికోసం ప్రతి ఉదయం కనీసం ముప్ఫై నిమిషాల నుంచి ఒక గంట వరకూ కేటాయించాలి. దీనివల్ల ఎన్నో మంచి ఫలితాలు కలుగుతాయి. రోజును సజావుగా సాగించడానికి ఇది దోహదం చేస్తుంది. మనల్ని మాత్రమే మనం ప్రేమించుకోవడానికి అలవాటు పడిన పరిస్థితుల్లో... స్వార్థ పూరితంగా మారకుండా మనల్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. మనం ప్రేమతో నిండినప్పుడు, అందరికీ ప్రేమను అందించగలం. మన లోపల అంతా ఖాళీ అయితే... ఇతరులు కనబరిచే కాస్త ప్రతికూలత కూడా మనల్ని తీవ్రంగా బాధపడుతుంది. మన తిరస్కరణకు, నియంత్రణకు గురైనట్టు భావిస్తాం. ఎందుకంటే మన లోపల శక్తి లేదు. మనం మానసికంగా ఆరోగ్యంగా లేము. దీనివల్ల ఇతరుల నుంచి వైదొలగుతాం. మనం ప్రేమను కోరుకోవడం కాదు, మనమే ప్రేమగా మారాలి. మన ఆత్మను నిరంతరం శక్తిమంతం చేసుకోవడం మనం మనంగా ఉండడమే దీనికి మార్గం.

• బ్రహ్మకుమారి బి.కె.శివాని

చింతన




ప్రేమ శాశ్వతమే కానీ...

'ప్రేమంటే ఏమిటి?' అనే ప్రశ్నకు సమాధానం సంక్లిష్టంగా ఉంటుంది. అది వ్యక్తుల మీద, పరిస్థితుల మీద, సామాజిక సంబంధాల మీద ఆధారపడి ఉంటుంది. మనుషులు ఉన్నంతవరకూ ప్రేమలు కూడా ఉంటాయి. అంటే ప్రేమ శాశ్వతం. కానీ... పరస్పర అనురాగాల నుంచి అతీంద్రియమైన స్పృహ వరకూ... ప్రేమ అనేది ఒక సోపాన క్రమం. దీనిలో అనేక పొరలు, అనేక స్థాయిలు ఉంటాయి. మీ స్థాయికి అనుగుణంగానే ప్రేమ గురించి మీ ఆలోచనలు ఉంటాయి. ప్రేమ గురించి హిట్లర్ ఆలోచన ఒక విధంగా ఉంటుంది. గౌతమ బుద్ధుడి ఆలోచన మరో విధంగా ఉంటుంది. అవి వేర్వేరు ధ్రువాలు కాబట్టి పరస్పర విరుద్ధంగా ఉంటాయి.

ఆ పేరుతో నడిచేది రాజకీయమే...

కోట్లాది మందికి ప్రేమ గురించి ఏమీ తెలియదు. అత్యల్ప స్థాయిలో... ప్రేమ అంటే రాజకీయం, అధికారం. ఆధిపత్యం అనే ఆలోచనతో ప్రేమ ఎక్కడైతే కలుషితమయిందో... అదే రాజకీయం. దాన్ని మీరు ఎలాగైనా పిలవొచ్చు. కానీ అది రాజకీయమే. భార్యాభర్తలు, ప్రేయసీ ప్రియులు, స్నేహితుల మధ్య నడిచేదంతా మొత్తం రాజకీయమే. ఒకరిమీద మరొకరు ఆధిపత్యాన్ని చెలాయించా లనుకుంటారు. చిత్రమేమిటంటే... ఆ ఆధిపత్యాన్ని మీరు ఆస్వాదిస్తారు. ఇటువంటి ప్రేమ రాజకీయం తప్పితే మరొకటికాదు. అది చక్కెర పూసిన చేదు మాత్ర. మీరు ప్రేమ గురించి మాట్లాడతారు, కానీ అందులో నిగూఢంగా, లోతుగా ఉన్న కోరిక... మరొకరిని దోచుకోవడమే. ఇదంతా మీరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని నేను అనడం లేదు. మీకు ఆ స్పృహ ఉండదు. ఇదంతా మనం ఆలోచించకుండానే జరిగిపోతూ ఉంటుంది. అందుకే ఇతరులపై ఆధిపత్యం చెలాయించడం, అసూయ పడడం ప్రేమలో భాగం అయిపోయింది. ఇలాంటి ప్రేమ ఆనందం కన్నా దుఃఖాన్నే ఎక్కువగా సృష్టిస్తుంది. దీనిలో 99 శాతం చేదుగా ఉంటుంది. దాని మీద మీరు పూసిన చక్కెర ఒక్క శాతమే ఉంటుంది. మీ ప్రేమ వ్యవహారం ఆరంభంలో ఉన్నప్పుడు... మీరు తీపిని రుచి చూస్తారు. త్వరలోనే ఆ చక్కెర మాయమవుతుంది. చేదైన వాస్తవాలు కనిపించడం ప్రారంభిస్తాయి. మొత్తం విషయమంతా వికారంగా మారిపోతుంది.



ప్రేమ తాలూకు అత్యల్పమైన రూపం

అందుకనే ఎంతోమంది వ్యక్తులు ఇకపై మనుషుల మీద ప్రేమ పెంచుకోకూడదని నిర్ణయించుకుంటారు. కుక్కనో, పిల్లినో, చిలుకనో తెచ్చుకొని, వాటిని పెంచుకుంటారు. వాటిమీద ప్రేమను పెంచుకుంటారు. అలాగే మరి కొందరు కార్లను, విల్లాలను, విలాస వస్తువులను పోగు చేసుకోవడానికి ఇష్టపడతారు. దీనివల్ల మీ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి ఆస్కారం ఉంటుంది. ఇది సులువైన పని. ఎందుకంటే మానవ సంబంధాలలో ఉండే సంక్లిష్టత వీటిలో లేదు. మనుషులతో ప్రేమగా ఉండడం అనేది పూర్తి నరకంగా, నిరంతర సంఘర్షణగా మారింది. అందుకే జనం పశువులతో, పక్షులతో, యంత్రాలతో, వస్తువులతో ప్రేమలో పడుతున్నారు. ఇది ప్రేమ తాలూకు అత్యల్పమైన రూపం. దాన్ని మీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు... అవగాహనలో మరో మెట్టుకు చేరుకుంటారు. ఒక్కొక్క సోపానాన్ని అధిరోహిస్తూ... అత్యున్నత శిఖరం చేరుకుంటారు. అప్పుడు ప్రేమ అనేది రాజకీయ సంబంధం కాదు. ఈ లోకాన్ని, లోకులను బుద్ధుడు ప్రేమించాడు, ఏసుక్రీస్తు ప్రేమించాడు. ప్రతిఫలంగా వారేమీ కోరుకోలేదు. మీరు కూడా అలాగే ప్రేమిస్తారు. ఇవ్వడంలో ఉన్న ఆనందాన్ని ఆస్వాదించడం కోసం ప్రేమను పంచుతారు. ఆ స్థితికి చేరుకున్నాక ప్రేమ అనేది ఒక బేరం కాదు. దాని సౌందర్యం అతీంద్రియంగా ఉంటుంది. అప్పటివరకూ మీరు ఆనందించిన ఆనందాలన్నిటినీ మించిన ఆనందాన్ని మీరు పొందుతారు.




• ఓషో

వ్యాసపీఠం

బహుముఖ బనారస్!

కాశీ.. వారణాసి... బనారస్...

ఏ పేరుతో పిలుచుకున్నా- హిందువులు జీవితంలో ఒక్క సారైనా దర్శించాలనుకొనే నగరమది. అయితే కాశీకి వేల రూపాలున్నాయి. కాశీ ఒక ధార్మిక నగరం. దాన్ని 'విష్ణు నగరం', 'శివ నగరం', 'బుద్ధ నగరం'గా విభజించుకోవచ్చు. ఈ మూడింటిలోను వేల దేవాలయాలు మనకు కనిపిస్తాయి. కాశీ ఒక పండుగల నగరం. అక్కడ ఉత్సవం జరగని వీధి లేదు. ఊరేగింపు వెళ్లని రోజు లేదు. శ్మశానంలో కూడా 'హోలీ' (మసాన్ హోలీ) ఆడే నగరం మనకెక్కడా కనిపించదు. కాశీ సాంస్కృతిక నగరం. అది సంగీత, నృత్యాల సంగమ స్థలం. ఒక్క మాటలో చెప్పాలంటే సనాతన ధర్మాన్ని ఆధునికతతో మేళవించిన అద్భుత నగరం కాశీ. అందుకే ఒక కవి - "న భూఖా బనారస్.. న నంగా బనారస్... సదా మస్త్ చంగా రహా హై బనారస్" (బనారస్‌కు దారిద్ర్యం లేదు, ఎప్పుడూ దిగంబరం కాదు, బనారస్ ఎప్పుడూ యవ్వనంగా సంతోషంగా ఉంటుంది) అంటాడు. ఇలా కాశీకి చెందిన రకరకాల పార్శ్వాలను ఐపీఎస్ అధికారి, కవి రమా సత్యనారాయణ- 'బహుముఖ బనారస్' అనే పుస్తకంలో ఆవిష్కరించారు. సరళమైన తెలుగులో, అందమైన వచనంలో రాసిన ఈ పుస్తకాన్ని వారణాసిపై ఆసక్తి ఉన్న వారందరూ తప్పనిసరిగా చదవాలి.



బహుముఖ బనారస్
రచయిత: రమా సత్యనారాయణ
ప్రచురణ: మిసిమి
ప్రతులకు: 9949516567

సుభాషితం

అవన్నీ ప్రయోజనంలేని పనులు

కరిరాజున్ బిసతంత సంతతులచేగట్టన్ విజృంభించు వా
డురు వజ్రంబు శిరీష పుష్పములచే నూహించు భేదింప దీ
పరచింతన్ లవణాబ్ధికిన్ మధుకణ ప్రాప్తిం బ్రవర్తించు ని
ద్ధరణిన్ మూర్ఖుల దెల్పనెవ్వడు సుధా ధారానుకారోక్తులన్

భర్తృహరి 'నీతిశతకం'లోని 'వ్యాళం బాల మృణాల తంతుభిరసౌ రోద్ధుం సముజ్జృంభతే...' అనే శ్లోకాన్ని ఏనుగు లక్ష్మణకవి తెలుగు వారికి ఈ పద్య రూపంలో అందించారు.


భావం: మూర్ఖుల తీరును మార్చడం కష్టం. తామర తూళ్ళతో చేసిన దారాలతో మదపుటేనుగును బంధించాలనే ఆలోచన, దిరిసెన పువ్వు కొనతో వజ్రానికి సాన పట్టాలనే ప్రయత్నం, అనంతమైన ఉప్పు సముద్రాన్ని చిన్న తేనెబొట్టుతో తియ్యగా మార్చాలనుకోవడం నిరర్థకమైన పనులు. మూర్ఖులను మంచి మాటలతో మార్చాలనుకొనేవారు కూడా అలాంటి ప్రయోజనం లేని పనులు చేసేవారి కోవకే చెందుతారు.



సద్బోధ

దారి తప్పితే... అనర్థం తప్పదు

పూర్వం ఒక గారడివాడు ఉండేవాడు. అతను ఊరూరు తిరుగుతూ, గారడి ప్రదర్శనలు చేస్తూ జీవించేవాడు. అతని దగ్గర పాము, కోతి, మేక ఉండేవి. వాటిని అతను స్నేహితుల్లా భావించి, వాటిని సంరక్షిస్తూ ఉండేవాడు. ఒకసారి అతను ఒక ఊరిలో బస చేశాడు. ఇంతలో భారీ వర్షాలు వచ్చి, ఆ ఊరిని వరదనీరు ముంచెత్తింది. గ్రామస్తులందరూ ఊరిని ఖాళీ చేసి వెళిపోతున్నారు. అతను కూడా సురక్షిత ప్రాంతానికి బయలుదేరాడు. దారిలో ఒక వాగు కనిపించింది. అందులో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. అప్పుడు ఆ గారడివాడు పాముల బుట్టని తల మీద పెట్టుకొని, కోతిని భుజాల మీద కూర్చోబెట్టుకొని, మేకని చంకలో ఉంచుకొని... నీటిలో నడుస్తున్నాడు.



> భగవంతుడు మనల్ని ఎల్లప్పుడూ కాపాడాలనే ప్రయత్నిస్తాడు. కానీ మన స్వభావాల కారణంగా, అవివేకం కారణంగా ఆయన నిర్దేశించిన దారి నుంచి తప్పించుకోవాలని చూస్తాం. దాని ప్రతిఫలం అనుభవిస్తాం.

ప్రవాహం మధ్యకు వారు చేరుకొనేసరికి, కోతికి దాని సహజసిద్ధమైన బుద్ధితో... పాముల పెట్టె మూతను తెరిచింది. వెంటనే పాము బుస్సుమంటూ పైకి దూకి, కోతిని కాటెయ్యబోయింది. ప్రమాదాన్ని గుర్తించిన కోతి నీటిలోకి గెంతింది. దాని వెనుకే పాము కూడా నీటిలోకి దూకింది. ఈ గందరగోళంతో భయపడిన మేక... ఆ గారడివాడి పట్టు వదిలించుకొని నీటిలో పడింది. ఆ మూడూ ప్రవాహంలో కొట్టుకుపోయాయి. వాటిని ఏదో రకంగా తనతోపాటు అవతలి ఒడ్డుకు చేర్చాలని గారడివాడు అనుకున్నా ప్రయోజనం లేకపోయింది.

ఈ కథను యోగిగా, సద్గురువుగా ఖ్యాతి పొందిన స్వామి నారాయణ్ మహరాజ్ తన భక్తులకు వివరిస్తూ... "మనిషి స్వభావం కోతిలాంటిది. అనవసరమైన పనులవైపే దృష్టి మళ్ళుతూ ఉంటుంది. చాలా సందర్భాలలో... మనం చేసే పని వల్ల సంభవించే ప్రమాదాల గురించి ఆలోచించం. పాము ఉన్న బుట్టను కోతి తెరిచింది. పాము స్వభావం కాటు వెయ్యడం. కాబట్టి అది కోతి మీదకు దూకింది. అపాయాన్ని తప్పించుకోవడానికి మరో అపాయంలోకి... నీటి ప్రవాహంలోకి కోతి దూకి, కొట్టుకుపోయింది. కోతిని తరుముతూ పాము కూడా దాని వెనుకే నీటిలో పడింది. దీనంతటినీ చూసి భయపడిన మేక కూడా తనను రక్షించేవాణ్ణి వదిలించుకొని నీళ్ళలోకి దూకింది. అవి వరదలో పడకుండా కాపాడుకోవడానికి గారడివాడు ఎంతో తాపత్రయపడ్డాడు. తన దారి తను చూసుకోకుండా వాటిని తనతో పాటు మోసుకువెళ్ళాడు. కానీ ఆ రక్షణను అవి ఉపయోగించుకోలేకపోయాయి. మనిషి విషయంలోనూ అంతే... భగవంతుడు మనల్ని ఎల్లప్పుడూ కాపాడాలనే ప్రయత్నిస్తాడు. కానీ మన స్వభావాల కారణంగా, అవివేకం కారణంగా ఆయన నిర్దేశించిన దారి నుంచి తప్పించుకోవాలని చూస్తాం. దాని ప్రతిఫలం అనుభవిస్తాం.అన్నివేళలా భగవంతుడినే ధ్యానిస్తూ, వివేకంతో మసలుకున్నప్పుడు ఎలాంటి ప్రమాదాన్నైనా మనం దాటగలం" అని వివరించారు.

దొంగలో వైరాగ్యం

ఆధ్యాత్మికవేత్తగా, స్వామి వివేకానందకు గురువుగా, ఎందరికో జ్ఞానమార్గదర్శిగా శ్రీ రామకృష్ణ పరమహంస ప్రసిద్ధులు. భక్తిని, ఆధ్యాత్మికతను బోధించడం కోసం వివిధ సందర్భాలలో ఆయన చెప్పిన కథలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. వాటిలో ఒకటి:

పూర్వం ఒక రాజ మందిరంలోకి దొంగ చొరబడ్డాడు. విలువైన వస్తువులు ఏవైనా దోచుకొని పోవాలని అతని ఆలోచన. రాజు ఉన్న గదిలోకి అతను ప్రవేశించేసరికి... రాజుకు, రాణికి మధ్య సంభాషణ జరుగుతోంది. "రాజ్యం, సంపద ఎల్లకాలం ఉండవు. దేవుడి కృపే మనకు తోడుగా వస్తుంది. కాబట్టి మన కుమార్తెను నదీతీరంలో నివసిస్తున్న సాధువుల్లో ఒకరికి ఇచ్చి పెళ్ళి చేస్తాను. రేపే మన ప్రతినిధులను అక్కడికి పంపుతాను" అని రాజు చెప్పడం ఆ దొంగ విన్నాడు. 'ఈ సమయంలో నేను ఇక్కడికి రావడం నా అదృష్టం. ఏకంగా రాజకుమార్తెను పెళ్లాడే అవకాశం రాబోతోంది. సాధువు వేషం వేసుకొని, రేపు ఉదయం నదీ తీరానికి వెళ్ళి కూర్చుంటాను. రాజకుమార్తెకు నేనే తగిన వరుణ్ణని రాజు, అతని పరివారం భావించేలా నటిస్తాను' అనుకున్నాడు.

మరుసటి రోజు పొద్దున్నే... అతను సాధువులా తయారయ్యాడు. నది దగ్గరకు వెళ్ళి, అక్కడ ఉన్న సాధువుల వరుసలో ఆఖర్న కూర్చున్నాడు. కొంతసేపటికి రాజ ప్రతినిధులు వచ్చారు. సాధువుల దగ్గర ఆగి, "రాజ కుమార్తెను వివాహం చేసుకుంటారా?" అని అడుగుతున్నారు. వారిలో ఎవరూ అందుకు అంగీకరించలేదు. చివరకు వారు దొంగ దగ్గరకు వచ్చి, అతణ్ణి కూడా అడిగారు. 'అవున'ని చెప్పాలనుకున్న దొంగకు ఆ క్షణంలో నోట మాట రాలేదు.

రాజ ప్రతినిధులు రాజమందిరానికి వెళ్ళి, జరిగినదంతా రాజుకు చెప్పారు. "మహారాజా! దాదాపు అందరూ తిరస్కరించారు. ఒక యువ సాధువు మాత్రం ఏదీ మాట్లాడలేదు. అతణ్ణి బహుశా ఒప్పించవచ్చేమో!" అన్నారు. అప్పుడు రాజే స్వయంగా నదీతీరానికి వచ్చాడు. సాధువు వేషంలో ఉన్న దొంగకు నమస్కరించాడు. తన కుమార్తెను పెళ్ళాడవలసిందిగా వేడుకున్నాడు.

ఆ క్షణంలో దొంగ మనసు మారిపోయింది. 'నేను కేవలం సాధువులా వేషం కట్టాను. కానీ రాజే వచ్చి నన్ను ప్రార్థిస్తున్నాడు. గౌరవిస్తున్నాడు. దీనికంతటికీ నేను అర్హుణ్ణి కాదు. రాజుకే అక్కరలేని సంపదలు నాకెందుకు? ఈ క్షణం నుంచి నేను సాధువుగా మారిపోతాను' అనుకున్నాడు. ఈ ఆలోచన అతణ్ణి తీవ్రంగా ప్రభావితం చేసింది. మోసగించి రాజకుమార్తెను పెళ్ళాడాలనే ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. రాజు ప్రతిపాదనను తిరస్కరించాడు. మిగిలిన సాధువులతో కలిసి, సాధన చేసి, కొంతకాలానికి అందరికీ గౌరవనీయుడిగా మారాడు.

ఈ కథను శ్రీ రామకృష్ణులు తన శిష్యులకు వివరిస్తూ... "మనిషిలో వైరాగ్యం ఎప్పుడు వస్తుందో, మంచి పనుల పట్ల, దైవం పట్ల ఎలా ఆకర్షితులవుతారో ఊహించడం కష్టం. ఒక్కొక్కసారి తప్పుడు మార్గంలో మనం పయనించాలనుకున్నా... దైవ సంకల్పం మనల్ని మంచి దారిలోకి మళ్ళిస్తుంది. ఉన్నతులుగా మారుస్తుంది" అని చెప్పారు.

(18న శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి)



గీతాసారం

అదే జ్ఞానం

ఒకసారి ఒక మిత్రబృందం పెద్ద నదిని దాటవలసి వచ్చింది. దానికోసం వారు ఒక పడవను తయారు చేసుకున్నారు. నదిని దాటారు. ఆ తరువాత, ఆ పెద్ద పడవ తమకు భవిష్యత్తులో ఉపయోగపడుతుందని, కాబట్టి మిగతా ప్రయాణమంతా దాన్ని మోసుకువెళ్ళాలని అనుకున్నారు. దానితో వారి ప్రయాణం నెమ్మదించింది. ఇబ్బందికరంగా మారింది. నది ఒక బాధాకరమైన ధ్రువం అనుకుంటే... పడవ ఆ ధ్రువాన్ని అధిగమించడానికి ఉపయోగించే పరికరం. కానీ నది లేని చోట సాగే ప్రయాణంలో... ఆ పడవే భారంగా మారుతుంది. అదే విధంగా మన దైనందిన జీవితాల్లో మనం ఎదుర్కొనే అనేక బాధాకరమైన ధ్రువాల నుంచి మనకు విముక్తి కలిగించే పరికరాలు, ప్రక్రియలు చాలా ఉన్నాయి. ఇటువంటి తాత్కాలిక బాధల నుంచి ఉపశమనం పొందడానికి వేదాలు అనేక అనుష్ఠానాలను వివరించాయి. ఈనాటికీ ఈ ఆచారాలు అందుబాటులో ఉన్నాయి, వాటిని ప్రజలు ఆచరిస్తున్నారు. ఆరోగ్యం, వ్యాపారం, పని, కుటుంబం, ఇతర అంశాల్లో మనకు ఇబ్బందులు ఎదురైనప్పుడు... ఈ అనుష్ఠానాల సహాయం తీసుకోవడం తార్కికంగా కనిపిస్తుంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

అయితే... వేదాలకు పైపై అర్థాలు వివరిస్తూ, ఈ జీవితంలో సుఖం, మరణానంతరం స్వర్గం లభించేలా చేస్తానని వాగ్దానాలు చేసే తెలివితక్కువవారి మాటలలో చిక్కుకోవద్దని శ్రీకృష్ణుడు ఉపదేశించాడు. ధ్రువాలను (ద్వంద్వాతీత), గుణాలను (గుణాతీత, నిర్గుణ) అధిగమించి 'ఆత్మవాన్' (ఆత్మలో స్థిరపడినవాడు)గా మారాలని అర్జునుణ్ణి ఆయన ప్రోత్సహించాడు. "ఒక పెద్ద సరస్సు దొరికినవాడికి చిన్న కాలువతో అవసరం లేదు. అదే విధంగా ఆత్మలో స్థిరపడినవాడికి ఇతరమైనవన్నీ చిన్నకాలువ లాంటివి" అని చెప్పాడు. మన జీవన ప్రయాణంలో పడవ భారాన్ని తలకెత్తుకొని, మనల్ని మనం బాధించుకోకుండా ఉండడమే జ్ఞానం. సుఖాన్ని, శక్తిని పొందడానికి చేసే ప్రయత్నాలు ఎంత వ్యర్థమైనవో అర్థం చేసుకొని, వాటిని అధిగమించాలని శ్రీకృష్ణుడు ప్రోత్సహిస్తున్నాడు.

ఇంద్రియాలు, ఇంద్రియ విషయాల కలయిక 'సుఖదుఃఖాలు' అనే ద్వంద్వాలను తెస్తుందని, అవి అనిత్యం (అశాశ్వతం) కాబట్టి వాటిని ఓర్చుకోవాలనీ అర్జునుడికి శ్రీకృష్ణుడు సలహా ఇచ్చాడు. వాటిని అధిగమించి ఆ క్షణికమైన అంశాలకు సాక్షిగా ఉండడం నేర్చుకోవాలని సూచించాడు. కృత్రిమమైన సుఖాలకన్నా... ప్రామాణికమైన, శాశ్వతమైన ఆనందమే గొప్పదని ఆయన స్పష్టం చేశాడు.

బిజినెస్

విజయవాడ ● శుక్రవారం 14 ఫిబ్రవరి 2025

గ్లాండ్ ఫార్మా కొనుగోలు రేసులో
బ్లాక్‌స్టోన్, వార్‌బర్గ్ పింకస్!

51% వాటా కొనుగోలుకు పీఈ సంస్థల సన్నాహాలు

డీల్ విలువ రూ.26,000 కోట్లు?

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ (జీపీఎల్) యాజమాన్యం మరోసారి చేతులు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కంపెనీ ఈక్విటీలో ప్రస్తుతం చైనా కేంద్రంగా పనిచేసే షాంఘై ఫోసన్ ఫార్మాస్యూటికల్ కంపెనీకి 51 శాతం వాటా ఉంది. ఈ వాటాను కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు బ్లాక్‌స్టోన్, బ్రూక్‌ఫీల్డ్, వార్‌బర్గ్ పింకస్ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ డీల్ విలువ 300 కోట్ల డాలర్ల (సుమారు రూ.26,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

8ఏళ్ల క్రితం ఫోసన్ చేతికి: పీవీఎన్ రాజు 1978లో గ్లాండ్ ఫార్మాను ఏర్పాటు చేశారు. కంపెనీ తయారు చేసే జెనరిక్ ఇంజెక్టబుల్స్‌కు భారత్, అమెరికాతో పాటు దాదాపు 90 దేశాల్లో డిమాండ్ ఉంది. సుమారు ఎనిమిదేళ్ల క్రితం చైనా కంపెనీ షాంఘై ఫోసన్ ఫార్మా.. గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో 74 శాతం వాటాను కొనుగోలు చేసింది. 2020లో భారత్-చైనా దేశాల సరిహద్దు ఘర్షణ దగ్గరి నుంచి ఫోసన్.. గ్లాండ్ ఫార్మా నుంచి తప్పుకోవాలని చూస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే 23 శాతం వాటాను ఇతరులకు విక్రయించింది. తాజాగా మిగిలిన 51 శాతం వాటాను కూడా విక్రయించేందుకు పీఈ సంస్థలతో చర్చలు జరుపుతోంది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు మోర్గాన్ స్టాన్లీ, యూబీఎస్ ఇందుకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ వార్తలపై స్పందించేందుకు ఫోసన్ ఫార్మా, జీపీఎల్ నిరాకరిస్తున్నాయి.

రెండేళ్లలో 4 లక్షల ఈవీ చార్జింగ్ పాయింట్లు : టాటా ఈవీ

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల చార్జింగ్ వ్యవస్థ ఏర్పాటు కోసం "ఓపెన్ కొలాబరేషన్ 2.0" కార్యక్రమాన్ని టాటా.ఈవీ ప్రకటించింది. రెండేళ్లలో దేశవ్యాప్తంగా 4 లక్షలకు పైబడి చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడం లక్ష్యంగా ప్రకటించింది. చార్జింగ్ పాయింట్ ఆపరేటర్లతో భాగస్వామ్యాలు పటిష్ఠం చేసుకోవడంతో పాటు అన్ని కంపెనీల ఈవీ కస్టమర్లకు ఉపయోగపడేలా 30,000 కొత్త పబ్లిక్ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఇందులో భాగంగా టాటా పవర్, చార్జ్ జోన్, స్టాటిక్, జియోన్‌లతో భాగస్వామ్యాలపై సంతకాలు చేశామని; ఈ కేంద్రాలు అమిత వేగవంతమైన చార్జింగ్ సదుపాయం కల్పిస్తాయని టాటా. ఈవీ ప్రకటించింది. ప్రధాన నగరాలు, ప్రధాన రహదారులపై వీటిని ఏర్పాటు చేస్తారు.

పసిడి అమ్మకాలు ధమాల్!

80 శాతం తగ్గిన ఆభరణాల విక్రయాలు



పెళ్లిళ్ల సీజన్ అయినా కొనుగోళ్లు అంతంతే.. చుక్కలనంటిన ధరే కారణం

న్యూఢిల్లీ: పసిడి ధర ఇటు కొనుగోలుదారులు, వ్యాపారులకు దడ పుట్టిస్తోంది. పెరిగిన ధర చూసి పిల్లల పెళ్లిళ్ల కోసం పసిడి కొనాలనుకునే కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావటంతో అమ్మకాలు బాగుంటాయని ఆశించిన వ్యాపారులకు ప్రస్తుత ధర చుక్కలు చూపిస్తోంది. గత ఏడాది పెళ్లిళ్ల సీజన్‌తో పోలిస్తే నగల అమ్మకాలు ప్రస్తుతం 70 నుంచి 80 శాతం పడిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. 'పెళ్లిళ్ల కోసం బంగారం కొనాలని చాలామంది భావించారు. అయితే పెరిగిన ధరలు చూసి వాళ్లు తమ నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారు. ధర ఎప్పుడు తగ్గుతుంది? బంగారం కొనేందుకు ఏది సరైన సమయం అని అదే పనిగా ఫోన్ చేసి అడుగుతున్నారు' అని ఒక నగల వ్యాపారి చెప్పారు. వివాహాల సీజన్ అయినప్పటికీ ధరలు అందుబాటులో లేకపోవటంతో దేశవ్యాప్తంగా పసిడి విక్రయాలు గణనీయంగా పడిపోయాయని భారత బులియన్, జువెలర్స్ అసోసియేషన్ కార్యదర్శి సురేంద్ర మెహతా తెలిపారు.

ట్రంప్ హెచ్చరికలు.. రూపాయి పతనం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే కెనడా, మెక్సికో, ఈయూ వంటి మిత్ర దేశాలతో పాటు చైనా దిగుమతులపైనా సుంకాలు పెంచేశారు. రేపో మాపో కొన్ని దేశాల దిగుమతులపై ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించారు. దీంతో పెట్టుబడులకు ఢోకా లేని పసిడి ధర చుక్కలంటుతోంది. మరోవైపు దేశీయంగా రూపాయి పతనం కూడా పసిడి ధరలు పెరగటానికి ప్రధాన కారణంగా ఉంది. మన దేశ పసిడి అవసరాల్లో 95 శాతానికి పైగా దిగుమతులే దిక్కు. ఇందుకు డాలర్లలో చెల్లించాలి. అయితే డాలర్‌తో రూపాయి మారకం రేటు రోజురోజుకీ క్షీణిస్తోంది. ఈ పతనాన్ని అడ్డుకునేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గత నాలుగు నెలల్లో దాదాపు 9,000 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. అయినప్పటికీ డాలర్‌తో రూపాయి పతనం ఆగలేదు. పరిస్థితి ఇలానే కొనసాగితే మార్చి నెలాఖరుకు డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.90కు దిగజారే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. దేశీయ మార్కెట్లో పసిడి పరుగుకు ఇది కూడా ఒక ప్రధాన కారణం.

ఈ ఏడాది ఇప్పటికే 10% పైగా పెరిగిన ధర

ఢిల్లీ మార్కెట్లో గురువారం 10 గ్రాముల మేలిమి (24 క్యారట్స్) బంగారం ధర రూ.140 పెరిగి రూ.88,100కు చేరింది. ఒక దశలో రూ.88,600ను తాకింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం గురువారం ఒక దశలో 2,944.60 డాలర్లకు (సుమారు రూ.2,55,944) చేరింది. దేశీయంగా బంగారం ధర ఈ ఏడాది ఇప్పటికే 10 శాతానికి పైగా ధర పెరిగింది. 2024లో పసిడి ధర 21 శాతానికి పైగా పెరిగిన సంగతి తెలిసిందే.

సరఫరాకు మించి డిమాండ్

అంతర్జాతీయంగా సైనిక ఉద్రిక్తతలు తగ్గినా ఆర్థిక అనిశ్చితి కొనసాగుతోంది. ట్రంప్ అధికారం చేపట్టాక ఇది మరింత పెరిగింది. దీంతో భారత్, చైనాతో పాటు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు తమ బంగారం రిజర్వులు పెంచుకుంటూ వస్తున్నాయి.

మరోవైపు మిగతా లోహాలతో పోలిస్తే పసిడి ఉత్పత్తి తక్కువ. డిమాండ్ మాత్రం ఎక్కువ. ప్రస్తుత ఆర్థిక అనిశ్చితితో స్టాక్ మార్కెట్లు 'బేర్' మంటున్నాయి. దీంతో పెట్టుబడులకు పెద్దగా ఢోకా లేని పసిడి మళ్లీ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది.

ఆసియా కుబేరులు అంబానీలే

బ్లూంబర్గ్ వెల్లడి

న్యూఢిల్లీ: ఆసియా ఖండంలోనే అత్యంత ధనవంతులైన వ్యాపారవేత్తల కుటుంబంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ కుటుంబం నిలిచింది. అంబానీ కుటుంబం 9,050 కోట్ల డాలర్ల (రూ.7.87 లక్షల కోట్లు) సంపదతో ఆసియాలో అమిత సంపన్నులైన 20 కుటుంబాల్లో అగ్రస్థానంలో నిలిచినట్టు బ్లూంబర్గ్ ప్రకటించింది. ఆసియాకు చెందిన మరెన్నో కుటుంబాలు ఆయన తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆసియా సంపన్న వ్యాపార సామ్రాజ్యాల్లో ఎనర్జీ, టెక్నాలజీ, ఫైనాన్స్ వంటి భిన్న రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థలున్నాయి. 2002లో సంస్థ వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీ మరణానంతరం ముకేశ్ ఆర్‌ఐఎల్ పగ్గాలు చేపట్టారు. ఒకప్పుడు ఆయిల్ రిఫైనింగ్ రంగంలో కార్యకలాపాలు సాగించే సంస్థగా ఉన్న రిలయన్స్ టెక్నాలజీ, వినియోగ వస్తువులు, ఆర్థిక సర్వీసులు వంటి రంగాలకు విస్తరించడంతో పాటు ఇటీవలే హరిత ఇంధన విభాగంలోకి కూడా ప్రవేశించింది. కాగా ఈ జాబితాలో షాపూర్జీ పల్లోంజీ గ్రూప్, ఓపీ జిందాల్ గ్రూప్ ,బజాజ్ గ్రూప్, హిందూజా గ్రూప్, ఆదిత్య బిర్లా గ్రూప్ ఉన్నాయి.

పిట్టీ ఇంజనీరింగ్ లాభం రూ.29 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.421 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.28.76 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 83.07 శాతం, ఆదాయం 37.95 శాతం వృద్ధి చెందాయి. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు గాను రూ.1,271.06 కోట్ల ఆదాయంపై రూ.86.14 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంచనాలకు తగ్గట్టుగానే పని తీరు ఉందని, కంపెనీ ఇటీవల చేపట్టిన విలీనాలు, కొనుగోళ్లు అన్నింటినీ సమీకృతం చేసే ప్రక్రియ కొనసాగుతోందని పిట్టీ ఇంజనీరింగ్ ఎండీ, సీఈఓ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	103	విజయవాడ	111
వరంగల్	103	గుంటూరు	116
కరీంనగర్	103	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	90
కర్నూలు	103	నెల్లూరు	95
విశాఖపట్నం	103	అనంతపురం	95
గోదావరి	111		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,050 ▲	79,800 ▲	1,07,000 ▲
విజయవాడ	88,500 ▲	82,300 ▲	98,000 ▲
విశాఖపట్నం	86,180 ▲	79,000 ▲	96,070 ▲
రాజమండ్రి	87,050 ▲	79,809 ▲	97,900 ▲
ప్రొద్దుటూరు	88,300 ▲	81,770 ▲	96,500 ▲
ముంబై	85,748 ▲	78,545 ▲	95,549 ▲

సెన్సెక్స్ 31 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ఆరంభ లాభాలను కోల్పోయి వరుసగా ఏడో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం ఇందుకు కారణమైంది. గురువారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో 751 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. చివరికి 32.11 పాయింట్ల నష్టంతో 76,138.97 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 13.85 పాయింట్లు కోల్పోయి 23,031.40 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 16 రాణించగా.. 14 నష్టపోయాయి.

నాట్కో షేరు 20% పతనం

హైదరాబాద్‌కు చెందిన నాట్కో ఫార్మా లిమిటెడ్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను నిరాశ పరచడంతో కంపెనీ షేరు ఏకంగా 19.99 శాతం పతనమై రూ.973.40 వద్దకు జారుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.4,356.85 కోట్లు తగ్గి రూ.17,434.55 కోట్లకు పడిపోయింది.

హోండా-నిస్సాన్ విలీన ప్రతిపాదన రద్దు

టోక్యో: జపాన్‌కు చెందిన వాహన తయారీ సంస్థలు హోండా, నిస్సాన్, మిత్సుబిషి తమ వ్యాపారాల విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకున్నాయి. విలీనం దిశగా జరుగుతున్న చర్చలకు ముగింపు పలికినట్లు గురువారం కంపెనీలు ప్రకటించాయి. తొలుత వ్యాపారాల ఏకీకరణ ద్వారా జాయింట్ హోల్డింగ్ కంపెనీ ఏర్పాటు ప్రతిపాదన నుంచి నిస్సాన్‌ను హోండా అనుబంధ విభాగంగా మార్చే దిశగా చర్చలు మొదలైనట్లు నిస్సాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మకోటో ఉచిడా తెలిపారు. "ప్రపంచ వాహన మార్కెట్లో పెరిగిన పోటీని తట్టుకునేందుకు మూడు కంపెనీలు ఏకమవ్వాలని భావించాం. కానీ, ప్రస్తుత చర్చలు సాగుతున్న తీరు నిస్సాన్ సత్తాను పూర్తి స్థాయిలో రాబట్టలేదు. అందుకే నిస్సాన్‌ను అనుబంధ విభాగంగా మార్చే ప్రతిపాదనకు ఒప్పుకోలేదని" ఆయన పేర్కొన్నారు. ఇక వ్యాపార పునరుద్ధరణపై దృష్టి పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. అయితే, వ్యాపారాల ఏకీకరణను త్వరితగతిన పూర్తి చేసేందుకు షేర్ల మార్పిడిని తాము సూచించినట్లు విడిగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హోండా చీఫ్ ఎగ్జిక్యూటివ్ తొషిరో మిబే అన్నారు.

రూ.9,499కే సామ్‌సంగ్ 5జీ ఫోన్

మార్కెట్లోకి గెలాక్సీ ఎఫ్06 హ్యాండ్‌సెట్



న్యూఢిల్లీ: కొరియా ఎలక్ట్రానిక్ దిగ్గజం సామ్‌సంగ్ రూ.10,000 లోపు ధర గల స్మార్ట్‌ఫోన్ విభాగంలోకి ప్రవేశించింది. దేశీయ మార్కెట్లో గెలాక్సీ ఎఫ్06 హ్యాండ్‌సెట్‌ను విడుదల చేసింది. అలా ఇటీవల ఈ సెగ్మెంట్‌లో స్మార్ట్‌ఫోన్లు జారీ చేసిన కంపెనీల సరసన చేరింది. స్టైలి‌ష్‌గా కనిపించే ఈ స్మార్ట్‌ఫోన్ రెండు వేరియెంట్లలో అందుబాటులో ఉంటుంది. 4జీబీ సిస్టమ్ మెమొరీ, 128 జీబీ స్టోరేజీ గల వెర్షన్ ధర రూ.9,499 కాగా 6జీబీ సిస్టమ్ మెమొరీ, 128 జీబీ స్టోరేజీ గల వెర్షన్ ధర రూ.10,999. మీడియాటెక్ డీ6300 ప్రాసెసర్‌తో కూడిన ఈ హ్యాండ్‌సెట్‌ను 5000 ఎంఏహెచ్ బ్యాటరీతో తీసుకు వచ్చినట్లు సామ్‌సంగ్ ఇండియా జనరల్ మేనేజర్ అక్షయ్ రావు అన్నారు.

స్పోర్ట్స్

మ్యాచ్ మధ్యలో ఆరంభ వేడుకలు

వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నేడు ఆరంభ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. అయితే ఇది ఆర్‌సీబీ-జీజీ మ్యాచ్‌కు ముందు కాకుండా ఇన్నింగ్స్ విరామంలో రాత్రి 9 గంటలకు ప్రేక్షకులను అలరించనుంది. ఇందులో బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, సింగర్ మధు బంతి బాగ్చి పాల్గొననున్నారు.



అనుష్క - రితిక



మహిళల ధనాధన్‌కు
వేళాయె..

నేటి నుంచే డబ్ల్యూపీఎల్

ఆరంభ మ్యాచ్‌లో ఆర్‌సీబీ X గుజరాత్

రాత్రి 7.30 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

వడోదర: ఐపీఎల్ తరహాలోనే అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)కు రంగం సిద్ధమైంది. శుక్రవారం నుంచి మార్చి 15 వరకు ఈ మూడో సీజన్ జరుగనుంది. 2023లో తొలిసారి ఆరంభమైన డబ్ల్యూపీఎల్ గత రెండు అంచెల్లో రెండు వేదికలకే పరిమితమైంది. కానీ ఈసారి బెంగళూరు, ముంబైలకు తోడుగా వడోదర, లఖ్‌నవూ కూడా చేరాయి. ఈ నాలుగు పట్టణాల్లో మొత్తంగా 22 మ్యాచ్‌లు జరుగబోతున్నాయి. ఫైనల్ మ్యాచ్ ముంబైలో ఉంటుంది. ఇక నేటి ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు గుజరాత్ జెయింట్స్‌తో తలపడనుంది. దేశవాళీ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసేందుకు ఆరంభించిన ఈ లీగ్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు యువ ప్లేయర్లు సిద్ధమవుతున్నారు. విశేషంగా రాణించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో మెరిసేందుకు ఈ వేదిక వారికి చక్కటి అవకాశంగా చెప్పవచ్చు. ఎందుకంటే ఈ లీగ్ ద్వారానే శ్రేయాంక పాటిల్, సైకా ఇషాక్ జాతీయ జట్టులో చోటు దక్కించుకోగలిగారు. అలాగే విదేశీ క్రికెటర్లతో డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోనుండడం కూడా వారికి కలిసివచ్చే అంశం. అయితే స్టార్ ప్లేయర్లు అలీసా హీలీ, సోఫీ మోలినెక్స్, కేట్ క్రాస్ గాయాలతో తాజా సీజన్‌కు దూరమయ్యారు. ఇదిలావుండగా చాలామంది వర్ధమాన ప్లేయర్లు ఈ లీగ్‌లో ఆడుతున్నారని, భారత కెప్టెన్ హోదాలో వారి ప్రదర్శన చూసేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నట్టు హర్మన్‌ప్రీత్ తెలిపింది. ఇక ఫామ్ కోల్పోయి జట్టులో స్థానం గల్లంతయిన షఫాలీ వర్మకు ఈ లీగ్ కీలకం కానుంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్‌గా తను చెలరేగితే తిరిగి జాతీయ జట్టులో బెర్త్ దక్కించుకోవచ్చు. మరోవైపు మంధాన నేతృత్వంలోని ఆర్‌సీబీకి ఈసారి టైటిల్ నిలబెట్టుకోవడం అంత సులువేమీ కాదు. సోఫీ డివైన్ అందుబాటులో లేకపోగా క్రాస్, మోలినెక్స్, ఆశా శోభన గాయాలతో దూరమయ్యారు. దీనికితోడు స్టార్ ఆల్‌రౌండర్ ఎలిస్ పెర్రీ, శ్రేయాంక గాయాల నుంచి కోలుకుంటున్నారు. పేస్ ఆల్‌రౌండర్ కష్వీ గౌతమ్ (గుజరాత్)పై కూడా అందరి దృష్టి నెలకొంది. అటు రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం షఫాలీ, లానింగ్, జెమీమా, సదర్లాండ్, కాప్‌లతో పటిష్ఠంగా కనిపిస్తోంది. యూపీ వారియర్స్‌కు దీప్తి శర్మ, గుజరాత్ జెయింట్స్‌కు ఆష్లే గార్డ్‌నర్ ఈసారి నూతన కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు.

ఆటగాళ్ల కుటుంబ సభ్యులకు
నో చాన్స్!

చాంపియన్స్ ట్రోఫీ

న్యూఢిల్లీ: బీసీసీఐ సరికొత్త నిబంధనలు ఒక్కొక్కటిగా అమల్లోకి వస్తున్నాయి. ఇప్పటికే బోర్డు చెప్పినట్టు టీమిండియా ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌లో పాల్గొనగా.. తాజాగా తమ కుటుంబసభ్యులు లేకుండానే చాంపియన్స్ ట్రోఫీ (సీటీ)కి వెళ్లనున్నారు. ఈనెల 19న ఆరంభం కానున్న సీటీలో పాల్గొనేందుకు జట్టు శనివారం దుబాయ్‌కు పయనం కానుంది. అయితే బోర్డు నూతన ప్రయాణ నియమాల ప్రకారం తొలిసారిగా ఆటగాళ్లు మాత్రమే అక్కడికి వెళ్లబోతున్నారు. విదేశీ పర్యటన 45 రోజులు.. అంతకంటే ఎక్కువగా ఉంటేనే ఆటగాళ్ల కుటుంబసభ్యులకు గరిష్ఠంగా రెండు వారాలపాటు అనుమతి ఉంటుంది. కానీ సీటీ షెడ్యూల్ మూడు వారాలే కావడంతో ప్లేయర్ల భార్యా పిల్లలు స్వదేశాల్లోనే ఉండాల్సి వస్తోంది. ఒకవేళ ఎవరికైనా మినహాయింపునిచ్చినా.. పూర్తి ఖర్చులు ఆటగాళ్లే భరించాల్సి ఉంటుందని బోర్డు అధికారి పేర్కొన్నాడు.

తెలంగాణకు రెండు కాంస్యాలు



మునీక్/రష్మీ

డెహ్రాడూన్: జాతీయ క్రీడలను రెండు కాంస్య పతకాలతో తెలంగాణ ముగించింది. గురువారం జరిగిన షాట్‌గన్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మునీక్/రష్మీ ద్వయం కాంస్య పతకం సొంతం చేసుకుంది. నెట్‌బాల్ మిక్స్‌డ్ విభాగంలోనూ తెలంగాణ జట్టు మూడో స్థానం దక్కించుకుంది. కాంస్య పతక పోరులో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ 31-31తో సమంగా నిలిచాయి. దాంతో రెండు జట్లకు కాంస్య పతకాలు ప్రకటించారు. కాగా..గత నెల 28న ప్రారంభమైన జాతీయ క్రీడల్లో పోటీలు గురువారం ముగిశాయి. శుక్రవారం ముగింపు కార్యక్రమం జరుగుతుంది. కాగా పట్టికలో ఆంధ్ర జట్టు 14 (7-1-6) పతకాలతో 18వ స్థానం, తెలంగాణ 18 (3-3-12) పతకాలతో 26వ స్థానంలో నిలిచాయి. ఇక ఓవరాల్‌గా చూస్తే సర్వీసెస్ 121 (68 స్వర్ణ, 26 రజత, 27 కాంస్య) పతకాలతో అగ్ర స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర (54 స్వర్ణ, 71 రజత, 73 కాంస్య-198) రెండో స్థానం, హరియాణా (48 స్వర్ణ, 47 రజత, కాంస్య 58-153) మూడో స్థానం సాధించాయి.



● ఫైనల్లో పాక్ X కివీస్ నేడు
● ముక్కోణపు సిరీస్

టైటిల్ ఎవరిదో?

సోనీ స్పోర్ట్స్‌లో మ.2.30 నుంచి..

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీకి ముందు చివరి సన్నాహక మ్యాచ్‌కు పాకిస్థాన్, న్యూజిలాండ్ సై అంటున్నాయి. శుక్రవారం జరిగే ముక్కోణపు సిరీస్ ఫైనల్లో రెండుజట్లూ అమీతుమీ తేల్చుకోనుంది. యాదృచ్ఛికంగా ఈ నెల 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీ ఆరంభ మ్యాచ్‌లోనూ కివీస్‌తోనే పాక్ తలపడాల్సి ఉంది. కాగా, ముక్కోణపు సిరీస్‌లో పాక్, దక్షిణాఫ్రికాను ఓడించిన కివీస్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. అయితే, దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో 353 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన పాక్ ఫుల్‌జోష్‌లో ఉంది. ఐసీసీ టోర్నీ ముందు రిజ్వాన్, సల్మాన్ ఆఘా, ఫఖర్ జమాన్ మంచి ఫామ్‌లో ఉన్నారు. కానీ, డెత్ బౌలింగ్ కొంత ఆందోళనకరంగా ఉంది. మరోవైపు న్యూజిలాండ్ కూడా ఎంతో బలంగా ఉంది. విలియమ్సన్, ఫిలిప్స్, కాన్వే బ్యాట్‌తో అదరగొడుతున్నారు. ప్రత్యర్థితో పోల్చితే కివీస్ బౌలింగ్ మెరుగ్గా కనిపిస్తోంది. ఇరుజట్లూ జోరుమీద ఉండడంతో ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగనుంది.

'బెంగళూరు' సారథి రజత్ పటీదార్




బెంగళూరు: ఐపీఎల్ జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నూతన సారథిగా రజత్ పటీదార్ (31) నియమితుడయ్యాడు. గతేడాది జట్టుకు నాయకత్వం వహించిన ఫా డుప్లెసిని ఫ్రాంచైజీ వదిలేసుకోవడంతో ఈ సీజన్‌లో జట్టు పగ్గాలను ఎవరికి అప్పగిస్తారనేది సస్పెన్స్‌గా మారింది. మళ్లీ కోహ్లీకే కెప్టెన్సీ కట్టబెడతారనే ఊహాగానాలు కూడా బలంగా వినిపించాయి. కానీ, గురువారం అనూహ్యంగా పటీదార్ పేరును ఫ్రాంచైజీ యాజమాన్యం ప్రకటించింది. గత నవంబరులో బెంగళూరు అట్టిపెట్టుకున్న వారిలో రజత్ ఒకడు. దేశవాళీ టోర్నీలైన సయ్యద్ ముస్తాక్ అలీ, విజయ్ హజారే ట్రోఫీల్లో మధ్యప్రదేశ్‌కు రజత్ నాయకత్వం వహించాడు. అతడు జట్టును నడిపించిన విధానాన్ని నిశితంగా గమనించామని కోచ్ ఆండీ ఫ్లవర్ చెప్పాడు. భారత జట్టు తరఫున రజత్ మూడు టెస్టులు, ఒక వన్డే ఆడాడు. కాగా, కొత్త కెప్టెన్‌కు కోహ్లీ శుభాకాంక్షలు చెప్పాడు. 'ఈ స్థానంలో ఉండడానికి తగిన అర్హత సాధించావు. మేమంతా నీ వెనుకే ఉంటాం. నువ్వు సారథిగా ఎదగడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామ'ని వీడియో సందేశంలో విరాట్ చెప్పాడు.



రాజస్థాన్ బౌలింగ్ కోచ్‌గా బహుతులే

రాజస్థాన్ రాయల్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ ఆటగాడు సాయిరాజ్ బహుతులే నియమితుడయ్యాడు. లెగ్ స్పిన్నర్ అయిన బహుతులే భారత్ తరఫున రెండు టెస్టులు, ఎనిమిది వన్డేలు ఆడాడు. ముంబై, బెంగాల్, కేరళ జట్లకు అతడు మెంటార్‌గానూ పని చేశాడు. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో కలసి పనిచేయడానికి ఎంతో ఉత్సుకతతో ఉన్నట్టు బహుతులే చెప్పాడు.

పంత్ ఆగాల్సిందే..



- వన్డేల్లో నెం.1 కీపర్ రాహులే
- కోచ్ గంభీర్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: వన్డేలలో జట్టు కీపర్ ఎవరో కోచ్ గౌతమ్ గంభీర్ తేల్చేశాడు. తద్వారా ఈ అంశంపై జరుగుతున్న చర్చలకు ఫుల్‌స్టాప్ పెట్టాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో కీపర్ కేఎల్ రాహులేనని స్పష్టంచేశాడు. ఈనేపథ్యంలో వన్డేలలో కీపర్ స్థానం కోసం రిషబ్ పంత్ ఎదురు చూడక తప్పదని చెప్పాడు. ఇంగ్లండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో రాహుల్ కీపర్‌గా వ్యవహరించాడు. ఇక..బుధవారంనాటి ఆఖరి వన్డేలో ఐదో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన రాహుల్ 29 బంతుల్లో 40 పరుగులు చేసి బ్యాటింగ్‌లోనూ సత్తాచాటాడు. 'ప్రస్తుతానికైతే వన్డేలలో మా నెం.1 కీపర్ రాహులే. ఈమేరకు అతడు తన సమర్థతను నిరూపించుకున్నాడు కూడా. జట్టులో ఇద్దరు వికెట్ కీపర్లున్నారు. కానీ టీమ్‌లో ఇప్పుడున్న నాణ్యమైన ఆటగాళ్ల రీత్యా చూస్తే ఇద్దరు కీపర్లను ఆడించలేం. తనకు అవకాశం లభించినప్పుడు సత్తా చాటేందుకు పంత్ సిద్ధంగా ఉండాలి' అని గంభీర్ అన్నాడు. 2022 డిసెంబరులో ఘోర రోడ్డు ప్రమాదంలో పంత్ గాయపడిన సంగతి తెలిసిందే. దాంతో 2023 వన్డే ప్రపంచ కప్‌లో 32 ఏళ్ల రాహుల్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు.

అఫ్రీదికి జరిమానా

కరాచీ: దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో సఫారీ బ్యాటర్ మాథ్యూ బ్రిట్జ్‌కీతో రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినందుకుగాను పాక్ పేసర్ షహీన్‌షా అఫ్రీది మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతోపాటు ఓ డీమెరిట్ పాయింట్‌ను అతడి ఖాతాలో చేర్చారు. అలాగే బవుమా రనౌట్ అయినప్పుడు సౌద్ షకీల్, కమ్రాన్ గులామ్ అతిగా సంబరాలు చేసుకొన్నారు. దీంతో వారి మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధిస్తున్నట్టు ఐసీసీ పేర్కొంది.

పోరాడి ఓడిన భారత్

దక్షిణ కొరియా గెలుపు

ఆసియా టీమ్ చాంపియన్‌షిప్

క్వింగ్దావో (చైనా): ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గ్రూప్-డి రెండో పోరులో భారత్ ఓటమి చవిచూసింది. గురువారం జరిగిన పోరులో దక్షిణ కొరియా 3-2తో భారత్‌పై గెలుపొందింది. అయితే గ్రూపులో రెండో స్థానంలో నిలిచిన మనోళ్లు ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. కొరియాతో..తొలుత మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో జంట, సింగిల్స్‌లో మాళవిక పరాజయం పాలయ్యారు. పురుషుల సింగిల్స్‌లో సతీష్, మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా నెగ్గడంతో మనోళ్లు 2-2తో సమం చేశారు. కానీ పురుషుల డబుల్స్‌లో సాత్విక్/అర్జున్ ఓడడంతో కొరియాకు విజయం దక్కింది. శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో జపాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకుంటుంది. ఇందులో విజయం సాధిస్తే కనీసం కాంస్య పతకం ఖాయమవుతుంది.


DEEPA ARTS
INTRODUCING
RAAGINRAJ
T-SERIES
RAJASHEKAR
FILM
తల
నేడే
విడుదల
P.SREENIVASA GOUD
EXECUTIVE PRODUCER RADHA RAJASEKHAR


SWADHARM
SMT. SAVITHRY & SRI UMESH KUMAR
PRESENTS
నేడే విడుదల
బ్రహ్మా ఆనందం
PRODUCED BY RAHUL YADAV NAKKA
WRITTEN & DIRECTED BY RVS NIKHIL


AR ENTERTAINMENTS
INTRODUCING "AANAND VARDHAN" IN
నిదురించు జహాపన
PRODUCER'S SAM-G. VAMSI KRISHNA VARMA WRITTEN & DIRECTED BY PRASANNA KUMAR.D
CO-PRODUCER LOKESH AKULA MUSIC ANUP RUBENS
CAST AANAND VARDHAN, ROSHNI SAHOTA, NAVAMI GAYAK
నేడే
విడుదల
MANAM MUSIC
HINDUSTAN KALA KENDRA


WUNDERBAR FILMS
A WUNDERBAR PRODUCTION
RK PRODUCTIONS
Happy Valentine's Day
IN CINEMAS
21ST
FEB
WORLDWIDE
జాబిలమ్మ
నీకు అంత
కోపమా
A USUAL LOVE STORY
WRITTEN & DIRECTED BY
DHANUSH
A G V PRAKASH KUMAR MUSICAL
PRODUCED BY
KASTHOORI RAJA - VIJAYALAKSHMI KASTHOORI RAJA


SMT. ARCHANA PRESENTS
SHINE SCREENS
MASS KA DAS
VISHWAKSEN
AS
లైలా
Laila
A Leon James Musical
నేడే
విడుదల
PRODUCED BY
SAHU GARAPATI
DIRECTED BY
RAM NARAYAN
RICHARD PRASAD BRAHMA KADALI VASUDEVA MURTHY SAGAR DADI
KANISHKA SANDEEP.T LAXMAN MUSULURI VAMSI SHEKAR
Junglee


MARVEL STUDIOS
కెప్టెన్ అమెరికా
బ్రేవ్ న్యూ వరల్డ్
IN CINEMAS TODAY
IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU


BLOCKBUSTER LOVE TSUNAMI
GEETHA ARTS
ALLU ARAVIND
PRESENTS
తండేల్
2ND
WEEK
CHANDOO MONDETI BUNNY VAS DEVI SRI PRASAD
TELUGU - TAMIL - HINDI



విలువలకు రూపం సంజీవయ్య

నేడు సంజీవయ్య 104వ జయంతి

దామోదరం ప్రస్థానం స్ఫూర్తిదాయకం

పేదల బిడ్డను వెతుక్కొంటూ వచ్చిన పదవులు

ఒకసారి ఎమ్మెల్యేగా గెలిస్తే పదితరాలకు తరగని ఆస్తి పోగేసుకుంటున్న రోజులివి! నేతలంటే మేతలే... అనే అభిప్రాయం బలపడిన కాలమిది. కానీ, ఆయనను పదవులు వెతుక్కొంటూ వచ్చాయి. ప్రధానమంత్రుల నుంచి ముఖ్యమంత్రుల వరకు ఆయనను ఏరికోరి కేబినెట్‌లో చేర్చుకున్నారు. దేశంలోనే తొలి దళిత సీఎంగా కీర్తినీ ఆయన ఆర్జించారు. కానీ, ఆర్థికంగా ఆర్జించింది లేదు. స్వగ్రామంలో ఆయన తల్లి చివరివరకు కట్టెల పొయ్యి మీదే వంట చేసి తాను తిని, పదిమంది ఆకలి తీర్చింది. ఆయన ఎవరో కాదు...విలువలకు రూపంగా, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన దామోదరం సంజీవయ్య. నేడు (శుక్రవారం) ఆయన 104వ జయంతి. సంజీవయ్య జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సంజీవయ్యకు సీఎం చంద్రబాబు పుష్పాంజలి ఘటించనున్నారు.

అధికారికంగా జయంతి వేడుకలు

అమరావతిలో సంజీవయ్యకు పుష్పాంజలి ఘటించనున్న సీఎం చంద్రబాబు

కర్నూలు నగరంలో నేడు అంతర్భాగంగా ఉన్న కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో ఓ సామాన్య నిరుపేద దళిత కుటుంబంలో 1921 ఫిబ్రవరి 14న దామోదరం సంజీవయ్య జన్మించారు మునెయ్య, సుంకలమ్మ దంపతులకు ఆయన ఐదో సంతానం. కూలి పనులకు వెళ్తే తప్ప పూట గడవని కుటుంబం వారిది. జీవనాధారం కోసం పశువులు కాయడం, కూలి పనులకు వెళ్లడం, పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేయడం, ఖాళీ సమయాల్లో చేనేత వస్త్రాలు విక్రయించేవారని అప్పటి పెద్దల ద్వారా తెలుసుకున్నామని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. ఆయన జన్మించేనాటికి ఇంట్లో అందరూ నిరక్షరాస్యులే. అయితే, సంజీవయ్యకు చదువు పట్ల అమిత ఆసక్తి. అది గుర్తించిన అన్న చిన్నయ్య, మేనమామల ప్రోత్సాహంతో సంజీవయ్య చదువులో ఒక్కో మెట్టు ఎక్కారు. బ్రిటిష్ పాలనలో పలు ప్రభుత్వ ఉద్యోగాలు చేశారు. కేంద్ర ప్రజా పనుల తనిఖీ అధికారిగా పని చేస్తుండగా న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ కృష్ణయ్యతో పరిచయం అయింది ఆయన ప్రోత్సాహంతో మద్రాస్‌లో న్యాయవిద్యను అభ్యసించారు. గణపతి శాస్త్రి, జాస్తి రామలక్ష్మమ్మ దగ్గర జూనియర్‌గా పనిచేశారు. 1950లో భారత్ గణతంత్ర దేశంగా ఆవిర్భావం తర్వాత ఒక వ్యక్తికి ఒకే పదవి అనే నిబంధన వచ్చింది. కర్నూలుకు చెందిన సర్దార్ నాగప్ప ఎమ్మెల్యే, ఎంపీ రెండు పదవుల్లో ఉండగా.. ఎమ్మెల్యే పదవి ఉంచుకుని ఎంపీ పదవికి ఆయన రాజీనామా చేశారు. ఆ సీటు ఎస్సీ రిజర్వుడు కావడంతో, రామలక్ష్మమ్మ సిఫారసుతో ఆ పదవి సంజీవయ్యను వరించింది. 1952లో ఎమ్మెల్యేగా గెలిచి రాజాజీ కేబినెట్‌లో చేరారు. అప్పటికి ఆయన వయసు 31ఏళ్లే. ఆంధ్ర రాష్ట్రం తొలి సీఎం ప్రకాశం పంతులు కేబినెట్‌లోను, బెజవాడ గోపాలరెడ్డి కేబినెట్‌లోను, ఉమ్మడి ఏపీ తొలి సీఎం నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలోను బాధ్యతలు చేపట్టారు. ప్రధానులు నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రివర్గంలో పనిచేశారు. నెహ్రూ, ఇందిర హయాంలో రెండు పర్యాయాలు ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించారు. నీలం సంజీవరెడ్డి కొన్ని కారణాలతో 1960లో పదవి కోల్పోయారు. నీలం స్థానంలో అప్పటి కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంజీవయ్యను ముఖ్యమంత్రిగా నియమించింది. ఓ దళిత నాయకుడు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవడం దేశంలోనే అది ప్రథమం. 1960-1962 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఉపాధ్యాయురాలు కృష్ణవేణితో 1954 మే7న సంజీవయ్య వివాహం జరిగింది. ఆయన 1967 ఎన్నికల ప్రచారంలో రోడ్డు ప్రమాదానికి గురై.. దీర్ఘకాలంగా కోలుకోలేకపోయారు. 1972 మే7న ఢిల్లీలో గుండెపోటుతో మృతి చెందారు.





\- కర్నూలు, ఆంధ్రజ్యోతి

'కట్టెల పొయ్యి తీసేసి కిరోసిన్ పొయ్యి ఇస్తారా?'

సంజీవయ్య అంటే గిట్టని నాయకులు కొందరు, ఆయన అవినీతికి పాల్పడుతున్నారంటూ ప్రధాని నెహ్రూకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు ఓ వ్యక్తిని సంజీవయ్య సొంతూరు పెద్దపాడుకు నెహ్రూ పంపారు. అక్కడ ఓ చిన్న ఇంటి ముందు కారు ఆపి.. కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న ఓ వృద్ధురాలిని ఆ వ్యక్తి పలకరించారు. ఇంటి ముందు కారు ఆగడం. ... పెద్దమనిషి తనను కలవడంతో ఆమె ఉబ్బితబ్బిబ్బయ్యారు. 'నా కుమారుడికి ఏదైనా పెద్ద ఉద్యోగం ఇస్తున్నారా? మా అబ్బాయి జీతం పెరుగుతుందా? ఈ కట్టెల పొయ్యి తీసేసి కిరోసిన్ పొయ్యి కొనుక్కోవచ్చా..?' అంటూ ఆశగా అడిగారు. ఆమె ఎవరో కాదు.. అప్పటి రాష్ట్ర మంత్రి సంజీవయ్య తల్లి సుంకులమ్మ.



కర్నూలులోని పెద్దపాడులో దామోదరం సంజీవయ్య నివసించిన ఇల్లు

పాలనలో మేటి!

ఏసీబీ ఏర్పాటు: దామోదరం సంజీవయ్య తాను ముఖ్యమంత్రిగా ఉండగా, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని నిరోధించేందుకు అవినీతి నిరోధక శాఖను (ఏసీబీ) ఏర్పాటు చేశారు. సరోజినిదేవి కంటి ఆస్పత్రి, రవీంద్ర భారతి, లలితకళల అకాడమీ కూడా అప్పుడే నెలకొన్నాయి. **టీచర్లకూ పింఛన్:** అప్పట్లో ఉపాధ్యాయులకు పింఛను సౌకర్యం లేదు. బతకలేక బడి పంతులు అని.. బాధపడే రోజులవి. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పెన్షన్ ఇచ్చేవారు. సంజీవయ్య తన హయాంలో పెన్షన్ విధానాన్ని టీచర్లకు కూడా వర్తింపజేశారు.

ఆరు లక్షల బంజరు పంపిణీ: తన హయాంలో సంజీవయ్య ఆరు లక్షల ఎకరాల బంజరు భూములను పేదలకు పంచారు. హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం రెండు వేల ఎకరాలు భూ సమీకరణ ఆయన హయాంలో జరిగింది. **రిజర్వేషన్ కోటా పెంపు:** రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలకు 14 నుంచి 17 శాతానికి, బీసీలకు 24 నుంచి 33 శాతానికి పెంచారు. **తెలుగుకు పట్టం :** ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని ఉత్తర్వులు ఇచ్చారు. అంతర్జాతీయ తెలుగు రచయితల సమ్మేళనం నిర్వహించారు.

సాగు.. దారిలో : హంద్రీ నదిపై గాజులదిన్నె ప్రాజెక్టుకు(సంజీవయ్య సాగర్), నల్లమల అటవీ ప్రాంతంలో వరదరాజస్వామి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. పులిచింతల, వంశధార ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. **'బోనస్ సంజీవయ్య':** కేంద్ర పరిశ్రమలు, కార్మిక శాఖల మంత్రిగా, బోనస్ కమిషన్ సిఫారసులను అమలుచేసి కార్మికుల మదిలో 'బోనస్ సంజీవయ్య'గా ఖ్యాతి పొందారు. తన హయాంలో పలు సంస్కరణలు తెచ్చారు. ఒప్పంద కార్మికుల చట్టం, బాల కార్మిక చట్టం, రవాణా వాహన కార్మికులు చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, కార్మిక సంస్థల చట్టం, కనీస వేతనాలు చట్టం అమలులోకి తెచ్చారు.

'అంబేడ్కర్ గురుకులం'లో ప్రవేశాలు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలు, డా.బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ అయిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన 'బీఆర్ఏజీ సెట్-2025'కి నోటిఫికేషన్ వెలువడింది. ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుంది. 2025 మార్చి 6లోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాల కోసం https://apbragcet.ap-cfss.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

మార్చి 3న శాసనసభలో బడ్జెట్!

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26 బడ్జెట్‌ను మార్చి 3న అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఫిబ్రవరి 24న గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత వరుసగా సెలవులు వస్తున్నాయి. తిరిగి 28 నుంచి అసెంబ్లీ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌ను ముందు అనుకున్నట్టు ఫిబ్రవరి 28న కాకుండా మార్చి 3, సోమవారం చట్టసభల్లో ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.

రాత్రిళ్లు థియేటర్లలోకి పిల్లల ప్రవేశంపై.. సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోండి: టీ హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సినిమా థియేటర్లలోకి రాత్రి 11 తర్వాత.. ఉదయం 11 గంటలకు ముందు 16 ఏళ్లలోపు పిల్లలను అనుమతించకుండా నిషేధం విధించిన అంశంపై.. సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని, మధ్యంతర ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈమేరకు సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్న పిటిషన్లలో ఇంప్లీడ్ అవ్వాలని మల్టీప్లెక్స్ యాజమాన్యాల సంఘానికి డివిజన్ బెంచ్ సూచించింది. ఇటీవల పుష్ప-2 తొక్కిసలాట, గేమ్ ఛేంజర్ సినిమాకు స్పెషల్ షోకు అనుమతి ఇవ్వడంపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఏకసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాత్రి 11 గంటల తర్వాత పిల్లల ప్రవేశంపై హోంశాఖ ముఖ్యకార్యదర్శి అన్ని వర్గాలతో చర్చించి ఒక నిర్ణయానికి రావాలని.. అప్పటి వరకు పిల్లల ప్రవేశంపై నిషేధం విధిస్తున్నామని పేర్కొంది. దీన్ని మల్టీప్లెక్స్ యజమాన్యాల సంఘం డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది.

తెలంగాణకు ఏఐ డబుల్ ఇంజన్!

» రాష్ట్రంతో చేతులు కలిపిన మైక్రోసాఫ్ట్, గూగుల్

హైదరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో శిక్షణ, సాంకేతిక సహకారం అందించేందుకు రెండు ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు మైక్రోసాఫ్ట్, గూగుల్ సిద్ధమయ్యాయి. ఈ మేరకు రెండు కంపెనీలతో గురువారం రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నిర్మించిన భవనం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఒక ఒప్పందం కుదరగా, టీ హబ్‌లో సీఎం సమక్షంలోనే జరిగిన మరో కార్యక్రమంలో గూగుల్‌తో మరో ఒప్పందం చేసుకున్నారు. ఈ రెండు సందర్భాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. టెక్నాలజీ రంగంలో భారీ ఉద్యోగ అవకాశాలకు కృత్రిమ మేధ అత్యంత కీలకం కాబోతుందని చెప్పారు.

బీసీ సబ్‌ప్లాన్‌పై మానిటరింగ్ కమిటీ

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పలు శాఖల్లో అమలు చేసే బీసీ సబ్‌ప్లాన్‌ను పర్యవేక్షించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ఏపీలో జలాశయాల పునరుద్ధరణకు 2.70 కోట్లే!

» గత పదేళ్లలో తెలంగాణకు 104 కోట్లు: లోక్‌సభలో కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జలశయాల మరమ్మతులు, ఆధునికీకరణ, పునరుద్ధరణ కోసం కేంద్ర సాయం కింద గత పదేళ్లలో రూ.2.70 కోట్లు ఇచ్చామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. గురువారం, లోక్‌సభలో బీజేపీ తెలంగాణ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. 2018-19లో ఏపీకి రూ.2.70 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. తెలంగాణకు గత పదేళ్లలో రూ.104.76 కోట్లు విడుదల చేశామని తెలిపారు.

ఏపీ హైకోర్టులో 7 జడ్జి పోస్టులు ఖాళీ

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీల ఏడు ఉన్నాయని, తెలంగాణలో 12 ఖాళీలు ఉన్నాయని, వీటిని భర్తీ చేయాల్సి ఉందని కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో 365 మంది న్యాయమూర్తుల ఖాళీలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఏపీలో 21 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయని, తెలంగాణలో ఒక ఫాస్ట్ ట్రాక్ కోర్టు కూడా లేదని వెల్లడించారు.

పీఎంఏవై-యూ కింద ఏపీలో 10 లక్షల ఇళ్లు పూర్తి

ప్రధాన మంత్రి పట్టణ ఆవాస్ యోజన(పీఎంఏవై-యూ) కింద ఏపీకి 21.37 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు కేంద్ర గృహనిర్మాణ సహాయ మంత్రి టోఖన్ సాహు తెలిపారు. గురువారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 21.37 లక్షల ఇళ్లకు గానూ 18.60 లక్షల ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని 10.31 లక్షల ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు.

కొత్తగా ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్లకు అనుమతివ్వలేదు

గత ఐదేళ్లలో ఏపీలో ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్ల ఏర్పాటు కోసం 25కు పైగా ప్రతిపాదనలు అందాయని కేంద్ర ఆహార శుద్ధి, పరిశ్రమల సహాయ మంత్రి రవ్‌నీత్‌సింగ్ తెలిపారు. గురువారం, లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని అడిగిన ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో ఏడు ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్ల ఏర్పాటుకు అనుమతిచ్చామని తెలిపారు.

ఉప రాష్ట్రపతితో ఎంపీ సానా సతీశ్ భేటీ

టీడీపీ తరఫున రాజ్యసభకు ఎంపికైన ఎంపీ సానా సతీశ్ బాబు గురువారం రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభా వ్యవహారాలు, కొన్ని బిల్లులు, భవిష్యత్ కార్యాచరణ చర్చకు వచ్చిందని, ఇటీవల రాజ్యసభలో తాను చేసిన తొలిప్రసంగాన్ని మెచ్చుకున్నారని ఎంపీ సానా తెలిపారు.

ఏపీ భవన్‌లో నిధుల దుర్వినియోగం: దినకర్

గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఏపీభవన్‌లో కొనసాగుతున్న కొందరు అధికారులు ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని ఏపీ 20సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగంపై విచారణకు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తానని చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని ముంచి, సంక్షేమం ముసుగులో వైసీపీ నేతలు వనరులు దోచేశారని అన్నారు.

గుంటూరులో జీబీఎస్ కలకలం

» ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏడు కేసులు

» ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం..

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు పెద్దసంఖ్యలో వెలుగు చూడటం కలకలం రేపుతోంది. ఏడుగురు బాధితులు జీబీఎస్ బారిన పడి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఒకరిని వెంటిలేటర్‌పై, మరొకరిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన ఐదుగురు సాధారణ వార్డులో ఉన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని పుణెలో ఏకంగా 172 జీబీఎస్ కేసులు వెలుగు చూసిన నైజం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. వీరిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణలో కొన్ని కేసులు వెలుగు చూశాయి. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో పదేళ్ల బాలుడు జీబీఎస్‌తో మృతిచెందడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో జీబీఎస్ కేసులు వెలుగు చూడటం చర్చనీయాంశంగా మారింది. కాళ్లు చేతులు చచ్చుబడటం, సరిగా ఊపిరి తీసుకోలేకపోవడం, గొంతు మింగుడు పడకపోవడం తదితర లక్షణాలు ఈ రోగుల్లో కనిపిస్తాయి.

దర్యాప్తునకు సహకరించండి

» చైతన్యరెడ్డి, డీఎస్పీ నాగరాజు, సీఐ ఈశ్వరయ్యకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): షేక్ దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై కడప రిమ్స్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ దేవిరెడ్డి చైతన్యరెడ్డి, అప్పటి పోలీస్ అధికారులు డీఎస్పీ ఎస్.నాగరాజు, సీఐ ఈశ్వరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పాణిని సోమయాజి స్పందిస్తూ వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని, కేసు వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి పిటిషనర్లపై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని గుర్తుచేశారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలు పాటించాలని, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించారు. దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్లకు స్పష్టం చేశారు. విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేశారు. ఫిర్యాదుదారుడు దస్తగిరికి నోటీసులు జారీ చేశారు.

రజని కేసు వివరాలు మా ముందు ఉంచండి: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణ పోలీసులు నమోదు చేసిన అట్రాసిటీ, ఇతర కేసులు కొట్టివేయాలని కోరుతూ వైసీపీ మాజీ మంత్రి విడదల రజని, పీఏలు నాగెశెట్టి జయ ఫణీంద్ర, రామకృష్ణ దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. చిలకలూరిపేట నియోజకవర్గం టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బీఎన్ఎస్ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి అభ్యర్థన మేరకు విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని వాటాల బదలాయింపు వ్యవహారంలో విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనల కోసం విచారణను హైకోర్టు ఈ నెల 18కి వాయిదా వేసింది. గురువారం వ్యాజ్యం విచారణకు రాగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ స్పందిస్తూ.. ఏజీ మరో బెంచ్ ముందు వాదనలు వినిపిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో విచారణను మరో రోజుకు వాయిదా వేయాలని అభ్యర్థించారు. ఈ దశలో పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ పదేపదే వాయిదా కోరుతున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువైపులా వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి అడ్వకేట్ జనరల్ వాదనల కోసం విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఆ రోజు వాదనలు వినిపించకుంటే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేశారు.

ఉద్యోగంలో చేరిన తేదీ ప్రామాణికంగా సీనియార్టీ

» ఖరారు చేయాలని హోంశాఖకు, డీజీపీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీగా పదోన్నతి కల్పించే విషయంలో ఉద్యోగంలో చేరిన తేదీని ప్రామాణికంగా తీసుకొని 1995 బ్యాచ్‌కు చెందిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ వై.వెంకటేశ్వర్లు సీనియార్టీని ఖరారు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ ప్రక్రియను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. 1995 బ్యాచ్ ఎస్ఐలతో 1996లో నియమితులైన సబ్ ఇన్‌స్పెక్టర్లను కలిపి, వారి సీనియార్టీని ఖరారు చేస్తూ హోంశాఖ 2018 అక్టోబర్ 5న జారీచేసిన జీవో 153 (2014 నాటి జీవో 54ను సవరిస్తూ)ను రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. పిటిషనర్ అయిన ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తరఫు న్యాయవాది పీవీ వెంకట రవిశంకర్ వాదనలు వినిపిస్తూ.. 1995 బ్యాచ్‌ను పక్కన పెట్టి 1996 బ్యాచ్ అధికారులతో డీఎస్పీ పదోన్నతికి జాబితాను సిద్ధం చేశారన్నారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పై మేరకు తీర్పునిచ్చారు.

భూములు, ఆస్తులు, వివాహ రిజిస్ట్రేషన్లకూ

ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్

» వినియోగదారులకు తప్పనున్న తిప్పలు

» స్లాట్ బుకింగ్‌కు నో ఫీజు.. మార్గదర్శకాలు జారీ


అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆస్తులు, వివాహాల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు గంటల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పనిలేకుండా ప్రభుత్వం ఆన్‌లైన్ క్యూ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమల్లోకి తెస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం భూములు, ఆస్తులు, వివాహాల రిజిస్ట్రేషన్లకు తప్ప మిగిలిన రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూ నిర్వహణ సరిగ్గా లేక.. ముందొచ్చిన వారికి ముందుగా రిజిస్ట్రేషన్ జరగడం లేదు. దీంతో కంప్యూటర్ ఆధారిత క్యూ నిర్వహణ విధానాన్ని తీసుకొచ్చారు. రిజిస్ట్రేషన్ కోసం వినియోగదారుడికి ముందుగానే టైమ్ స్లాట్ ఇస్తారు. ఆ సమయానికి వస్తే సరిపోతుంది. అయితే ఈ విధానంలో జరిగే రిజిస్ట్రేషన్లు పరిమితంగా ఉంటాయి. పరిమితి దాటి వచ్చిన స్లాట్ బుకింగ్ ప్రతిపాదనలను తర్వాతి రోజుకు మార్చుతారు.

ఇవే మార్గదర్శకాలు..

- వెబ్‌పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వినియోగదారులు ఆన్‌లైన్ ఫారంలో వివరాలు నింపడం ద్వారా సేవలు పొందవచ్చు. ఫారం నింపిన తర్వాత అప్లికేషన్ ఐడీ వస్తుంది. ఆ ఐడీ ఆధారంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి, రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని, ఆ సమయానికి కార్యాలయానికి వెళ్లాలి.
- వెబ్‌పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ప్రజలు వారికి కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవాలి. అప్పుడు, క్యూఆర్ కోడ్‌తో ఒక టోకెన్ వస్తుంది. ఆ క్యూఆర్ కోడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి కూడా చేరుతుంది.
- రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవడానికి ఎలాంటి ఫీజూ చెల్లించక్కర్లేదు. కానీ, స్లాట్ రద్దు చేసుకుంటే రూ.100 చెల్లించాలి. రద్దు చేసుకున్న స్లాట్‌ను మళ్లీ బుక్ చేసుకుంటే రూ.200 ఫీజు చెల్లించాలి.
- సెలవు రోజుల్లో కూడా రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చు. సెలవు రోజుకు ముందు రోజు సాయంత్రం 5 గంటల్లోగా స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈసదుపాయం ప్రస్తుతం జిల్లా హెడ్‌క్వార్టర్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే అందుబాటులో ఉంది. తదుపరి డిమాండ్ మేరకు అన్ని కార్యాలయాలకూ విస్తరిస్తారు. సెలవురోజున రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకుంటే ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవో నంబర్ 463 ప్రకారం రూ.5,000 ఫీజు చెల్లించాలి.
- ప్రజలే నేరుగా ఆన్‌లైన్‌లో ఫారం నింపి డేటా ఎంట్రీ చేయడంతో పాటు, ఎనీవేర్ విధానంలో స్లాట్ బుక్ చేసుకోవాలనుకుంటే, రిజిస్ట్రేషన్ తేదీ ముందు రోజు సాయంత్రం 4 గంటల కల్లా రిజిస్ట్రేషన్ చేయాల్సిన ఆస్తి ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉందో వారికి పంపాలి.

కృష్ణా జలాల వివాదంపై 27న సుప్రీం విచారణ

25లోగా క్లుప్తంగా వివరాలివ్వాలని ఆదేశం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై తలెత్తిన వివాదంపై ఈ నెల 27న విచారణ జరుపుతామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సుదీర్ఘ వాదనలు వినాల్సి ఉందని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపకానికి సంబంధించి కేంద్రం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. విభజన చట్టంలోని సెక్షన్-3 ప్రకారం ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ చేపట్టాలని ఆదేశించింది. అయితే ఈ మార్గదర్శకాలను రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023 అక్టోబరు 17న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేంద్ర నిర్ణయంతో తమకు తీవ్ర నష్టం కలిగే అవకాశముందని పిటిషన్‌లో పేర్కొంది. నదీ జలవివాద చట్టం ప్రకారం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఇలా అదనపు అంశాలను పరిశీలించే అధికారం లేదని తెలిపింది. విభజన చట్టం ప్రకారం నీటి కేటాయింపులకు రక్షణ ఉందని, ఇప్పటికే సెక్షన్ 89 ఏ, బీ అంశాల కింద ఆ ట్రిబ్యునల్ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటిని ప్రాజెక్టుల వారీగా కేటాయించే అంశం పరిశీలిస్తుండగా.. కొత్త అంశాలు చేర్చడం తగదని పేర్కొంది, ఈ వ్యాజ్యం గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ నెల 19 నుంచి కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు జరగాల్సి ఉందని, ఈ నేపథ్యంలో త్వరగా తమ వాదనలు వినాలని ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాదులు కోరారు. వాదనలు వినిపించడానికి ఎంత సమయం పడుతుందని ధర్మాసనం ప్రశ్నించగా.. రెండు గంటలకుపైగా పడుతుందని వారు తెలిపారు. అయితే.. ప్రస్తుతం అంత సమయం లేనందున ఈ నెల 27న వాదనలు వింటామని, 25లోపే అన్ని అంశాలపై క్లుప్తంగా వివరాలు సమర్పించాలని అన్ని పక్షాలనూ ధర్మాసనం ఆదేశించింది.

రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఏడుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధానర్చకులు సీఎస్ రంగరాజన్‌పై జరిగిన దాడికి సంబంధించిన కేసులో మరో ఏడుగురిని అరెస్టు చేశామని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం ప్రకటించారు. అరెస్టయిన వారిలో ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేవిరెడ్డి వీరబాబు, రేగన మూర్తి, జనపాల గోవిందరావు, లక్కోజి వెంకటరమణ, ముప్పిడి వెంకటరమణ, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముత్యాల వెంకటేశ్వర్లు, కోపెల లక్ష్మణరావు ఉన్నారు. దీంతో ఈ కేసులో ఇప్పటిదాకా అరెస్టయిన వారి సంఖ్య 14కు చేరింది. ప్రధాన నిందితుడు వీర రాఘవ రెడ్డి సహా ఏడుగురిని ఈ నెల 8న పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. రామరాజ్యం అనే సంఘానికి చెందిన వీర రాఘువ రెడ్డి సహా 22 మంది ఫిబ్రవరి 7న సీఎస్ రంగరాజన్ ఇంటికి వెళ్లారు. తమ సైన్యంలోకి మనుషులను చేర్పించాలని, ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇందుకు రంగరాజన్ తిరస్కరించడంతో ఆయనపై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన బయటకు రావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. మొత్తం 22 మంది నిందితుల్లో 14 మంది అరెస్టవ్వగా మిగిలిన ఎనిమిది మంది పరారీలో ఉన్నారు.

పథకం ప్రకారమే నాటి దాడి

బూతులవర్షంతో రెచ్చగొట్టిన వంశీ

- టీడీపీ నేతలను గన్నవరం రప్పించి రాళ్లవాన
- టీడీపీ కార్యాలయం ధ్వంసం...కార్ల దహనం
- అప్పట్లో టీడీపీ నేతలపైనే ఎదురుకేసులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, లోకేశ్‌పై పథకం ప్రకారం బూతులవర్షం! దీనికి నిరసనగా గన్నవరం టీడీపీ ఆఫీసులో సమావేశమైన నేతలపై ఆ మరునాడే రాళ్లవాన! వల్లభనేని వంశీమోహన్ స్వయంగా వేసిన స్కెచ్ ఇదీ! 2023 ఫిబ్రవరి 20వ తేదీన ఏం జరిగిందంటే... అప్పటికి కొన్ని రోజులుగా ప్రతిపక్ష నేత చంద్రబాబు, లోకేశ్‌ను లక్ష్యంగా చేసుకుని వంశీ మాటల దాడిని తీవ్రతరం చేశారు. అనకూడని మాటలు అన్నారు. దమ్ముంటే గన్నవరం వచ్చి తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఈ క్రమంలో దాడికి ఒక రోజు ముందు, అంటే 19వ తేదీన టీడీపీ మండల పార్టీ నేతలు గన్నవరం పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టారు. వంశీ వ్యాఖ్యలను దీటుగా ఖండించారు. దీనిని సహించలేకపోయిన వంశీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న నాయకులను ఆ మరుసటి రోజు టార్గెట్ చేశారు. ముందుగా గన్నవరం మండల టీడీపీ అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరరావుపై గురిపెట్టారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారంటూ దానిని తహసీల్దార్ స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా, అటుగా జాస్తి వెళ్లారు. ఇదంతా పథకం ప్రకారమే జరిగింది. మరోవైపు.. మండల పార్టీ నాయకుడు దొంతు చిన్నా ఇంటికి వంశీ అనుచరులు వెళ్లి నానా దుర్భాషలాడారు. చిన్నా అక్కడ లేకపోవటంతో దాడి జరగలేదు. ఈ విషయం తెలుసుకున్న జాస్తి వెంకటేశ్వరరావు పోలీసులకు వంశీ, అనుచరులపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇదే పని మీద టీడీపీ ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభికి ఫోన్ చేసి పిలిపించారు. పట్టాభితో కలిసి టీడీపీ నేతలంతా పోలీసు స్టేషన్‌కు ఆ రోజు సాయంత్రం చేరుకున్నారు. ఇదే అదునుగా.. గన్నవరంలోని టీడీపీ ఆఫీసుపై వంశీ అనుచరులు, వైసీపీ మూకలు దాడి చేశారు. కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను భయపెట్టి బయటకు పంపించివేసి, విధ్వంసకాండను యథేచ్ఛగా సాగించాయి. దీనికోసం బయట ప్రాంతాల నుంచి రౌడీలను వంశీ తెప్పించారు.

రాళ్ల వాన.. సీఐకి గాయాలు

పోలీసు స్టేషన్‌లో ఉన్న టీడీపీ నేతలు దాడి విషయం తెలుసుకుని, పార్టీ కార్యాలయానికి బయలుదేరారు. టీడీపీ కార్యకర్తలు భారీఎత్తున తమ నాయకులను అనుసరించారు. ఈక్రమంలో ఎన్‌హెచ్ - 16 పై టీడీపీ శ్రేణులను వైసీపీ మూకలు, రౌడీ గ్యాంగులు అడ్డుకున్నాయి. పట్టాభిని లక్ష్యంగా చేసుకుని దాడికి విఫలయత్నం చేశాయి. టీడీపీ నాయకులు పట్టాభిని హడావిడిగా కారు ఎక్కించి పంపించే ప్రయత్నం చేయగా, అదే కారులోకి పోలీసులు ఎక్కారు. పట్టాభిని వారు అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా, టీడీపీ కార్యకర్తలు గట్టిగా ప్రతిఘటించారు. ఇంతలో టీడీపీ నేతలపై వైసీపీ మూకలు రాళ్లవర్షం కురిపించాయి. ఈ దాడిలో టీడీపీ మహిళా నాయకురాలు మండవ లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. గొడవ జరుగుతుండగానే పట్టాభిని పోలీసులు అదే కారులో వీరవల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఈ క్రమంలో ఎవరు విసిరారో తెలియదు కానీ ఒక రాయి స్థానిక సీఐ కనకారావు తలకు తగిలింది.

టీడీపీ నాయకులపై ఎదురు కేసులు...

రౌడీలు, వైసీపీ మూకల దాడిలో దెబ్బలు తిన్న టీడీపీ నాయకులపైనే పోలీసులు ఎదురు కేసులు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక - టీడీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి అప్పటి ప్రత్యక్ష సాక్షిగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ ద్వారా కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో మొత్తం 93 మందిని నిందితులుగా తేల్చారు. ఈ కేసును 2024 నవంబరు 16న సీఐడీకి అప్పగించారు. మొత్తం 93 నిందితుల్లో 49 మందిని అరెస్టు చేశారు. మరో 31 మంది సుప్రీంకోర్టుకు వెళ్లి అరెస్టు కాకుండా ఊరట పొందారు. ఇంకా 13 మందిని అరెస్టు చేయాల్సి ఉండగా.. వారంతా అజ్ఞాతంలో ఉన్నారు. కేసు విచారణ కీలక దశలో ఉన్న తరుణంలో సత్యవర్ధన్ కోర్టుకు హాజరై తాను ఫిర్యాదును ఉపసంహరించుకుంటున్నానని వాంగ్మూలం ఇవ్వటం సంచలనం సృష్టించింది. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారన్న అభియోగంపై వంశీని పోలీసులు అరెస్టు చేశారు.



హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే వంశీకి నోటీసులు ఇస్తున్న పోలీసులు



విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్ వద్ద వంశీ



వైద్య పరీక్షల కోసం వంశీని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చిన పోలీసులు

వంశీ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

కొమ్మా కోట్లు, రామకృష్ణ, నీరజ్ తదితరులను నిందితులుగా చేర్చారు.

ఇలా అరెస్టు...

బెదిరింపులు, కిడ్నాప్ కేసులో వంశీ అరెస్టు కోసం అదనపు డీసీపీ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విజయవాడ నుంచి బుధవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లింది. వీరు గురువారం ఉదయం 6.30 గంటలకు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. గచ్చిబౌలి మైహోం భుజాలో నివసిస్తున్న వల్లభనేని వంశీని అరెస్టు చేయాల్సి ఉందని, తమకు ఎస్కార్ట్ ఇవ్వాలని కోరారు. కేసు వివరాలను వారికి తెలిపారు. దీంతో... రాయదుర్గం ఠాణా నుంచి ఒక ఎస్‌ఐతోపాటు మరో ఐదుగురు పోలీసులు విజయవాడ పోలీసులకు తోడుగా వచ్చారు. నేరుగా... మైహోమ్ భూజా డి బ్లాక్‌లో 11వ అంతస్తులో ఉంటున్న వంశీ ఫ్లాట్ వద్దకు చేరుకున్నారు. "సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించారనే ఆరోపణలతో మీపై పటమట పోలీసు స్టేషన్‌లో భారత న్యాయ సంహిత లోని సెక్షన్లు 140 (1), 308, 351(3), రెడ్‌విత్3(5)తో పాటు సెక్షన్ 3(2) ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదైంది. క్రైమ్ నంబర్ 86/2025 కేసులో మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం" అంటూ వంశీకి నోటీసు ఇచ్చారు. దాన్ని చదివిన తర్వాత పోలీసులతో వంశీ కొద్దిసేపు వాదనకు దిగారు. ఆ తర్వాత ఎక్కువ హడావుడి చేయకుండానే పోలీసుల వెంట వచ్చేందుకు అంగీకరించారు. గురువారం ఉదయం 7 గంటలకల్లా వంశీ అరెస్టు ప్రక్రియ ముగిసింది. పటమట పోలీసులు ఉదయం 7.15 గంటలకు వంశీతోపాటు రోడ్డు మార్గంలో విజయవాడకు బయలుదేరారు. మధ్యాహ్నం 12.40 గంటలకు భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ వంశీని మరో వాహనంలోకి మార్చారు. ఆయనను పటమట పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తారని కొంతసేపు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తీసుకెళ్తారని మరికొంతసేపు ప్రచారం జరిగింది. అయితే.. ఎవరూ ఊహించనట్టుగా వంశీని మధ్యాహ్నం 1.10 గంటలకు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

తెలియదు... తెలియదు...

కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో వంశీని నలుగురు అధికారులు ఎనిమిది గంటలపాటు సుదీర్ఘంగా విచారించారు. "సత్యవర్ధన్ జోలికి ఎందుకు వెళ్లారు? అతడిని ఎలా ట్రాప్ చేశారు?"... అంటూ పలు కోణాల్లో ప్రశ్నలు సంధించారు. వాటన్నింటికీ 'తెలియదు... తెలియదు' అని ఆయన సమాధానం ఇచ్చినట్టుగా తెలుస్తోంది. అనంతరం రాత్రి 9.15 గంటలకు వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు ముగిసిన అనంతరం రాత్రి 10.15 గంటల సమయంలో ఆయనను 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయాధికారి రామ్మోహన్ ముందు హాజరు పరిచారు. ఇదే కేసులో అరెస్టు చేసిన ఏ7, ఏ8 ఏలినేని శివరామకృష్ణ ప్రసాద్, నిమ్మ లక్ష్మీపతిలను కూడా కోర్టుకు తీసుకొచ్చారు. మరో నిందితుడు, వంశీ వ్యక్తిగత సహాయకుడు వీర్రాజు కోర్టుకు వచ్చి స్వయంగా లొంగిపోయారు. నిందితుల తరఫున మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, చిరంజీవి... పోలీసుల తరఫున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేంద్రప్రసాద్, పీపీ సమీర వాదనలు వినిపించారు. రిమాండ్‌పై అర్ధరాత్రి తర్వాత కూడా వాదనలు కొనసాగుతూనే ఉన్నాయి.

మలుపు మీద మలుపు

వైసీపీ అధికారంలో ఉండగా... 2023 ఫిబ్రవరిలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ కార్యకర్తలు మూకదాడికి దిగారు. విధ్వంసం సృష్టించారు. వాహనాలు తగలబెట్టారు. ఈ కేసులో అప్పటి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత... పార్టీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న సత్యవర్ధన్ ఫిర్యాదు మేరకు చర్యలు మొదలయ్యాయి. మొత్తం 88మందిపై కేసు పెట్టగా వంశీని ఏ71గా చేర్చారు. అయితే... ఈనెల 10న విషయం కీలక మలుపు తిరిగింది. 'నాకేం తెలియదు. ఆ కేసుతో నాకు సంబంధంలేదు. ఫిర్యాదు వాపసు తీసుకుంటున్నా' అంటూ సత్యవర్ధన్ అఫిడవిట్ దాఖలు చేశారు. దీంతో పోలీసులు, టీడీపీ నేతలు కంగుతిన్నారు. అసలేం జరిగిందని ఆరా తీశారు. వంశీ అనుచరుడి కారులోనే సత్యవర్ధన్‌ను కోర్టుకు తరలించినట్లు గుర్తించారు. అదే సమయంలో ఆయన సోదరుడు కిరణ్ కూడా వంశీ పై ఫిర్యాదు చేశారు.

నొటోరియస్ క్రిమినల్!

- రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి

విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): "వల్లభనేని వంశీ నొటోరియస్ క్రిమినల్. ఆయనకు చాలా నేర చరిత్ర ఉంది. చట్టం, న్యాయం అంటే లెక్కే లేదు. ఆయనపై 16 క్రిమినల్ కేసులు ఉన్నాయి".. అని పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. "గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనపై సత్యవర్ధన్ ఫిర్యాదు మేరకు వంశీ తదితరులపై కేసు నమోదైంది. ఫిర్యాదు వాపస్ తీసుకోవాల్సిందిగా అప్పటి నుంచే ఆయనపై ఒత్తిళ్లు వస్తున్నాయని సత్యవర్ధన్ సోదరుడు కిరణ్ స్పష్టం చేశారు. కేసు వాపసు తీసుకుంటే డబ్బులు ఇస్తామని... ఒప్పుకోకుంటే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. 'పెద్దవాళ్లతో ఎందుకు పెట్టుకుంటారు' అని వజ్ర కుమార్ అనే వ్యక్తి చాలాసార్లు పరోక్షంగా హెచ్చరించారని... కొమ్మా కోటి, రామకృష్ణ, వీర్రాజు తదితరులు తన సోదరుడిని, తల్లిదండ్రులనూ బెదిరించారని కిరణ్ తెలిపారు. ఈనెల 10వ తేదీన తన సోదరుడిని బలవంతంగా కారులో తీసుకెళ్లారని ఫిర్యాదు చేశారు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి... మొత్తం నాలుగు బృందాలతో నిందితుల కోసం గాలింపు మొదలుపెట్టాం. 13వ తేదీన ఏ1 వల్లభనేని వంశీని హైదరాబాద్‌లో అరెస్టు చేశాం. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఫిర్యాదుకు సంబంధించి పొట్టి రాము (ఏ9)ను కలవాల్సిందిగా వల్లభనేని వంశీ తనపై ఒత్తిడి తెచ్చారని సత్యవర్ధన్ వాంగ్మూలం ఇచ్చారు. "మాజీ ఎమ్మెల్యేగా, బాగా పలుకుబడి ఉన్న వ్యక్తిగా వంశీ ఏమైనా చేయగలరు. ఆయన ఆదేశాల మేరకు పొట్టి రాము నన్ను హనుమాన్ జంక్షన్‌కు తీసుకెళ్లారు. కేసు వాపసు తీసుకుంటున్నట్లు రాసిన వాంగ్మూలంపై బెదిరించి సంతకం చేయించారు. ఆ తర్వాత... ఏపీ 40 బీజీ 5005 క్రెటా కారులో నన్ను బలవంతంగా కోర్టుకు తీసుకెళ్లారు. అక్కడ వాంగ్మూలం ఇప్పించారు" అని సత్యవర్ధన్ తెలిపారు. 10వ తేదీ అర్ధరాత్రి సత్యవర్ధన్‌ను హైదరాబాద్‌లోని మైహోం భుజాలో ఉన్న వల్లభనేని వంశీ వద్దకు తీసుకెళ్లారు. కేసు వాపసు తీసుకుంటూ మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలానికి కట్టుబడి ఉండాలని మళ్లీ బెదిరించారు. తీవ్రంగా హింసించారు. తేడా వస్తే కుటుంబ సభ్యులనూ చంపేస్తామన్నారు. మరుసటి రోజున... వంశీ ఆదేశాల మేరకు నలుగురు నిందితులు సత్యవర్ధన్‌ను కారులో విశాఖ పట్నం తీసుకెళ్లారు. అక్కడ హోటల్ చందనలో బస చేశారు. 12వ తేదీన ఏ11కు చెందిన గెస్ట్‌హౌస్‌కు మకాం మార్చారు. సత్యవర్ధన్ విశాఖపట్నంలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లాం. ఆరిలోవ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించి... దేవ దుర్గ శివ రామకృష్ణ, నిమ్మల లక్ష్మీపతి అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని... సత్యవర్ధన్‌ను రక్షించాం. ఆయనను విజయవాడకు తీసుకు వచ్చాం" అని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. వంశీతోపాటు మిగిలిన ఇద్దరు నిందితులను 15 రోజులు రిమాండ్‌కు పంపించాలని కోరారు.

కిరణ్ ఫిర్యాదులో ఏముందంటే...

సత్యవర్ధన్ సోదరుడు కిరణ్ ఈనెల 12వ తేదీన పటమట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఇది... "నా తమ్ముడు సత్యవర్ధన్ 2022 అక్టోబరులో గన్నవరం టీడీపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా చేరాడు. 2023 ఫిబ్రవరి 20వ తేదీన పార్టీ ఆఫీసుపై వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడి చేశారు. ఆ సమయంలో సత్యవర్ధన్ అక్కడే విధుల్లో ఉన్నాడు. వైసీపీ కార్యకర్తలు నా తమ్ముడిని కూడా కులం పేరుతో దూషించారు. పార్టీ ఆఫీసుకు, అక్కడ ఉన్న వాహనాలకు నిప్పంటించారు. గన్నవరం పోలీసు స్టేషన్‌లో నా తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో వల్లభనేని వంశీ, ఆయన అనుచరులు ముద్దాయిలుగా ఉన్నారు. ఈ కేసులో రాజీకి రావాలని, లేదంటే చంపేస్తామని అప్పటి నుంచే నా తమ్ముడిని బెదిరిస్తున్నారు. రాజీకి ఒప్పించకపోతే చంపేస్తామని నన్ను, నా తల్లిదండ్రులను కూడా బెదిరించారు. నా తమ్ముడికి ప్రాణభయం ఉండటంతో ఏడాదిన్నర కిందట అతడిని హైదరాబాద్‌లోని మా పిన్ని ఇంటికి పంపించాం. ఈనెల 7వ తేదీన నా తమ్ముడు కుటుంబ పనిమీద విజయవాడకు వచ్చాడు. 10వ తేదీన అతనికి ఎవరో వరుసగా ఫోన్లు చేశారు. 'భయంగా ఉంది... నాకు ఇంట్రెస్ట్ లేదు' అని అతను చెబుతూ వచ్చాడు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు సత్యవర్ధన్ ఇంటి నుంచి బయటికి వెళ్లి... తిరిగి రాలేదు. అతడి కోసం వెతుకుతుండగా... వంశీ అనుచరులైన కొమ్మా కోట్లు, భీమవరపు రామకృష్ణ, గంటా వీర్రాజు, మరికొందరు నా తమ్ముడిని బలవంతంగా కారులో తీసుకెళ్లినట్లు స్థానికంగా ఉండే ఫణి, జానీ చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం నా తమ్ముడిని కారులో కోర్టుకు తీసుకెళ్లి... గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనపై తెలుగుదేశం నేతలు బలవంతంగా తప్పుడు కేసు పెట్టించారని చెప్పించినట్లు తెలిసింది. నా తమ్ముడిని భయపెట్టి, బెదిరించి, దౌర్జన్యం చేసే ఇలా చెప్పించి ఉంటారు. ప్రాణభయంతోనే నా తమ్ముడు ఇలా చెప్పి ఉంటాడు. కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పించి, చంపివేయాలనే ఉద్దేశంతోనే సత్యవర్ధన్‌ను తీసుకెళ్లారని నా అనుమానం. వంశీ, కొమ్మా కోట్లు, భీమవరపు రామకృష్ణ, గంటా వీర్రాజు తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని... నా తమ్ముడిని రక్షించాలని కోరుతున్నాను."

సిట్ కస్టడీకి కల్తీ నెయ్యి కేసు నిందితులు

- ఐదు రోజులకు అనుమతించిన కోర్టు

తిరుపతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో నలుగురు నిందితులను శుక్రవారం నుంచి ఐదు రోజుల సిట్ కస్టడీకి అప్పగిస్తూ తిరుపతి రెండవ ఏడీఎం కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కల్తీ నెయ్యి కేసులో ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్, భోలే బాబా, వైష్ణవి డెయిరీల డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్, వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను ఈనెల 9వ తేదీన అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారు ప్రస్తుతం తిరుపతి సబ్ జైల్లో రిమాండులో ఉన్నారు. కీలక అంశాలపై వివరాలు రాబట్టేందుకు నిందితులను వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ అధికారులు ఈనెల 10న పిటిషన్ వేశారు. దీనిపై జడ్జి కోటేశ్వరరావు గురువారం విచారణ జరపగా.. సిట్ తరపున న్యాయవాది గోపి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశంకర్ వాదనలు వినిపించారు. రిమాండులో ఉన్న నలుగురూ ప్రధాన నిందితులని తెలిపారు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున.. వీరిని లోతుగా విచారించాల్సిన అవసరముందని విన్నవించారు. ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి.. ఈనెల 14వ తేదీ నుంచి ఐదు రోజులపాటు నిందితులను సిట్ కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతించారు.

అరాచకాలకు కేరాఫ్..!

వల్లభనేని వంశీ... ఆయన రూటే వేరు. పైకి మెత్తగా కనిపించినా లోపల అంతా కరకుదనమే. ఏ పని చేసినా చేతికి మట్టి అంటకుండా పకడ్బందీగా చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కూడా ఆయనే చేయించారని, ఆనాటి దాడి మొత్తం వంశీ స్క్రిప్ట్ ప్రకారమే జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ శాసనసభ్యుడిగా రెండుసార్లు గెలుపొందిన వంశీ.. ఆ పార్టీలో ఉన్నంతకాలం క్రమశిక్షణగానే ఉండేవారు. జగన్ పంచన చేరిన తర్వాత అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారు.



వల్లభనేని వంశీ రూటే సపరేటు

- జగన్‌తో స్నేహబంధం.. సొంత పార్టీకి నమ్మకద్రోహం
- చేతికి మట్టి అంటకుండా పని ముగించడం ప్రత్యేకత
- గన్నవరం నియోజకవర్గంలో అనుచరుల ఇష్టారాజ్యం
- అక్రమ మైనింగ్‌తో కొండలకు అడ్డగోలుగా గుండు
- పేదల భూములు స్వాహా .. రియల్ ప్రాజెక్టుల్లో వాటాలు
- ప్రశ్నించేవారిపై దౌర్జన్యాలు.. టీడీపీ నాయకులపై కేసులు
- టీడీపీ ఆఫీసుపై దాడితో అరాచకం పతాక స్థాయికి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

టీడీపీ నేతలు, కార్యకర్తలు రాజకీయ విరోధిగా భావించే వైఎస్ జగన్‌ను వల్లభనేని వంశీ కలవడం, నడిరోడ్డుపై ఇద్దరూ ఆలింగనం చేసుకోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. అప్పట్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ అర్బన్ అధ్యక్షుడిగా వంశీ ఉన్నారు. ఈ ఉదంతంతో ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి రాజీనామాల వరకూ వెళ్లింది. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయినా రాష్ట్ర విభజన తర్వాత వంశీకి టీడీపీ అధిష్ఠానం గన్నవరం సీటు ఇచ్చింది. ఆ ఎన్నికల్లో గెలిచిన వంశీ.. జగన్‌ను మాత్రం విమర్శించేవారు కాదు. వైసీపీ నేతలతో సత్సంబంధాలను కొనసాగించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. రెండోసారి వైసీపీ హవాలోనూ టీడీపీ శాసనసభ్యుడిగా గెలిచిన ఆయన పార్టీలో మంచి నాయకుడిగా ఎదిగే అవకాశాలను కాలదన్నుకున్నారు. వైసీపీకి చేరువైన తర్వాత మరింత రెచ్చిపోయారు.

గన్నవరంలో అరాచకాలు

గన్నవరంలో తన అనుయాయుల ద్వారా వంశీ సాగించిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. సూరంపల్లిలో గొట్టిపుల్ల పార్థసారథికి చెందిన 9 ఎకరాలను వంశీ అనుచరుడు బలవంతంగా రాయించుకున్నాడు. మండలంలో పలు గ్రామాల పరిధిలో అనేకమంది పేదలు, అసహాయుల నుంచి భూములు లాగేసుకోవడం మాయని మచ్చ. వంశీ అనుచరగణంగా ఉన్న ప్రధాన నాయకులంతా బినామీ పేర్లతో అక్రమ మైనింగ్ తవ్వకాలు అడ్డగోలుగా సాగించారు. నియోజకవర్గంలో కొండలను బోడిగుండుగా మార్చారు. పేదల ఇళ్ల పట్టాల పేరుతో కొండపావులూరులోని సర్వే నం.6లో మూడు కొండలను కరిగించేసి భారీగా బయటకు తరలించారు. జగనన్న ఇళ్ల పేరుతో వంశీ అనుచరులు రైతుల నుంచి తక్కువ ధరకు భూములు కొని, ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించారు. జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల పరిధిలో రూ.కోట్లలో అక్రమాలకు పాల్పడ్డారు. పేదలకు గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన డీఫాం పట్టాలు, బీఫాం పట్టాలను వంశీ అనుయాయులు భారీగా కొనుగోలు చేసి మట్టి తవ్వకాలకు పాల్పడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా కొన్ని భూముల్లో 30 మీటర్ల లోతున మట్టి తవ్వకాలు చేశారు. వంశీ అనుయాయులు రియల్టర్లకు కూడా చుక్కలు చూపించారు. నియోజకవర్గంలో వెంచర్లు, టౌన్‌షిప్‌లు ఏర్పాటుచేస్తే అందులో వీరికి వాటాలు ఇవ్వాల్సిందే. కొంతమందిని తరిమేసి చేజిక్కించుకున్న ఉదంతాలు కూడా ఉన్నాయి. సెయింట్ జాన్స్ హైస్కూల్ దగ్గర జాడీల ఫ్యాక్టరీ స్థలాన్ని ఇలాగే నొక్కేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే వంశీ అనుచరుల సంకల్పసిద్ధి స్కామ్ ఒక్కటి ఒక ఎత్తు. ఈ స్కామ్‌లో పేద, మధ్యతరగతి వర్గాలతో పెట్టుబడులు పెట్టించి కోట్లాది రూపాయలను సమీకరించి బోర్డు తిప్పేశారు. చెరువులు, కాల్వల భూములను అక్రమంగా తనకు నచ్చినవారి పేరుతో క్రమబద్ధీకరించారన్న తీవ్ర విమర్శలు ఉన్నాయి. తనకు నచ్చకపోతే మాత్రం వారి స్వాధీనంలో ఉన్న భూములను లాగేసేందుకు ఎదురు కేసులు పెట్టేవారు. వంశీ గ్యాంగ్ అరాచకాలపై గన్నవరం ప్రజలు ప్రశ్నించటమే కాకుండా న్యాయస్థానాల్లో పోరాటాలు సాగించారు. దీంతో వారిని మానసికంగా దెబ్బతీసేందుకు అధికారాన్ని ఉపయోగించారు. ఆక్రమణలు అంటూ కూల్చివేతలకు సైతం పాల్పడ్డారు. వంశీ అనుయాయుల అక్రమాలను ప్రజల తరఫున టీడీపీ నాయకులు ప్రశ్నిస్తుంటే వారిపైనా తప్పుడు కేసులు పెట్టించారు. నియోజకవర్గంలో టీడీపీని భూస్థాపితం చేసే ఉద్దేశంతో భయాందోళనలు సృష్టించటానికీ ఆయన వెనకాడలేదు. టీడీపీ కార్యాలయంపై దాడి ఇందులో భాగమే.

నా భర్తపై తప్పుడు కేసు పెట్టారు : వల్లభనేని పంకజశ్రీ



విజయవాడ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ్యుడు వల్లభనేని వంశీమోహన్‌ను పోలీసులు ఎందుకు అరెస్టు చేశారో తనకు తెలియదని ఆయన సతీమణి పంకజశ్రీ అన్నారు. విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వంశీని కలుసుకునేందుకు న్యాయవాది తానికొండ చిరంజీవితో కలిసి వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. "మాకు ఇప్పటి వరకు పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వలేదు. రిమాండ్‌కు తీసుకెళ్లినప్పుడు ఇస్తామని చెబుతున్నారు. అరెస్టు చేసిన వెంటనే ఎఫ్ఐఆర్ ఇవ్వకపోవడం చట్టవిరుద్ధం. ఎఫ్ఐఆర్ ఇస్తే మేం కోర్టుకు వెళతామన్న ఉద్దేశంతోనే ఈవిధంగా చేస్తున్నారు. వంశీని అరెస్టు చేస్తున్నట్టు మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారు. వంశీ ఆరోగ్యం బాగోలేదు. ఆయన సమయానికి మందులు వేసుకోవాలి. మధ్యాహ్నం భోజనం పెట్టారో లేదో తెలియడం లేదు. ఆయనకు ఏమైనా జరిగితే దానికి పోలీసులు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. గన్నవరం టీడీపీ ఆఫీసు ఆపరేటరు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసినట్టుగా పోలీసులు ఎలాంటి ఆధారాలను చూపించడం లేదు" అని ఆమె ఆరోపించారు.

'గన్నవరం' కేసులో నిందితులకు షాక్

- 36 మందికి ముందస్తు బెయిల్ నిరాకరణ
- పది మందికి రెగ్యులర్ బెయిల్ మంజూరు
- ఒకరికి ముందస్తు బెయిల్... ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు

విజయవాడ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు తిరస్కరించింది. 36మంది నిందితులు దాఖలు చేసి ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు న్యాయాధికారి హిమబిందు గురువారం తీర్పును వెలువరించారు. రిమాండ్‌లో ఉన్న వింతా ఆదినారాయణరెడ్డి, చిట్టిబొమ్మల కమలాకరరావు, గద్దె సుధీర్, పుట్టి శివకోటేశ్వరరావు, సంగుర్తి నాగదీప్, సంగుర్తి దుర్గారావు, కలపాల అభిరామ్‌లకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. అనారోగ్య కారణాల రీత్యా బయట ఉన్న మన్నే సుందరరావుకు ముందుస్తు బెయిల్ ఇచ్చారు. కాగా, ముందస్తు బెయిల్ కోసం ముగ్గురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక కోర్టులోనే ఈ అంశాన్ని తేల్చుకోవాలని సుప్రీంకోర్టు కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ముగ్గురికి రెగ్యులర్ బెయిల్‌ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు మంజూరు చేసింది.



మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కొనకళ్ల, యార్లగడ్డ వెంకట్రావు, కొల్లు రవీంద్ర

పాపం పండింది!

- కక్షసాధించాలనుకుంటే ఎప్పుడో జైలుకెళ్లేవారు: కొల్లు రవీంద్ర
- ప్రతీకారం తీర్చుకునే అవసరం 'కూటమి'కి లేదు: అచ్చెన్న
- వంశీలాంటి మృగాలకు జైలే గతి: సోమిరెడ్డి
- వంశీపై మరిన్ని కేసులు పెట్టడం ఖాయం: యార్లగడ్డ వెంకట్రావు
- అక్రమ కేసులు బనాయించే సంస్కృతి వైసీపీదే: కొనకళ్ల
- నాపైనా దాడి చేశారు.. ఆ ఫిర్యాదును విచారించాలి: నాదెండ్ల బ్రహ్మం

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నాయకులపై కక్ష సాధించాలనుకుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే వంశీ, కొడాలి నాని వంటివారు జైలుకు వెళ్లేవారు. కక్షసాధింపు అనేది టీడీపీ డిక్షనరీలో లేదు' అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ అరెస్టుపై పలువురు టీడీపీ నేతలు స్పందించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో, సచివాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... 'తప్పు చేసి ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి మరో తప్పు చేసి వంశీ అడ్డంగా దొరికిపోయాడు. జగన్ హయాంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలైంది. రాష్ట్రవ్యాప్తంగా నాతోసహా అనేక మంది టీడీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టారు' అని అన్నారు.

వంశీ అరెస్టు కక్షసాధింపు కాదు: మంత్రి అచ్చెన్న

దాడికి ప్రతిదాడి, వేధింపులపై ప్రతీకారం తీర్చుకునే అవసరం కూటమి ప్రభుత్వానికి, టీడీపీకి లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. తప్పు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని, అలాగని కక్ష తీర్చుకోవడం తమ విధానం కాదు' అని అన్నారు. వంశీ లాంటి మృగాలు ఉండాల్సింది జైలులోనేనని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. వంశీతోపాటు త్వరలో మరో మూడు మృగాలు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించాల్సినవారే చీడ పురుగల్లా తయారయ్యారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఈ అరెస్టుతో వంశీ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయి. ఆయనపై త్వరలో మరిన్ని కేసులు పెట్టడం ఖాయమని యార్లగడ్డ అన్నారు. వంశీ పాపాల పుట్ట బద్దలైందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పెద్ద సైకో డైరెక్షన్‌లో పనిచేస్తున్న చిన్న సైకో చివరకు కటకటాలపాలయ్యాడన్నారు. అక్రమ కేసులు బనాయించే సంస్కృతి వైసీపీదేనని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసి, వారిపైనే కేసులు పెట్టించిన ఘనుడు వంశీ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం మాట్లాడుతూ.. 'నా ఇంటిపైనా వంశీ, ఆయన అనుచరులు దాడి చేశారు. తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో కేసుకూడా పెట్టాను. ఆ ఫిర్యాదుపైనా పోలీసులు చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. వంశీ పెద్ద అరాచకశక్తి అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు.

చంద్రబాబు ప్రతీకార రాజకీయాలు చేయరు: కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రతీకార రాజకీయాలకు పాల్పడే వ్యక్తి కాదని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చట్టాన్ని, తమకున్న అధికారాలను మీరి చేయకూడని పనులకు పాల్పడ్డవారిపై చట్టపరంగా చర్యలు ఖచ్చితంగా ఉంటాయని స్పష్టం చేశారు. గురువారం, ఇక్కడ ఏపీ భవన్‌లో టీడీపీ నాయకురాలు తిరునగరి జ్యోత్స్న, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. ఎలాంటి తప్పులు చేయని చంద్రబాబును నాడు వైసీపీ ప్రభుత్వం చట్టాన్ని అతిక్రమించి అరెస్టు చేసిందని అన్నారు.

టాప్ 4లో సీఎం చంద్రబాబు



- ఇండియా టుడే సర్వేలో నాల్గవ స్థానం
- 'మూడ్ ఆఫ్ ది నేషన్'లో తాజాగా వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని ఉత్తమ ముఖ్యమంత్రుల్లో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు 4వ స్థానంలో నిలిచారు. ఇండియా టుడే పత్రిక నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో ఏపీ సీఎం గత ఏడాది ఆగస్టులో 5వ స్థానంలో నిలవగా ఈసారి 4వ స్థానానికి చేరుకున్నారు. ఏడాదికి రెండుసార్లు నిర్వహించే ఈ సర్వేలో భాగంగా ముఖ్యమంత్రుల పనితీరు, వారిపై ప్రజలకు ఉన్న అభిప్రాయం ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తుంది. దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాల్లో ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సర్వే ఫలితాలను ఇండియా టుడే గ్రూప్ వెల్లడించింది. తాజా సర్వేలో మొదటి స్థానంలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ నిలవగా, రెండు, మూడు స్థానాల్లో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం స్టాలిన్ నిలిచారు. 2024 ఆగస్టులో సర్వే నిర్వహించే నాటికి సీఎంగా చంద్రబాబు బాధ్యతలు తీసుకుని నెల రోజులు కూడా పూర్తికాలేదు. కానీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ద్వారా దేశవ్యాప్తంగా చంద్రబాబు ఇమేజ్ గణనీయంగా పెరిగింది. ప్రస్తుత సర్వేలో ఆరేడు నెలల కాలంలో విధ్వంస ఏపీని గాడిన పెట్టేందుకు ఆయన తీసుకుంటున్న చర్యలు, దావోస్‌లో ఏపీ ఇమేజ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నాలు, కేవలం 7 నెలల కాలంలో సుమారు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకురావడంలో ఆయన చేసిన కృషి... వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని దేశవ్యాప్తంగా ప్రజలు ఆయన్ను ఉత్తమ సీఎంలలో నాల్గవ స్థానంలో నిలిపారు. తొలి తొమ్మిది స్థానాల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి చోటు దక్కలేదు.

హంసల ప్రేమ సందేశం



శుక్రవారం ఫిబ్రవరి 14.. వాలంటైన్స్ డే. ఈ సందర్భంగా విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలోని ఆస్ట్రేలియాకు చెందిన నల్ల హంసలు ఇలా ప్రేమ సందేశాన్ని అందించాయి.
- ఆరిలోవ(విశాఖపట్నం), ఆంధ్రజ్యోతి

నీటి ప్రాజెక్టులు గడువులోగా పూర్తవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మేర పూర్తయిందని తెలిపారు. కుడి, ఎడమ కాలువ కనెక్టివిటీ పనుల్లో కొంత జాప్యం ఉందన్నారు. వచ్చే సమీక్ష నాటికి పోలవరం కనెక్టివిటీ పనుల్లో వేగాన్ని పెంచాలన్నారు. 'పోలవరం నిర్మాణం రోజువారీగా ఎంత జరగాలి.. ఎంత జరిగిందో కాంట్రాక్టు సంస్థలు, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉండాలి. లక్ష్యాల మేరకు పనులు పూర్తిచేయకపోతే వారినే బాధ్యులను చేస్తాం. హెడ్‌వర్క్స్ పనులు 2027 డిసెంబరు నాటికి పూర్తిచేయాల్సిందే. మొదట 17,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో డిజైన్ చేసినట్లుగానే కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. ఎడమ కాలువ పనులు ఈ ఏడాది పూర్తి చేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా గోదావరి జలాలను వెనుకబడిన ఉత్తరాంధ్రకు తరలించే చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతలపై న్యాయస్థానంలో ఉన్న కేసులను పరిష్కరించాలి' అని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల జాప్యంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తానే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని.. 30 ఏళ్లుగా ఇంకా నిర్మాణ దశలోనే ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. భూగర్భ జలాల పెంపు తన స్వప్నమని చంద్రబాబు అన్నారు. 'భూగర్భ జలాలు 3నుంచి 9మీటర్ల లోతులోనే లభ్యం కావాలి. పంచాయతీరాజ్, అటవీ, జల వనరులు, వ్యవసాయ, పురపాలక శాఖల మంత్రులతో కమిటీని వేయాలి. భూగర్భజలాల పెంపుపై ఈ కమిటీ నిర్మాణాత్మకమైన ఆలోచనలను అమలు చేయాలి' అని సూచించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రాజెక్టులపై కార్యాచరణ

వైసీపీ పాలనలో విధ్వంసానికి గురైన ప్రాజెక్టుల వేగాన్ని పెంచి కార్యాచరణ లక్ష్యం మేరకు పూర్తిచేయాలని జలవనరుల శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. పోలవరం-బనకచర్ల అనుసంధానం పథకాన్ని మూడు దశల్లో పూర్తి చేస్తామని సీఎం సమీక్షలో కార్యాచరణను వెల్లడించింది. దీనిలో భాగంగా ఏటా జూలై 1 నుంచి 100 రోజులపాటు రోజుకు 2.46 టీఎంసీల చొప్పున 246 టీఎంసీలను తరలిస్తారు. కుడి ప్రధాన కాలువను 17,500 నుంచి 35,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి విస్తరిస్తారు. మొదటి దశలో తాటిపూడి వరద కాలువ వద్ద 18,000 క్యూసెక్కులను.. మిగిలిన 17,500 క్యూసెక్కులను కుడి కాలువ నుంచి ప్రకాశం బ్యారేజీకి తరలిస్తారు. సెగ్మెంట్-2లో ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లికి గోదావరి జలాలను తరలిస్తారు. వైకుంఠపురం హెడ్‌వర్క్స్ నుంచి బొల్లాపల్లి రిజర్వాయరుకు తరలిస్తారు. ఇందుకోసం 6 ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తారు. బొల్లాపల్లి రిజర్వాయరును 150 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తారు. 15హేబిటేషన్ల గుండా 31 కిలోమీటర్ల గోదావరి జలాలను తరలేలా కార్యాచరణ సిద్ధం చేశారు. గోదావరి జలాలను నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువకు అనుసంధానం చేస్తారు. మూడో సెగ్మెంట్‌లో బొల్లాపల్లి నుంచి 115 కిమీ మేర బనకచర్లకు 23,000 క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. కాగా, కూటమి ప్రభుత్వంలో ఆరు నెలలకే అంటే డిసెంబరు నాటికే 77.31% మేర పోలవరం ప్రాజెక్టు పనులు (5.38%) పూర్తయ్యాయి. కొత్త డయాఫ్రం వాల్ పనులు ఈ ఏడాది చివరకు పూర్తవుతాయి. కాగా..హంద్రీ-నీవా తొలిదశ పనులను 2026కల్లా పూర్తిచేయాలని జలవనరుల శాఖ డెడ్‌లైన్ పెట్టుకుంది. ఈ ఏడాది మే నాటికి పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్ పూర్తి చేయాలని కార్యాచరణ సిద్ధం చేసింది.

ఎలక్ట్రానిక్స్‌లో పెట్టుబడులకు తైవాన్ సంసిద్ధత

- మంత్రి లోకేశ్‌తో ఆ దేశ బృందం భేటీ
- ఫుట్‌వేర్, టెక్స్‌టైల్ రంగాల్లోనూ ఆసక్తి
- లక్షలాది యువతకు ఉద్యోగాలు వస్తాయని లోకేశ్ ఆశాభావం



మంత్రి నారా లోకేశ్‌తో తైపీ ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్, చెన్నై డైరెక్టర్ జనరల్ రిచర్డ్ చెన్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ రంగంలో గ్లోబల్ లీడర్‌గా వెలుగొందుతున్న తైవాన్.. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఉండవల్లిలోని నివాసంలో గురువారం మానవ వనరులు, ఆర్టీజీఎస్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో తైపీ ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్, చెన్నై డైరెక్టర్ జనరల్ రిచర్డ్ చెన్, నెగ్గు సింజో కన్సల్టెన్సీ ఎండీ ఎరిక్ చాంగ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, ఫుట్‌వేర్, టెక్స్‌టైల్ రంగాల అభివృద్ధికి తైవాన్ సహకరించాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. వారి సహకారం మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉపయోగిస్తుందని చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు దక్కుతాయన్నారు. తైవాన్ పారిశ్రామిక సంస్థలు విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నందున ఆంధ్రప్రదేశ్‌లోనూ పెట్టుబడులు పెట్టాలని ఇక్కడ వ్యాపారాన్ని కొనసాగించాలని లోకేశ్ కోరారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్, ఫుట్‌వేర్ పార్కుల ఏర్పాటులో ఆదేశ కంపెనీలతో భాగస్వామ్యం కావడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉందని తెలిపారు.

పర్యాటకంలో 20% వృద్ధి లక్ష్యం

- హోటళ్లలో ప్రకృతి సేద్య ఆహారం ప్రమోట్ చేయాలి: ముఖ్యమంత్రి



పర్యాటక శాఖ అభివృద్ధిపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి కందుల దుర్గేశ్, టూరిజం శాఖ కార్యదర్శి అజయ్ జైన్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరంలో పర్యాటక శాఖ 20 శాతం వృద్ధి రేటు సాధించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా నిర్దేశించారు. గురువారం సచివాలయంలో పర్యాటక శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. పర్యాటక, సాంస్కృతిక కార్యక్రమాలు, హోటల్ గదుల నిర్మాణం, పెట్టుబడులు, భూమి లీజ్ పాలసీ, హోంస్టేలు వంటి వాటిపై చర్చించారు. రాష్ట్రానికి వచ్చే పర్యాటకులు 'ఏపీ హ్యాపీ' అనుకునేలా అన్ని సదుపాయాలు ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రూ. 1,217 కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని అధికారులు వివరించారు. రూ. 45 కోట్లతో 11 టూరిజం రిసార్టులు, హోటళ్ల పునరుద్ధరించామని తెలిపారు. కేంద్రం నుంచి ప్రసాద్ పథకంలో భాగంగా అన్నవరం దేవాలయం, ఎస్ఏఎస్‌సీఐ కింద గండికోట, అఖండ గోదావరి, స్వదేశ్ దర్శన్ 2.0 కింద అరకు, లంబసింగి, చాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ కింద అహోబిలం, నాగార్జునసాగర్ ఎంపికైనట్లు సీఎంకు తెలిపారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు 2025-26 ఏడాదికి టూరిజం ఈవెంట్స్ క్యాలెండర్‌ను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా మొత్తం 37 టూరిజం ఈవెంట్స్‌లో 2 ఇంటర్నేషనల్ ఈవెంట్స్, 12 మెగా ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు వివరించగా.. సీఎం కల్పించుకుని మెగా ఈవెంట్స్ యూనివర్సిటీల్లో నిర్వహించాలని సూచించారు. విశాఖ, అమరావతి, తిరుపతి శిల్పారామాల్లో ఏడాది పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నంది అవార్డుల ప్రదానంపైనా వెంటనే కసరత్తు చేయాలని ఆదేశించారు. వీటితో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ క్యాలెండర్ కూడా రూపొందించాలన్నారు. రాష్ట్ర, జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో కల్చరల్ ఈవెంట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో సంక్రాంతి సంబరాలు, ఉగాది ఉత్సవాలు అన్ని జిల్లాల్లోనూ, 10 జిల్లాల్లో 9 రాష్ట్ర స్థాయి ఈవెంట్స్ నిర్వహించనున్నారు.

గండికోట లాంటి ప్రాంతం ఎక్కడా లేదు..

జల, గిరి, వన దుర్గంగా పేరుగాంచిన గండికోట లాంటి ప్రాంతం దేశంలో ఎక్కడా లేదని, దీనికి మరింత ప్రచారం కల్పించాలని సీఎం సూచించారు. గండికోట కడప దర్గా, ఒంటిమిట్ట రామాలయం, సోమశిల ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించారు. డ్యామ్, అడవి, మల్లన్న దేవాలయం అన్నీ ఒకేచోట ఉండి.. పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందడానికి శ్రీశైలానికి అవకాశం ఉందన్నారు. అక్కడ రోడ్ల వెడల్పునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యాటక శాఖకు ఎంత విలువ చేసే ఆస్తులున్నాయో అంచనా వేయాలని సీఎం చెప్పారు. ఆదాయం ఎక్కువగా వచ్చేచోట ప్రోత్సాహకాలు మరింత పెంచాలన్నారు.

జలపాతాలను గుర్తించాలి

తిరుపతి, విశాఖలో జూ పార్కులు ఉన్నట్లు ఇప్పటికి చాలామందికి తెలియడం లేదని, వాటికి ప్రచారం కల్పించి సందర్శకులను పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏయే ప్రాంతాల్లో జలపాతాలున్నాయో గుర్తించి వాటికీ ప్రచారం కల్పించాలన్నారు. విశాఖ, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, తిరుపతిని పర్యాటకంలో యాంకర్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలన్నారు. కోనసీమలో హౌస్ బోట్స్ ప్రవేశపెట్టడంతో పాటు విశాఖ బీచ్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు. గండికోట, సూర్యలంక, లంబసింగిని టెంట్ సిటీలుగా తీర్చిదిద్దాలని, ఈ ప్రక్రియ 90రోజుల్లో పూర్తి చేయాలని, కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మరో నాలుగు నెలల్లో ఏపీ హ్యాపీ స్టేట్ అని పర్యాటకులు అనుకునే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమీక్షలో మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి పాల్గొన్నారు.

మంత్రి మెహర్బానీ ఖరీదు రూ.343 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా బల్బులు కాలిపోతున్నాయని.. విద్యుత్ ఉపకరణాలు చెడిపోతున్నాయంటూ ముగ్గురు ఎమ్మెల్యేలు ఎస్పీడీసీఎల్‌కు లేఖ రాశారు. విద్యుత్ ప్రవాహ సామర్థ్యాన్ని (కెపాసిటీ)ని పెంచితే.. లోవోల్టేజీ సమస్య ఉండదని సూచించారు. ఆ ఎమ్మెల్యేల సిఫారసు మేరకు రూ.343 కోట్లతో ఈ మూడు జిల్లాల్లో 33 కేవీ లైన్ వేసేందుకు ఎస్పీడీసీఎల్ కార్యాచరణ సిద్ధం చేసి టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ తతంగాన్ని రాయలసీమ మంత్రి దగ్గరుండి నడిపించారని.. డిస్కంకు లేఖలు రాసినందుకు.. ఆ ఎమ్మెల్యేలకు తలో రూ.కోటి చెల్లించారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. లేఖకు కోటి ఇచ్చేటట్లయితే.. తమను కూడా అడిగితే ఇచ్చేవారిమని మరికొందరు ఎమ్మెల్యేలు బాధపడుతున్నారు. ఇప్పుడు లేఖకు కోటి సంపాదించిన ఎమ్మెల్యేల గురించే రాయలసీమలో చర్చ జరుగుతోంది.

పనుల కార్యాచరణ ఇదీ..

పాత లైన్ స్థానంలో కొత్తది వేసేందుకుగాను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి అప్పు తెచ్చి మరీ 33 కేవీ లైన్‌ను, 157 చదరపు మీటర్ల ఏఎల్ కండక్టర్‌ను వేసేందుకు ఎస్పీడీసీఎల్ సిద్ధమైంది. ఇందులో కడప డివిజన్ పరిధిలో 28 కిలోమీటర్లు, అన్నమయ్య జిల్లాలో 25 కిమీ, ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో 52.5 కిమీ మేర వైర్లను వేసేందుకు కార్యాచరణ రూపొందించింది. కొత్తగా 11 కేవీ ఇంటర్ లింకింగ్ పనుల కోసం వైర్లు, టవర్ల కొనుగోలుకు టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో కోట్ల రూపాయల ముడుపులు చేతులు మారాయన్న సమాచారం ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) దృష్టికి వెళ్లిందని విద్యుత్ రంగ వర్గాలు చెబుతున్నాయి. దీంతో చర్యలు చేపట్టేందుకు ఉన్నత స్థాయి అధికారులు సిద్ధపడుతున్నారని అంటున్నాయి.

తమిళనాడుకు చేరిన పవన్ ఆధ్యాత్మిక యాత్ర

- తంజావూరు, కుంభకోణం ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కందషష్టి కవచ పారాయణంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం
- ఆలయాల్లో రాజకీయాలు వద్దు ప్లీజ్..
- మీడియాకు జనసేన అధినేత వినతి



తమిళనాడులోని కుంభకోణంలో శ్రీ ఆదికుంభేశ్వరస్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కు గజస్వాగతం

చెన్నై, అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం తమిళనాడులోని తంజావూరు చుట్టుపక్కలున్న వివిధ ఆలయాలను సందర్శించారు. బుధవారం కేరళలోని ఆలయాలను సందర్శించిన పవన్.. గురువారం తొలుత ఓంకార మంత్ర రహస్యాన్ని సృష్టికి అందించిన క్షేత్రంగా, షష్ఠ షణ్ముఖ క్షేత్రాల్లో ఐదవదిగా పేరుగాంచిన తంజావూరు జిల్లా స్వామిమలైలో కొలువైన స్వామినాథ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. పవన్ పంచహారతులతో హారతి ఇచ్చి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్తంభానికి మొక్కారు. స్వామినాథ స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కంద షష్ఠి కవచ పారాయణంలో పాల్గొన్నారు. తరువాత ఆ ఆలయంలో వెలసిన ఆదిదంపతులు సుందరేశ్వరన్ స్వామి, మీనాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌కు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఉమాదేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తంజావూరు జిల్లా కుంభకోణంలో వున్న శ్రీ ఆది కుంభేశ్వరాలయాన్ని పవన్ సందర్శించారు. ఆలయ సంప్రదాయం మేరకు మొదట ఆది వినాయగర్‌ని పూజించారు. అనంతరం శ్రీ ఆదికుంభేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమృతభాండాకారంలో వున్న శివలింగ విశిష్టతను ఆలయ అర్చకులు వివరించారు. అమృతం, ఇసుకతో కలగలసి ఉద్భవించిన ఈ లింగానికి అభిషేకాలు నిర్వహించరని తెలిసి, విశిష్ఠ పూజలు నిర్వహించారు. పంచహారతులు ఇచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆది కుంభేశ్వరాలయంలో స్వామివారికి ఎడమవైపు వెలసిన పార్వతీదేవి అవతారం శ్రీ మంగనాయకి అమ్మవారికి కూడా పవన్ పూజలు నిర్వహించారు. అనంతరం ఇదే ఆలయ ప్రాంగణంలో వున్న అగస్త్య ధ్యాన పీఠాన్ని సందర్శించారు. ఈ ప్రాంతంలో కూర్చుంటే తెలియకుండానే ధ్యాన ముద్రలోకి వెళ్తారని మందిరం విశిష్ఠతను అర్చకులు ఈ సందర్భంగా వివరించారు. అంతకు ముందు ఆలయ ఆస్థాన గజం మంగళంతో కలిసి అర్చకులు, అధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికారు. ఆలయ ఆస్థాన ఏనుగుకు పవన్ అరటి పళ్లు అందించి ఆశీస్సులు పొందారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మురుగన్, ట్రస్టు బోర్డు సభ్యులు బాల సుబ్రహ్మణ్యం, శంకరరాణి, చిదంబరం తదితరులు పవన్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందించి సత్కరించారు.

ఆలయాల్లో రాజకీయాలు వద్దు ప్లీజ్!

శ్రీ ఆదికుంభేశ్వరాలయ సందర్శనానంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ... 'నాలుగేళ్లుగా శ్రీ అగస్త్య మహాముని ఆలయం, స్వామిమలై శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్ర దర్శనం కోసం వేచిచూస్తున్నా. ఇప్పటికి ఆ మురుగన్ అనుగ్రహం లభించింది' అని అన్నారు. తమిళనాడులో విజయ్ రాజకీయ ప్రస్థానం గురించి ప్రస్తావించగా... ఆలయాల్లో రాజకీయాలు వద్దంటూ సున్నితంగా తిరస్కరించారు. కాగా కుంభకోణం వచ్చిన పవన్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. తెలుగు విద్యార్థులు, అభిమానులతో పవన్ సెల్ఫీలు దిగారు. అదేవిధంగా ఓ దుకాణంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'కుంభకోణం డిక్రీ' కాఫీని పవన్ రుచి చూశారు. పవన్ వెంట ఆయన కుమారుడు అకిరా నందన్, టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి కూడా వున్నారు. ఇదిలా వుండగా శుక్రవారం పవన్ కల్యాణ్ తూత్తుకుడి జిల్లా తిరుచ్చెందూర్, మదురై మీనాక్షి, పళని మురుగన్, తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను కూడా సందర్శించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.



తిరుమలలో పాపవినాశనం జలాశయాన్ని పరిశీలిస్తున్న సలహాదారు కన్నయ్యనాయుడు

పాపవినాశనం డ్యాం గేట్లలో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయ్!

- కొత్త వాటికి డిజైన్ చేస్తున్నాం
- ప్రభుత్వ సలహాదారు కన్నయ్యనాయుడి వెల్లడి

తిరుమల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అతిపెద్ద జలాశయం పాపవినాశనం గేట్లలో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయని రాష్ట్ర జనవరులశాఖ సలహాదారు, ప్రముఖ విశ్రాంత ఇంజనీర్ కన్నయ్యనాయుడు తెలిపారు. ఆయన తన బృందంతో కలిసి గురువారం పాపవినాశనం, గోగర్భం డ్యాములు పరిశీలించారు. అనంతరం ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'పాపవినాశనం డ్యాం గేట్లలో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతమున్న గేట్లు మరో రెండేళ్లు గట్టిగానే ఉంటాయి. ఈలోపే 6.1 మీటర్లు వెడల్పు, 6.8 మీటర్లు ఎత్తుతో కొత్త గేట్ల డిజైన్‌కు ప్లాన్ చేస్తున్నాం. అన్నీ పూర్తయితే మరో 30 ఏళ్లు డ్యాం పటిష్ఠంగా ఉంటుంది. గడ్డర్‌లో ఉన్న లీకేజీలను కూడా అడ్డుకోవాలి' అని వివరించారు. నెల్లూరు జిల్లాలోని సోమశిల డ్యాంనూ పరిశీలించామని.. అందులో కూడా చాలా మరమ్మతులు చేయాల్సిన అవసరముందని కన్నయ్యనాయుడు తెలిపారు.

జల వనరుల సాంకేతిక సలహా కమిటీ ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నీటి వనరుల సంరక్షణ, మరమ్మతు, ఆధునీకరణ కోసం జల వనరుల సాంకేతిక సలహా కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వు జారీ చేశారు. రాష్ట్ర స్థాయి సాంకేతిక సలహా కమిటీ చైర్మన్‌గా జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు. మైనర్, మీడియం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కన్వీనరుగా ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

పనికిరాని వైద్య పరికరాల డిస్పోజల్‌కు గ్రీన్‌సిగ్నల్

ప్రభుత్వాస్పత్రుల్లో కొన్నేళ్లుగా ఉపయోగంలో లేని, పనికిరాని వైద్య పరికరాలు, సామగ్రి, ఇతర వస్తువులను తొలగించేందు(డిస్పోజల్)కు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆమోదించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రుల వారీగా పేరుకుపోయిన వ్యర్థ పరికరాల విలువను అంచనా వేయాలని ఆదేశించారు. పనికిరాని వస్తు సామగ్రిని 45 రోజుల్లో డిస్పోజల్ చేయాలని ఆదేశించారు.

మే 19 నుంచి ఈఏపీసెట్

సెట్	తేదీలు	యూనివర్సిటీ
ఆర్‌సెట్	మే 2-5	శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ
ఈసెట్	మే 6	జేఎన్‌టీయూ అనంతపురం
ఐసెట్	మే 7	ఆంధ్రా యూనివర్సిటీ
ఈఏపీసెట్ అగ్రి, ఫార్మసీ	మే 19-20	జేఎన్‌టీయూ కాకినాడ
ఈఏపీసెట్ ఇంజనీరింగ్	మే 21-27	
లాసెట్	మే 25	పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం
పీజీఈసెట్	జూన్ 5-7	ఆంధ్రా యూనివర్సిటీ
ఎడ్‌సెట్	జూన్ 8	నాగార్జున యూనివర్సిటీ
పీజీసెట్	జూన్ 9-13	శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ
పీఈసెట్	జూన్ 25	నాగార్జున యూనివర్సిటీ

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరంలో ఉన్నత విద్య ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రవేశ పరీక్షల తేదీలు ప్రకటించింది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ పరీక్షలు మే 19 నుంచి ప్రారంభం కానున్నాయి. 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలు, 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు జరుగుతాయి. మొత్తం 10 ప్రవేశ పరీక్షల తేదీలను ఉన్నత విద్యామండలి గురువారం రాత్రి ఆలస్యంగా ప్రకటించింది. ప్రవేశ పరీక్షల బాధ్యతను వివిధ యూనివర్సిటీలకు అప్పగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది.



వైసీపీ మాజీ మంత్రి ఆళ్ల నానీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం చంద్రబాబు

టీడీపీలోకి ఆళ్లనాని

- కండువాకప్పి ఆహ్వానించిన చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గురువారం టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఆళ్ల నానికి టీడీపీ కండువా కప్పిన సీఎం చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కె.పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, సీనియర్ టీడీపీ నేత సుజయ్ కృష్ణ రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఆళ్ల నాని మూడు సార్లు ఎమ్మెల్యేగా చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా చేశారు. ఏలూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన మూడు నెలల క్రితమే వైసీపీకి రాజీనామా చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.